www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 14-4-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 360 | హైదరాబాద్ సిటీ

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి ఉ. 11.44 తదుపరి సప్తమి; నక్షత్రం: ఆర్ద్ర రా.1.35 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ.6.29-11.08; దుర్ముహూర్తం: సా.4.48-5.37; అమృతఘడియలు: మ.3.15-4.54; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.27

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



'హెల్త్ డ్రింక్స్' నుంచి..
బోర్న్‌విటా ఔట్!

ఆ తరహా ఇతర ఉత్పత్తులు, డ్రింక్స్, బేవరేజెస్‌ను కూడా తొలగించాల్సిందే 2

ఈ-కామర్స్ సంస్థలకు కేంద్రం ఆదేశం

బాలల కమిషన్ సిఫారసులతో నిర్ణయం

బోర్న్‌విటాలో అధిక చక్కెర స్థాయిలు!



బీర్.. నో స్టాక్!

రాష్ట్రంలోని వైన్ షాపుల్లో బీర్ల కొరత

ఎండల తీవ్రతతో భారీ డిమాండ్ 14

ఉత్పత్తి, విక్రయాల మధ్య భారీ అంతరం

55 లక్షల కేసులకు.. వస్తున్నది 45 లక్షలే

'కోటా'లో వైన్‌షాపులు, బార్లకు సరఫరా



అమ్మో.. అమెరికా!

4 నెలల్లో 11 మంది భారతీయుల మృతి

గన్ కల్చర్, విద్వేష నేరాలు, జాతి దూషణలు

హిందూ ఫోబియా కూడా ఓ కారణమేనా?

ప్రముఖ డయాస్పోరా సంస్థ అధ్యయనం

పుట్టెడు దుఃఖంలో 43 లక్షల రుణ భారం

హైదరాబాదీ విద్యార్థి కుటుంబం వేదన 2



విపక్ష నేతలు అజ్ఞానులు

ఆ మాటంటే ఓ నేతను ఉద్దేశించేనంటారు

14 గేమర్స్‌తో ప్రధాని మాటామంతీ

కాంగ్రెస్ పార్టీకి భజన చేస్తున్న ఎంఐఎం

బీజేపీ ప్రజాదరణ చూసి ఒవైసీకి భయం

అందుకే హస్తంతో దోస్తీ: కిషన్‌రెడ్డి

12 నేడు బీజేపీ మ్యానిఫెస్టో విడుదల

ట్యాపింగ్ బ్యాకప్!


స్టోరేజ్ డివైజ్‌లలో భద్రపరిచిన ప్రణీత్‌రావు!.. అవి దొరికితే.. బలమైన ఆధారాలున్నట్లే

సీజ్ చేసే పనిలో దర్యాప్తు అధికారులు బిజీ.. ఈ కేసులో.. ఇప్పటికి 40 మంది విచారణ

ప్రణీత్‌రావు ఇంత చేసినా రిలీవింగ్ సమయంలో ఎస్ఐబీ నుంచి 'నో డ్యూస్'

ఎన్నికల్లో పోటీ చేయలే.. డబ్బెలా తరలిస్తా: మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో శనివారం కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రణీత్‌రావు ఎస్ఐబీలోని తన విభాగంలో ఉన్న 17 కంప్యూటర్ల హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే..! ఆ హార్డ్‌డిస్క్ శకలాలు లభించినా.. వాటి నుంచి డేటా రికవరీ సాధ్యం కాదు. సీరియస్ కేసు కావడం.. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన అంశం కావడంతో.. నిందితులకు శిక్ష పడేలా ఆధారాల కోసం అన్వేషిస్తున్న దర్యాప్తు అధికారులు.. ఆ డేటా బ్యాకప్ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది. ప్రణీత్‌రావు హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడానికి ముందు.. పెన్‌డ్రైవ్‌లు, ఫ్లాష్‌డ్రైవ్‌లు, ఎక్స్‌టర్నల్ హార్డ్‌డిస్క్‌లలో బ్యాకప్ తీసుకున్నట్లు సమాచారం. ఆ బ్యాకప్ లభిస్తే.. కోర్టుల్లో కేసు ఎక్కడా వీగిపోకుండా, నిందితులకు శిక్షపడేలా చేయవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. నిజానికి చట్టబద్ధంగా ఫోన్‌ట్యాపింగ్ చేస్తే.. టార్గెట్ వ్యక్తులు ఏమేం మాట్లాడుకుంటున్నారనేది నేరుగా వినొచ్చు. అలా వింటూనే రికార్డ్ చేయవచ్చు. కానీ, ప్రభాకర్‌రావు అండ్ కో చేసింది అనధికారిక ఫోన్ ట్యాపింగ్ కావడంతో.. ఈ ప్రక్రియలో కొంత తేడా ఉంటుంది. ప్రత్యేక డివైజ్‌ల ద్వారా చేసే ఫోన్ ట్యాపింగ్‌లో తొలుత టార్గెట్ వ్యక్తుల సంభాషణలన్నీ ఎన్‌క్రిప్టెడ్ ఫైల్స్ రూపంలో సేవ్ అవుతాయి. ఆ ఫైల్స్‌ను డీక్రిప్ట్ చేసి, ఆడియో ఫార్మాట్‌లో సేవ్ చేస్తే తప్ప.. ఇతరులు వినడానికి వీలు ఉండదు. అలా ప్రణీత్‌రావు డీక్రిప్ట్ చేసిన ఫైళ్లను విని, పెన్‌డ్రైవ్‌లలో గత ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లేవాడని తెలుస్తోంది. ఇప్పుడు ఆ పెన్/ఫ్లాష్ డ్రైవ్‌లు, ఎక్స్‌టర్నల్ హార్డ్‌డిస్క్‌లను గుర్తించి, సీజ్ చేసే పనిలో దర్యాప్తు అధికారులు ఉన్నారు. ఈ కేసులో పోలీసు శాఖకు చెందిన నిందితుల అరెస్టులు, సాక్షుల విచారణ పూర్తయినట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అండ్ కో పరిధిలో పనిచేసే హోంగార్డు మొదలు.. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి వరకు ఉన్నారు.



40 మంది సాక్షులే..!

ఈ కోవలో ఉన్న సుమారు 40 మందికి తాము ఏం చేస్తున్నాం? ఎవరి కోసం చేస్తున్నాం? అనేదానిపై పూర్తి స్థాయి అవగాహన లేదని దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ 40 మందిని సాక్షులుగా విచారించినట్లు తెలిసింది. వారి వాంగ్మూలాలను రికార్డు చేసుకుని, పంపినట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా అవసరమైతే వీరిని మరోమారు విచారించే అవకాశాలున్నాయి. ఇక ఈ కేసులో కీలక పాత్రధారిగా గుర్తించిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు విషయంలో తదుపరి చర్యలపై దర్యాప్తు అధికారులు న్యాయ నిపుణుల సలహాలను తీసుకుంటున్నారు. కాగా, పోలీసు శాఖలో అధికారుల

మిగతా 3వ పేజీలో...



శరత్ రూ.14 కోట్లు ఎందుకిచ్చారు?

ఆమ్ ఆద్మీ పార్టీకి రూ. 25 కోట్లు ఇవ్వమని మీరు బెదిరించారా? 3

వ్యాపారం చేయలేవని భయపెట్టారా?

జాగృతికి 80 లక్షల ఫండ్ మాటేమిటి?

కవితకు 5 గంటలు సీబీఐ ప్రశ్నలు

సాక్ష్యాలను చూపిన దర్యాప్తు సంస్థ

జవాబులు దాటవేసిన ఎమ్మెల్సీ కవిత

అప్రూవర్ల వాంగ్మూలాలతో దర్యాప్తు



గాలిదుమారానికి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై విరిగి పడిన విద్యుత్తు స్తంభం

వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం 13

బషీరాబాద్ మండలంలో 4.7 సెం.మీ.

హైదరాబాద్-బీజాపూర్ రోడ్డుపై ట్రాఫిక్

కేంద్రంలో కాంగ్రెస్సే!

ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చేది మా పార్టీనే

బీఆర్ఎస్ ఉనికి చాటే పరిస్థితి కూడా లేదు: రేవంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి సమక్షంలో జోరుగా పార్టీలోకి చేరికలు

బీజేపీ నేతలు పులిమామిడి రాజు, జలంధర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి

మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, బీఆర్ఎస్ నేత ముద్దగోని..

'ఘట్‌కేసర్' చైర్‌పర్సన్ పావని, మరో కౌన్సిలర్ సైతం



రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రాజు, చిత్రంలో సురేఖ, జగ్గారెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించి అధికారంలోకి రాబోతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ కనీసం ఉనికిని చాటుకునే పరిస్థితి కూడా లేదని వ్యాఖ్యానించారు. శనివారం సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లోకి ప్రతిపక్ష పార్టీల నుంచి జోరుగా చేరికలు కొనసాగాయి. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ

మిగతా 13వ పేజీలో...

సమస్యలు ఏమున్నయి?

13

నేడు అభ్యర్థులతో కేసీ వేణుగోపాల్ భేటీ

ఖమ్మం, కరీంనగర్‌లపై స్పష్టత వచ్చే అవకాశం

ఖమ్మంపై భట్టితో దీపాదాస్, రేవంత్ భేటీ



జగన్‌పైకి రాళ్లు!

ఏపీ సీఎం నుదుటిపై స్వల్ప గాయం

విజయవాడ రోడ్‌షోలో ఘటన 3

ప్రథమ చికిత్స తర్వాత సాగిన యాత్ర

ప్రభుత్వాస్పత్రిలో గాయానికి కుట్లు!

ఘటనపై ఎన్నెన్నో అనుమానాలు

బలమైన విపక్షం ఉండాలి

అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కారం

అంతులేని హామీలతో కాంగ్రెస్ గెలిచింది

నెరవేర్చే వరకు వెంటాడి వేటాడతాం

నోరు మూసుకోను.. పోరాడతా

రాష్ట్రంలో మళ్లీ పదేళ్ల కిందటి పరిస్థితులు

తాగునీటి, కరెంట్ కష్టాలు వచ్చాయి

సర్కారుకు చిత్తశుద్ధి, నైపుణ్యం లేకనే..

రియల్ ఎస్టేట్ ఎందుకు పతనమైంది?

పర్మిషన్లు ఆపుతున్న బ్రోకర్లు ఎవరు?

హామీలపై కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయాలి

తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదు

మతం మత్తులో ఓటేస్తే పిచ్చోళ్లను చేస్తారు

చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్



చేవెళ్ల సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం ఉండాలని, అప్పుడే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతులేని హామీలు, ప్రలోభాలతో అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌కే ఓటువేస్తే.. 'మేము పంగనామాలు పెట్టినా మళ్లీ మాకే ఓటు వేస్తున్నారు' అని వారు అనుకునే ప్రమాదం ఉందని

మిగతా 12వ పేజీలో...

ఐపీఎల్ హెల్

ఉప్పల్ స్టేడియంలో వసతుల లేమితో ఇబ్బందులు

చుక్కలు చూపిస్తున్న సన్ రైజర్స్ యాజమాన్యం

కాసుల కక్కుర్తితో కనీస సదుపాయాలకు పాతర

టికెట్ల నుంచి నిర్వహణ దాకా అంతా ఇష్టారాజ్యం

టికెట్లు లేకున్నా వందలాది మంది లోపలికి ఎంట్రీ

తమవారిని తీసుకెళ్లడంలో అధికార్ల పోటాపోటీ

పార్కింగ్‌కు అష్టకష్టాలు.. 2 కి.మీ. నడవాల్సిందే

ఫుడ్ స్టాళ్లలో ఏం కొనాలన్నా ధరలు రెండింతలు

కార్పొరేట్ బాక్సుల్లో ఏసీలు పనిచేయని వైనం

ఓ అభిమాని కొన్న టికెట్‌కు 66వ నంబరు సీటు కేటాయింపు. స్టేడియంలో ఆ సీటే లేని వైనం.



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉప్పల్ స్టేడియంలో ఒక్కసారైనా ఐపీఎల్ మ్యాచ్ చూడాలి. అభిమాన క్రికెటర్లను నేరుగా వీక్షించాలి. మ్యాచ్ ఆసాంతం కేరింతల మధ్య ఉర్రూతలూగాలి... అని కోరుకోని సగటు క్రికెట్ అభిమాని ఉండరు. కానీ.. ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే అభిమానులు.. అక్కడి వసతులు చూసి ఉసూరుమంటున్నారు. పేటీఎం యాప్‌లో లభించకపోయినా అష్టకష్టాలు పడి, చచ్చీచెడి టికెట్లు కొనుగోలు చేసి, ఉత్సాహంగా స్టేడియానికి వెళుతున్న వారికి సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) యాజమాన్యం చుక్కలు

మిగతా 14వ పేజీలో...

టెన్షన్ టెన్షన్..!

ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ సిద్ధం 2

ఇజ్రాయెల్ నౌకను సీజ్ చేసిన టెహ్రాన్

భారత్‌కు వస్తుండగా దారి మళ్లింపు

అందులో 17 మంది భారతీయులు

150 డ్రోన్లు, 100 మిసైళ్లతో దాడి!

మరోమారు హెచ్చరించిన అమెరికా

దీటుగా ఎదుర్కొంటామన్న ఇజ్రాయెల్



అసలే పుట్టెడు దుఃఖం.. ఆపై 43 లక్షల రుణ భారం

అమెరికాలో హత్యకు గురైన హైదరాబాద్ విద్యార్థి

విద్యారుణం ఎలా తీర్చాలో తెలియక బాధిత కుటుంబం ఆవేదన



అబ్దుల్ అర్ఫాత్(ఫైల్)

హైదరాబాద్, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): భవిష్యతు మీద కోటి ఆశలతో అమెరికా వెళుతున్న భారతీయుల్లో చాలా మంది ఇటీవల వేర్వేరు కారణాలతో అక్కడ ప్రాణాలు కోల్పోతున్నారు. దేశం కాని దేశంలో తమ వారు మరణిస్తుండగా.. వారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కుటుంబసభ్యులకు మాత్రం కన్నీరే విగులుతోంది. ఇటీవల అమెరికాలో ప్రాణాలు కోల్పోయిన హైదరాబాద్ యువకుడు మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్(25) కుటుంబానిది అదే వ్యథ. ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి కుమారుడి భవిష్యత్తు కోసం తీసుకున్న రూ.43 లక్షల విద్యారుణం మరింత మనోవేదనకు గురి చేస్తోంది. ఓ వైపు కొడుకు లోకాన్ని వీడగా.. అతని కోసం తీసుకున్న అప్పును ఎలా తీర్చాలో తెలియక క్షోభకు గురవుతోంది. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్(25) ఎంటెక్ చదివేందుకు అమెరికా వెళ్లాడు. డ్రగ్స్ ముఠాకు చెందిన కొందరు అర్ఫాత్‌ను కిడ్నాప్ చేసి మార్చి 17న అతని తండ్రి సలీంకు ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేశారు. 1200 అమెరికన్ డాలర్లు ఇస్తేనే అర్ఫాత్‌ను విడిచిపెడతామని లేదంటే కిడ్నీలు అమ్మేస్తామని బెదిరించారు. ఆ తర్వాత వారి నుంచి సలీంకు ఎలాంటి ఫోన్ రాలేదు. అర్ఫాత్ క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని ఆ కుటుంబం చాలా ప్రయత్నాలు చేసింది. అయితే, క్లీవ్‌ల్యాండ్ సమీపంలోని లేక్ ఎరీ వద్ద అర్ఫాత్ మృతదేహం లభించిందని ఏప్రిల్ 9న అమెరికా కాన్సులేట్ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సలీంకు తెలియజేసింది. దీంతో ఆ కుటుంబం కుంగిపోయింది. అర్ఫాత్‌కు క్లీవ్‌ల్యాండ్ యూనివర్సిటీలో ఎంటెక్ చేయడానికి వెళ్లాడని, ఇందుకోసం రూ.43 లక్షల విద్యా రుణం తీసుకున్నామని సలీం తెలిపారు. అలాగే, అమెరికా వెళ్లేటప్పుడు అర్ఫాత్‌కు రూ.10 లక్షలు విలువ చేసే విదేశీ కరెన్సీ కూడా ఇచ్చామని చెప్పారు. ఉన్నత విద్యావంతుడై ఇంటి తిరిగి వస్తాడనుకున్న కొడుకు శవమై వచ్చాడని సలీం కన్నీటిపర్యంతమయ్యారు. కొడుకును కోల్పోయి బాధ పడుతున్న తమకు రూ.43 లక్షల విద్యారుణం తీవ్ర మనోవేదనకు గురి చేస్తోందని వాపోయారు.

అమ్మో.. అమెరికా!

ప్రవాస భారతీయ విద్యార్థుల మెడపై కత్తి.. పీడకలగా మారుతున్న డాలర్ డ్రీమ్

- ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోపే పదకొండు మంది విద్యార్థుల మృత్యువాత
- పెరుగుతున్న గన్ కల్చర్, విద్వేష నేరాలు, వివక్ష, జాతి దూషణలతో భయాందోళనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: విదేశాల్లో చదవడం, అక్కడే ఉద్యోగం చేయడం అనేది చాలామంది భారతీయ విద్యార్థుల కల. అందులోనూ అమెరికా చదువులకు ఉన్న క్రేజే వేరు. అక్కడైతే ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అ దేశ యూనివర్సిటీల్లో సీటు సంపాదిస్తే ఇక జీవితంలో సెటిల్ అయినట్లే అని విద్యార్థులు భావిస్తారు. అయితే ఈ డాలర్ డ్రీమ్ ఇప్పుడు విద్యార్థులకు ఒక పీడకలగా మారుతోంది. అక్కడ చదువుతున్న భారతీయ, భారత సంతతి విద్యార్థుల వరుస మరణాలతో కలకలం రేగుతోంది. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన విద్యార్థుల మెడపై కత్తి వేలాడుతోందా? అవకాశాల కోసం అంతదూరంవెళితే అనర్థాలు కొనితెచ్చుకోవడమేనా? అమెరికాలో చదువు కోసం ప్రాణాలను పణంగా పెట్టాల్సిన అవసరం ఉందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విదేశాల్లో, ముఖ్యంగా అమెరికాలో విద్యను అభ్యసించాలన్న భారతీయులకున్న బలమైన కోరిక అగ్రరాజ్యంలోని విశ్వవిద్యాలయాలకు వరంగా మారింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2022-23 విద్యాసంవత్సరానికి అమెరికాలో భారతీయ విద్యార్థుల సంఖ్య ఏకంగా 35% పెరిగిం ది. అక్కడున్న భారత విద్యార్థులు 2,75,000మంది కాగా, ఇది ఆ దేశంలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25%. వీరు చెల్లించే ఫీజులు, ఇతర ఖర్చుల ద్వారా ఏటా రూ.75,250 కోట్ల ఆదాయం సమకూరుతోందని 'ఓపెన్ డోర్స్' సంస్థ నివేదిక వెల్లడించింది. అమెరికా డిగ్రీలు అధిక వేతనంతో కూడిన ఉద్యోగాలకు మార్గం సుగమం చేస్తాయని భారతీయ విద్యార్థులు నమ్ముతారు. అయితే ఈ సంవత్సరం మొదటి 4నెలల్లోపే అమెరికాలో మృతిచెందిన భారతీయ, భారత సంతతి విద్యార్థుల సంఖ్య ఏకం గా 11కి చేరడం భద్రతాపరమైన ఆందోళనలను రేకెత్తిస్తోంది. అనుమానాస్పద మరణాలతో విద్వేషనేరాలపై భారతీయ, అమెరికన్ సమాజంలో వదంతులు పెరిగిపోయాయి. తూర్పు, మిడ్‌వెస్ట్ వర్సిటీల పరిధిలో, ఇండియానాలోని ఇల్లినాయిస్, ఒహియోలోని క్లీవ్‌లాండ్ ప్రాంతాల్లో ఎక్కువమంది మరణించడం ఈ వాదనలకు బలం చేకూర్చింది. కాగా, ఈ ఘటనలకు కారణాలను ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ (ఎఫ్ఐఐడీఎస్)విశ్లేషించింది. కాల్పులు/ కిడ్నాప్‌లు, భద్ర తాపరమైన అంశాలపై పరిజ్ఞానం లేకపోవడంవల్ల పర్యావరణ సంబంధ మరణాలు (మోనాక్సైడ్ పాయిజనింగ్, హైపోథెర్మియా), ఆత్మహత్యలను ప్రేరేపించే మానసిక సమస్యలు, హింసాత్మక నేరాలు, అనుమానాస్పద ప్రమాదాలు ఈ జాబితాలో ఉన్నాయి. విద్యార్థుల మరణాలను అరికట్టడానికి కృషి చేయాలని ప్రభుత్వ ఏజెన్సీలు, వర్సిటీలు, విద్యార్థి సంఘాలకు ఒక ప్రముఖ డయాస్పోరా సంస్థ విజ్ఞప్తి చేసింది. అమెరికాలో పెరుగుతున్న హిందూ ఫోబియా కూడా ఈ మరణాలకు ఓ కారణం కావచ్చని భావిస్తున్నారు.

విద్యార్థుల అకాల మరణాల్లో కొన్ని...

2024లో భారత సంతతికి చెందిన విద్యార్థులు వివిధ పరిస్థితుల్లో అమెరికాలో అకాల మరణానికి గురయ్యారు. వీరంతా 25ఏళ్లు, అంతకంటే తక్కువ వయసున్న వారే.

భారతీయ విద్యార్థి వివేక్ సైనీ(25) జార్జియాలో జనవరి 3న దారుణ హత్యకు గురయ్యాడు. యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ జార్జియాలో కంప్యూటర్ సైన్స్ మాస్టర్స్ చదువుతున్న సైనీ ఒక స్టోర్‌లో పనిచేసేవాడు. అక్కడ ఉండగానే డ్రగ్స్‌కు బానిసైన జూలియస్ ఫాల్కనర్ సైనీపై దాడిచేసి సుత్తితో 50 సార్లు మోది హత్య చేశాడు.

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన గట్టు దినేశ్, నికేశ్ అనే 20ఏళ్ల వయసున్న ఇద్దరు భారతీయ విద్యార్థులు జనవరి 14న తమ ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించారు. గ్యాస్ లీక్ కావడమే వారి మృతికి కారణమని మీడియా కథనాలు పేర్కొన్నాయి.

పర్డ్యూ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి నీల్ ఆచార్య(22)జనవరి17న అనుమానాస్పద స్థితిలో మరణించాడు. మృతికి కారణాలింకాతెలియరాలేదు.

ఇల్లినాయిస్ అర్బానా-చాంపైన్ వర్సిటీ సమీపంలో 21 సంవత్సరాల అకుల్ ధావన్ మృతదేహాన్ని జనవరి 20న గుర్తించారు. కంప్యూటర్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న అతను నైట్ క్లబ్‌లోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో హైపోథెర్మియా కారణంగా మరణించాడని పోస్టుమార్టం నివేదికలో పేర్కొన్నారు.

ఒహియోలోని లిండర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఫైనాన్స్ మొదటి సంవత్సరం చదువుతున్న భారత సంతతికి చెందిన శ్రేయాస్‌రెడ్డి బెనిగేరి(19)తన వసతి గృహంలో ఫిబ్రవరి 1న అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు.

పర్డ్యూ వర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ చేస్తున్న భారతీయఅమెరికన్ విద్యార్థి సమీర్ కామత్ ఫిబ్రవరి 5న ప్రకృతి సంరక్షణ కేంద్రంలో శవమయ్యాడు.


బోస్టన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న ఏపీకి చెందిన విద్యార్థి పరుచూరి అభిజిత్ (20)ను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. అతని మృతదేహాన్ని వర్సిటీ క్యాంపస్ సమీప అటవీ ప్రాంతంలో నిలిపి ఉంచిన కారులో మార్చి11న గుర్తించారు. అతని వద్ద ఉన్న డబ్బులు, ల్యాప్‌టాప్ కోసం దుండగుడు దాడి చేసి ఉంటాడని భావిస్తున్నారు.

నెల రోజులుగా కనిపించకుండా పోయిన భారత సంతతి విద్యార్థి మహ్మద్ అబ్దుల్ అర్ఫత్(25) ఏప్రిల్ 9న ఒహియోలోని క్లీవ్ ల్యాండ్‌లో శవమై కనిపించాడు. ఈ ఘటనకు కొద్దిరోజుల ముందే ఇదే ప్రాంతంలో భారత విద్యార్థి ఉమా సత్యసాయి గద్దె మృతదేహం లభ్యమైంది.

విద్యార్థుల భద్రతపై ఆందోళనలు

ఎన్నో ఆశలు, అంచనాలతో అమెరికాలో అడుగుపెట్టిన భారతీయ విద్యార్థుల వరుస మరణాలు ఆ దేశంలో వారి భద్రత, శ్రేయస్సుపై ఆందోళన రేకెత్తిస్తున్నాయి. విద్వేషపూరిత నేరాలు, వివక్ష, జాతి దూషణలతోపాటు గన్ కల్చర్ వంటివి వారిని భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఫిబ్రవరి 4న చికాగోలోని ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న సయ్యద్ మజాహిర్ అలీ అనే 23ఏళ్ల భారతీయ విద్యార్థిపై నలుగురు సాయుధులు దాడిచేశారు. తీవ్ర గాయాలతో అతను ఆస్పత్రి పాలయ్యాడు. ఈ భయానక ధోరణి, పెరుగుతున్న విద్వేష నేరాలు అమెరికా వీధుల్లో భారతీయ విద్యార్థుల భద్రతపై ఆందోళనలను లేవనెత్తుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కారానికి అక్కడి యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	39.0	23.0
ఖమ్మం	38.0	25.0
నిజామాబాద్	37.3	23.2
ఆదిలాబాద్	36.3	22.7
సంగారెడ్డి	34.0	25.0

ఆస్ట్రేలియాలో కత్తితో దుండగుడి దాడి

- ఆరుగురి మృతి.. సిడ్నీ మాల్‌లో దుర్ఘటన

సిడ్నీ, ఏప్రిల్ 13: ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో శనివారం మధ్యాహ్నం ఓ దుండగుడు(40) బీభత్సం సృష్టించాడు. రద్దీగా ఉండే మాల్‌లో జనంపై విచక్షణారహితంగా దాడి చేసి పలువురిని కత్తితో పొడిచాడు. దీంతో ఆరుగురు మృత్యువాత పడ్డారు. వారిలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. దుండగుడిని పోలీసులు అక్కడికక్కడే కాల్చి చంపారు. సిడ్నీనగరం తూర్పు ప్రాంతంలోని బోండి జంక్షన్‌లో వెస్ట్‌ఫీల్డ్ మాల్ జనంతో రద్దీగా ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుల్ని ఆస్పత్రికి తరలించగా అక్కడ ఒకరు మృత్యువాత పడినట్లు న్యూ సౌత్‌వేల్స్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ ఆంథోని కుక్ తెలిపారు. దుండగుడు ఎవరనేది ఇంకా గుర్తించలేదని, అతడి గురించి సమాచారం సేకరిస్తున్నట్లు పోలీసు కమిషనర్ కారెన్ వెబ్ తెలిపారు. ఇది తీవ్రవాద ఘటన కాదన్నారు. న్యూ సౌత్‌వేల్స్ అంబులెన్స్ విభాగం ప్రతినిధి ఈ ఘటనపై మాట్లాడుతూ.. 8 మంది బాధితులను సిడ్నీలోని వేర్వేరు ఆస్పత్రులకు తరలించినట్లు చెప్పారు. వారిలో 9 నెలల చిన్నారి కూడా ఉన్నట్లు తెలిపారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్ ఈ ఘటనపై తీవ్ర విచారం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

భారతీయ విద్యార్థులూ జాగ్రత్తగా ఉండాలి

పెప్సీకో మాజీ సీఈవో ఇంద్రానూయి

ఈ మధ్యకాలంలో అమెరికాలో భారతీయ విద్యార్థుల వరుస మరణాలతో ఆ దేశంలోని భారత విద్యార్థుల భద్రత పట్ల సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలో భారత విద్యార్థులు ఎలా మసలుకోవాలి? ఏం చేయాలి? ఏం చేయకూడదో పెప్సీకో మాజీ సీఈవో ఇంద్రా నూయి ఇటీవల కొన్ని సూచనలు చేశారు. అవి..

విద్యార్థులు తాము చదువుకోవాలనుకునే యూనివర్సిటీతోపాటు కోర్సును చాలా జాగ్రత్తగా ఎంచుకోవాలి. అమెరికాలో చదువుకోవడం ఖరీదైన వ్యవహారం. కాబట్టి విద్యార్థులు అప్లయ్ చేసేటప్పుడు దీని గురించి ఆలోచించాలి.

అమెరికాకు వచ్చిన తొలినాళ్లలో ఎంచుకునే స్నేహితులు, కొత్తగా అలవరచుకునే అలవాట్ల పట్ల జాగరూకతతో ఉండాలి.

యూనివర్సిటీల్లో, స్థానిక కమ్యూనిటీలో అందుబాటులో ఉండే వనరుల పట్ల అవగాహన కలిగి ఉండాలి.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. మితిమీరి మద్యం సేవించరాదు. మానసిక, శారీరక ఆరోగ్యానికి డ్రగ్స్ హానికరం.

అమెరికాలో స్థానిక చట్టాలను కచ్చితంగా పాటించాలి. వీసా స్థాయి గురించి తెలుసుకోవడమే కాకుండా అది పార్ట్ టైమ్ ఉద్యోగానికి అనుమతించేదీ లేనిదీ చూసుకోవాలి.

విద్యార్థులు తాము నివసిస్తున్న లేదా ప్రయాణించే నగరంలో సురక్షిత ప్రాంతాల గురించికచ్చితంగా తెలుసుకోవాలి. రాత్రి పూట ఒంటరిగా చీకటి ప్రదేశాలకు వెళ్లకపోవడం మంచిది.

విద్యార్థులు మనీ స్కామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు.

విద్యాభ్యాసం సందర్భంగా కలిగే ఒత్తిడులను అధిగమించే ప్రయత్నం చేయాలి.

కరెంటు కోసం కేంద్రం ముందుజాగ్రత్త

- మే 1 నుంచి గ్యాస్ ప్లాంట్లు విద్యుదుత్పత్తి చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: వేసవిలో కరెంటు వినియోగం పెరగనున్న దృష్ట్యా కేంద్రప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. దేశంలోని గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు మే 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు కరెంటు ఉత్పత్తి జరపాలని శనివారం కేంద్ర విద్యుత్‌శాఖ ఆదేశించింది. వాణిజ్య కారణాల రీత్యా పలు గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి జరగటం లేదు. ఈ నేపథ్యంలోనే కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, విదేశీ బొగ్గు దిగుమతులపై ఆధారపడి కరెంటు ఉత్పత్తి చేస్తున్న కంపెనీలను కూడా.. అక్టోబరు 15వ తేదీ వరకు పూర్తిస్థాయిలో పని చేయాలని విద్యుత్‌శాఖ ఆదేశించింది. జూన్ 30వ తేదీ వరకు పూర్తి సామర్థ్యంతో పని చేయాలని గతంలో ఈ కంపెనీలను ఆదేశించిన కేంద్రం తాజాగా వాటిని అక్టోబరు 15 వరకూ పొడిగించింది.

అధిష్ఠానం చెప్తే సీఎం పదవిని వదులుకుంటా

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తాను ముఖ్యమంత్రిగా కొనసాగాలా లేదా? అనేది కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, పార్టీ సూచిస్తే సీఎం పదవిని వదులుకుంటానని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. మైసూరులో శుక్రవారం ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. రెండేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం పదవి కట్టబెట్టాలనే అంశంపై ఆయన ఈ విధంగా స్పందించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి ఆశించినన్ని స్థానాలు రాకపోవచ్చుననే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమికి కూడా మెజారిటీ సాధ్యం కాకపోవచ్చునని అన్నారు. బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించలేకనే ఎన్డీయే కూటమిని ఏర్పాటు చేసుకుందని అన్నారు.

ఎన్ఐఏ కస్టడీకి కెఫె పేలుళ్ల కేసు నిందితులు

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల కేసు నిందితులు ముసావిర్ హుసేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ తాహాను ఎన్ఐఏ 10 రోజుల కస్టడీకి తీసుకుంది. కోల్‌కతా నుంచి వారిద్దరిని శుక్రవారం రాత్రి పొద్దుపోయాక బెంగళూరుకు తీసుకొచ్చారు. మడివాళలోని ఫోరెన్సిక్ ల్యాబ్ కేంద్రానికి అనుబంధంగా ఉండే ఇంటరాగేషన్ సెల్‌లో విచారణ జరిపారు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత కోరమంగల నేషనల్ స్పోర్ట్స్ విలేజ్‌లోని జ్యుడీషియల్ క్వార్టర్స్‌కు తీసుకువెళ్లి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి 10 రోజుల ఎన్ఐఏ కస్టడీకి ఆదేశించారు.

బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రదాడులు

- 11 మందిని చంపిన మిలిటెంట్లు

కరాచీ, ఏప్రిల్ 13: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోతున్నారు. తాజాగా రెండు వేర్వేరు దాడుల్లో 11 మందిని మిలిటెంట్లు పొట్టనబెట్టుకున్నట్టు శనివారం అధికారులు తెలిపారు. క్వెట్టా నుంచి తఫ్తాన్‌కు జాతీయ రహదారిపై వెళ్తున్న బస్సును గుర్తు తెలియని మిలిటెంట్లు ఆపి అందులో నుంచి తొమ్మిది మంది ప్రయాణికులను బయటకు లాక్కొచ్చారని, అనంతరం వారిని చంపేశారని ఓ అధికారి చెప్పారు. ఈ తొమ్మిది మంది మృతదేహాలను సమీప పర్వత ప్రాంతాల్లోని వంతెన సమీపంలో గుర్తించామని, చనిపోయిన వారి శరీరాలపై బుల్లెట్ గాయాలున్నాయన్నారు. ఇదిలా ఉండగా.. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు పాక్ సైనికులు, ఒక వాంటెడ్ టెర్రరిస్ట్ మరణించినట్టు అధికారులు తెలిపారు.

గోవాలో ఐదేళ్ల బాలికపై హత్యాచారం

వాస్కో, ఏప్రిల్ 13: దక్షిణ గోవాలోని వాస్కోలో దారుణం చోటుచేసుకుంది. ఓ దుండగుడు ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసి, ఆపై పీక నులిమి హత్య చేశాడు. కనీసం 15 మంది చూస్తుండగానే ఈ నేరం జరగడం సంచలనం కలిగించింది. దీనిపై దక్షిణ గోవా ఎస్పీ సునీతా సావంత్ మాట్లాడుతూ.. ఆ బాలికపై లైంగిక దాడి జరిగినట్టు, అనంతరం గొంతు నులిమి హత్య చేసినట్టు పోస్టుమార్టంలో తేలిందని చెప్పారు.

ఇజ్రాయెల్ ఏఐతో భారత్ లింకు

- గాజాలో 'వాంటెడ్'ల పట్టివేతలో ఫేసియల్ రికగ్నిషన్
- దీనంతటినీ పర్యవేక్షిస్తున్న కోర్సైట్ ఏఐ అనే సంస్థ..!

టెల్అవీవ్, ఏప్రిల్ 13: ఒకపట్టాన అంతుచిక్కని గాజాలో హమాస్ ఉగ్రవాదుల వేటకు, తమ దేశానికి చెందిన బందీల జాడ కనుగొనేందుకు ఇజ్రాయెల్ కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన ముఖ గుర్తింపు సాంకేతికత (ఎఫ్ఆర్‌టీ)ను విస్తృత స్థాయిలో వినియోగిస్తోంది. గత ఏడాది అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు దాడికి దిగిన మరుక్షణమే ఈ టెక్నాలజీని వాడుకలోకి తెచ్చింది. లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులను పట్టుకుని విచారణ సాగిస్తోంది. ఎఫ్ఆర్‌టీని కోర్సైట్ ఏఐ అనే సంస్థ తయారుచేసి, పర్యవేక్షిస్తోంది. ఈ కంపెనీ మూడేళ్లుగా భారత్‌తో సంబంధాలు కలిగి ఉండడం గమనార్హం. ప్రభుత్వ రంగ అసోం ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏఎంటీఆర్‌వోఎన్), ముంబైకి చెందిన సెక్యూరిటీ సర్వీసుల కంపెనీ ఐ-సెక్‌తో 2021లో కోర్సైట్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. అసోం రాజధాని గువాహటి టెక్ సిటీలో ఫేసియల్ రికగ్నిషన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసింది. భారత్‌లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ-ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన ఎఫ్ఆర్‌టీ సాంకేతికతను ఎప్పటికప్పుడు అందించేలా ఏఎంటీఆర్‌వోఎన్‌ను బలోపేతం చేయడం దీనివెనుక ఉన్న ఉద్దేశం. ఈ సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఏఎంటీఆర్‌వోఎన్-ఐ సెక్ సంస్థలు భారత్ వ్యాప్తంగా అత్యంత అధునాతన ఎఫ్ఆర్‌టీ సేవలను అందుబాటులోకి తెచ్చాయని కోర్సైట్ ఏఐ సీఈవో రాబ్ వాట్స్ కొనియాడారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో..?

ఏక కాలంలో 6 లక్షల సీసీ కెమెరాలను విశ్లేషించగల సామర్థ్యం ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ) నిర్మాణంతో ప్రపంచంలో తీక్షణ నిఘా ఉన్న నగరాల్లో ఒకటిగా పేరొందింది హైదరాబాద్. ముఖ గుర్తింపు సాంకేతికతను వినియోగించి ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ఇక్కడి పోలీసులకు నిందితులను పట్టుకునే సామర్థ్యం ఉందనే కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్ కంపెనీ తాము అధునాతన ఎఫ్ఆర్‌టీని భారత్ సంస్థకు ఇచ్చామని చెప్పడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, కోర్సైట్, అసోం కంపెనీ మధ్య ఒప్పందంపై ప్రశ్నలను లేవనెత్తుతూ గురువారం కేంద్ర ఐటీ శాఖ, ఏఎంటీఆర్‌వోఎన్‌కు కొందరు లేఖ రాశారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో పాలుపంచుకుంటున్న కోర్సై ట్ ఏఐ నేపథ్యాన్ని గుర్తు చేస్తూ అలాంటి సంస్థతో భాగస్వామ్యం కొనసాగించడం సరైనదేనా? అని ప్రశ్నించారు. గాజాలో తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఇలాంటి సందర్భంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏఎంటీఆర్‌వోఎన్ ఇంకా కోర్సైట్ ఏఐతో ఒప్పందంలో ఉండడాన్ని నిలదీశారు.

టెన్షన్ టెన్షన్!

ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ సిద్ధం

- ఇజ్రాయెల్ నౌకను సీజ్ చేసిన టెహ్రాన్
- భారత్ వస్తుండగా దారి మళ్లింపు
- నౌకలో 17 మంది భారతీయులు



ఇరాన్ సీజ్ చేసిన ఇజ్రాయెల్ కంటైనర్ నౌక

టెల్అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: పశ్చిమాసియాపై యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. క్షణక్షణం ఉద్రిక్త వాతావరణం పెరుగుతోంది. సరిహద్దుల్లో 150 డ్రోన్లు, 100 బాలిస్టిక్ క్షిపణులను మోహరించిన ఇరాన్.. ఏ క్షణాన్నైనా ఇజ్రాయెల్‌పై దాడి చేయవచ్చని అమెరికా నిఘా సంస్థలు శనివారం మరోమారు హెచ్చరికలు జారీ చేశాయి. ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా తన రెండు యుద్ధ నౌకలను తూర్పు మధ్యధరా సముద్రంలో మోహరించేందుకు సన్నద్ధమైంది. ఈ క్రమంలో శనివారం హోర్ముజ్ జలసంధి మీదుగా వస్తున్న ఇజ్రాయెల్ కంటైనర్ నౌక (ఎంఎస్‌సీ ఎరీస్)ను ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సీజ్ చేశారు. అంతర్జాతీయ జలాల్లో.. భారత్‌వైపు వస్తున్న ఆ నౌకపైకి హెలికాప్టర్లతో దిగిన గార్డ్స్.. దాన్ని ఇరాన్ జలాల్లోకి తరలించారు. ఆ నౌకలో 17 మంది భారతీయులున్నట్లు భారత విదేశాంగ శాఖ గుర్తించింది. వారిని సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ నౌక స్వాధీనాన్ని ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ నిర్ధారించింది. నౌక హైజాక్‌పై ఇజ్రాయెల్ సీరియస్ అయ్యింది. తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇజ్రాయెల్ మిలటరీ అధికార ప్రతినిధి డేనియల్ హాగరి ఇరాన్‌ను హెచ్చరించారు. సిరియా రాజధాని డమాస్కస్‌పై ఈ నెల1న ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లో ఇరాన్‌కు చెందిన కీలక సైన్యాధికారి, మరో 12 మంది మరణించారు! దానికి ఇజ్రాయెల్ మూల్యం చెల్లించుకుంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఆ తర్వాత ఇరాన్ యుద్ధానికి సన్నద్ధమవుతోందని అమెరికా, ఇజ్రాయెల్ నిఘావర్గాలు గుర్తించాయి.

24 గంటల్లో దాడులు..!

ఇజ్రాయెల్‌పై 24 గంటల్లో ఇరాన్ దాడులు జరగవచ్చని అమెరికా నిఘా సంస్థలు హెచ్చరించాయి. "ఇరాన్ తన సరిహద్దుల నుంచి డ్రోన్లు, మిసైల్స్‌తో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడే ప్రమాదముంది. ఇరాన్ తన సరిహద్దుల నుంచి 2 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలిగే క్షిపణులను మోహరించింది. ఆదివారం ఏ క్షణాన్నైనా దాడులు జరగవచ్చు" అని వెల్లడించాయి.

ఇజ్రాయెల్‌కు బైడెన్ హామీ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మరోమారు స్పందించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా దాడి చేసేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని అంచనా వేశారు. "మాకు వచ్చిన రహస్య సమాచారం జోలికి నేను వెళ్లాలనుకోవడం లేదు. ఇజ్రాయెల్‌ను రక్షించేందుకు మేం కట్టుబడి ఉన్నాం. ఇరాన్ విజయం సాధించబోదు" అని వ్యాఖ్యానించారు. "చేయకండి" అంటూ బైడెన్ ఏకపదంతో ఇరాన్‌కు సందేశాన్ని పంపారు. అదే సమయంలో ఐరోపా సమాఖ్య కూడా తమ యూనియన్ ప్రధాన మంత్రులతో ఇరాన్‌కు సందేశాలు పంపింది.

'అమెరికాకు సహకరించం'

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరిగితే.. అమెరికా ఒకవేళ జోక్యం చేసుకుంటే.. అగ్రరాజ్యానికి సహకరించబోమని పలు గల్ఫ్ దేశాలు స్పష్టం చేశాయి. తమ భూభాగాలను వినియోగించుకునేందుకు అమెరికాకు అనుమతి ఇచ్చేది లేదని తేల్చిచెప్పాయి. ఈ నేపథ్యంలో యుద్ధం ఆలోచన నుంచి వెనక్కి తగ్గేలా ఇరాన్‌పై ఒత్తిడి తీసుకురావాలంటూ సౌదీ అరేబియా, ఖతార్ దేశాలకు అమెరికా సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ కూడా యుద్ధం జోలికి వెళ్లకూడదని సూచిస్తున్నట్లు సమాచారం.

ఎయిరిండియా ప్రత్యామ్నాయాలు

ఇరాన్ ఇప్పటికే తన రాజధాని నగరం టెహ్రాన్ గగనతలాన్ని మూసివేయడం.. పశ్చిమాసియాలో యుద్ధం ముప్పు నేపథ్యంలో ఇరాన్ మీదుగా వెళ్లే విమానాలను మళ్లించనున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఇందుకోసం ఆస్ట్రేలియా, జర్మనీ విమానయాన సంస్థలు క్వాంటస్, లుఫ్తాన్సాల సాయం తీసుకోనున్నట్లు వెల్లడించింది.

ఇజ్రాయెల్‌కు చుట్టూ సమస్యలే!

హమాస్‌పై పోరు పేరుతో గాజాలో ఇజ్రాయెల్ భీకర యుద్ధమే చేసింది. అలాగే లెబనాన్ భూభాగంపై నుంచి దాడులు చేస్తున్న హిజ్బుల్లా ఉగ్రవాదులను ఎదుర్కొంటోంది. హమాస్ ముప్పు తటస్థమైనా.. హిజ్బుల్లా, ఎర్ర సముద్రంలో యెమన్ భూభాగం నుంచి నౌకలపై డ్రోన్ దాడులు చేస్తున్న హౌతీలతో ముప్పును ఎదుర్కొంటూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఇరాన్‌తో యుద్ధం ఇజ్రాయెల్‌కు ఇబ్బందికరమైన పరిస్థితేనని విశ్లేషకులు చెబుతున్నారు. తాజాగా శనివారం లెబనాన్ నుంచి హిజ్బుల్లా ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై డజన్ల కొద్దీ మిసైల్స్‌ను ప్రయోగించారు.

'హెల్త్ డ్రింక్స్' నుంచి బోర్న్‌విటా ఔట్!

- ఆ తరహా ఇతర ఉత్పత్తులు, డ్రింక్స్, బేవరేజెస్‌ను కూడా తొలగించాల్సిందే
- ఈ-కామర్స్ సంస్థలకు కేంద్రం ఆదేశం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: కేంద్ర ప్రభుత్వం బోర్న్‌విటాకు, ఆ తరహా ఉత్పత్తులకు ఝలక్ ఇచ్చింది. వాటిని ఆరోగ్య పానీయాల (హెల్త్ డ్రింక్స్) విభాగం నుంచి తొలగించాలని ఈ-కామర్స్ సంస్థలను ఆదేశించింది. బోర్న్‌విటాలో సగానికి సగం చక్కెరే ఉంటోందని ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఆహార భద్రత, ప్రమాణాల (ఎఫ్ఎస్ఎస్) చట్టం-2006 'హెల్త్ డ్రింక్' అని దేన్నీ నిర్వచించలేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అలాగే భారత ఎఫ్ఎస్ఎస్ ప్రాధికార సంస్థ కానీ, బోర్న్‌విటా, క్యాడ్బరీతో పాటు పలు ప్రముఖ బ్రాండ్ల యాజమాన్య సంస్థ 'మాండెలెజ్ ఇండియా' కానీ సమర్పించిన నిబంధనల్లోనూ 'హెల్త్ డ్రింక్'కు నిర్వచనం లేదని తెలిపింది. ఈ విషయం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) నిర్వహించిన విచారణలో నిర్ధారణ అయిందని పేర్కొంది. దాని సిఫారసు ప్రకారం నిర్ణయం తీసుకున్న కేంద్రం... అన్ని ఈ-కామర్స్ సంస్థలు తమ పోర్టళ్లలో బోర్నవిటా సహా ఇతర పానీయాలను (డ్రింక్స్/బేవరేజెస్) 'హెల్త్ డ్రింక్స్' క్యాటగిరీ నుంచి తొలగించాలని ఆదేశించింది. గత ఏడాది ఏప్రిల్‌లోనే ఎన్సీపీసీఆర్ బోర్న్‌విటాకు మొట్టికాయ వేసింది. తప్పుదోవ పట్టించే వాణిజ్య ప్రకటనలు, ప్యాకేజింగ్, లేబుళ్లను ఉపసహరించుకోవాలని ఆదేశించింది. దీనికి కారణం 'ఫుడ్‌ఫార్మర్'గా పేరొందిన రేవంత్ హిమత్‌సింగ్కా యూట్యూబ్ వీడియో! పిల్లలకు బలవర్ధకమైందన్న నమ్మకంతో కొన్ని దశాబ్దాలుగా వాడుతున్న బోర్న్‌విటాపై ఆ వీడియో గగ్గోలు పుట్టించింది. ఆరోగ్య ప్రయోజనాలు, పోషక విలువల గురించి బోర్న్‌విటా కంపెనీ ప్రకటనలు అబద్ధమని ఆ వీడియోలో హిమత్‌సింగ్కా ఆరోపించారు. బోర్న్‌విటాలో సగానికి సగం చక్కెర ఉంటోందని పేర్కొన్నారు. అంతేకాక కోకో సాలిడ్స్, కలరెంట్ల వల్ల పిల్లలు క్యాన్సర్ సహా తీవ్ర ఆరోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు మీడియా కథనాలను ఎన్సీపీసీఆర్ పరిగణనలోకి తీసుకుని విచారణ నిర్వహించింది. బోర్న్‌విటాలో చక్కెర శాతం పరిమితికి మించి ఉందని గుర్తించింది. ఈ నేపథ్యంలో నాలుగు నెలల కిందట బోర్న్‌విటాలో చక్కెరను 15 శాతం తగ్గిస్తున్నట్టు మాండెలెజ్ సంస్థ ప్రకటించింది. ఈ తగ్గింపు తక్కువే అయినప్పటికీ తమకు గొప్ప విజయమని హిమత్‌సింగ్కా అన్నారు. తల్లిదండ్రుల్లో అవగాహన పెరిగిందని, వారు బోర్న్‌విటాలాంటి ఉత్పత్తులపై లేబుళ్లను నిశితంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. కాగా, పిల్లలు రోజువారీ తీసుకోవాల్సిన చక్కెర పరిమితి కంటే బోర్న్‌విటాలో తక్కువే ఉందని మాండెలెజ్ కంపెనీ ఇదివరకే ఓ ప్రకటన చేసింది. బోర్న్‌విటాలో రోగ నిరోధకతను పెంచే విటమిన్ ఏ, సీ, డీ, ఐరన్, జింక్, కాపర్, సెలీనియం ఉన్నాయని పేర్కొంది.

శరత్ రూ.14 కోట్లు ఎందుకిచ్చారు?

- ఆప్‌కు రూ.25 కోట్లు ఇవ్వమని బెదిరించారా?
- వ్యాపారం చేసుకోలేవని శరత్‌ను భయపెట్టారా?
- జాగృతికి 80 లక్షల విరాళం మతలబేంటి?
- కవితకు 5 గంటలపాటు సీబీఐ ప్రశ్నలవర్షం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కుట్రదారులలో ఎమ్మెల్సీ కవితే ప్రధాన సూత్రధారి, పాత్రధారి అని నిరూపించేలా సీబీఐ విచారణ జరుగుతోంది. మద్యం విధానం రూపకల్పన, ఇతరులను బెదిరించడంతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీకి అక్రమంగా నిధుల తరలింపు వ్యవహారంపై తమ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవితను సీబీఐ అధికారులు శనివారం విచారించారు. విజయ్ నాయర్, ఇతరుల ద్వారా ఆమ్‌ఆద్మీ పార్టీకి రూ.100 కోట్ల తరలింపు, ఆప్‌కు చెల్లించిన డబ్బులను ఇతరుల నుంచి వసూలు చేయడంలో ఎంచుకున్న పద్ధతులపై ఆమెను ప్రశ్నించింది. అప్రూవర్లుగా మారిన వారు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా కవితను సీబీఐ ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. మద్యం కుంభకోణంలో కవిత విచారణ కోసం మూడు రోజులపాటు సీబీఐ కస్టడీకి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం కవితను 4-5 గంటల పాటు సీబీఐ విచారించింది. ఇతర నిందితుల, ప్రభుత్వ అధికారుల పాత్రపై సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించింది. అరబిందో శరత్ చంద్రారెడ్డికి ఐదు మద్యం రిటైల్ జోన్లు దక్కినందుకు ప్రతిఫలంగా భూమి అమ్మకం పేరుతో ఆయన దగ్గర నుంచి వసూలు చేసిన రూ.14 కోట్లకు సంబంధించిన సాక్ష్యాలను సీబీఐ ఆమె ముందు ఉంచి ప్రశ్నించింది. ఆ డబ్బులు ఎక్కడికి తరలించారో చెప్పాలని కోరింది. డబ్బు చెల్లించాక కూడా శరత్ చంద్రారెడ్డికి భూమి బదలాయింపు చేయక పోవడం, ఐదు రిటైల్ జోన్లకు మొత్తం రూ.25 కోట్లు(జోన్‌కు రూ.5 కోట్ల చొప్పున) ఇవ్వాలని లేకపోతే వ్యాపారానికి నష్టం చేస్తానని బెదిరించారన్న ఆరోపణపై ప్రశ్నించినట్లు తెలిసింది. తెలంగాణ జాగృతి సంస్థకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద శరత్‌చంద్రారెడ్డి ఇచ్చిన రూ.80 లక్షలపై ఆరా తీసినట్లు తెలిసింది. బినామీ అరుణ్ పిళ్లై రూపంలో ఇండో స్పిరిట్ హోల్‌సేల్ లైసెన్స్‌లో కవిత భాగస్వామి అయిందన్న ఆరోపణలపై అడిగినట్లు తెలిసిందన్నారు. సీబీఐ అధికారుల ప్రశ్నలలో కొన్నిటికి కవిత ముక్తసరిగా సమాధానాలు ఇచ్చారు. చాలా ప్రశ్నలకు సమాధానాలను దాటవేశారు. శనివారం సాయంత్రం కవితను ఆమె భర్త అనిల్, న్యాయవాది మోహిత్‌రావు, పీఏ శరత్ కలిశారు. సీబీఐ దర్యాప్తు తీరుపై వారితో ఆమె చర్చించినట్లు తెలిసింది. సీబీఐ ప్రశ్నించడం, అరెస్టును సవాల్ చేస్తూ దాఖలు చేసిన రెండు పిటిషన్లను కోర్టు శుక్రవారం కొట్టివేసిన నేపథ్యంలో న్యాయపరంగా ముందుకెళ్లడం ఎలా అన్నదానిపై చర్చించినట్లు తెలిసింది.

లాస్య నివేదితకు డబుల్ సెగ

- సాయన్న, నందితలు ఇండ్లు ఇప్పిస్తామని 1.46 కోట్లు వసూలు చేశారని బాధితుల ఆరోపణ
- న్యాయం చేయాలని ఆమె ఇంటిముందు బైఠాయింపు

సికింద్రాబాద్, బోయినపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యేలు జి. సాయన్న, లాస్య నందితలు తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి దాదాపు రూ. 1.46 కోట్లు వసూలు చేశారని ఆరోపిస్తూ కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత ఇంటి ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. బాధితులు మాట్లాడుతూ... సాయన్న జీవించి ఉన్నప్పుడే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి డబ్బు తీసుకున్నారని, సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్లు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము బాగా ఒత్తిడి చేయడంతో రూ. 12 లక్షలు తిరిగి ఇచ్చారని, మిగతా డబ్బును వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో గతంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి జోక్యం చేసుకొని డబ్బులు తిరిగి చెల్లించేలా చూస్తానని హామీ ఇచ్చారని, అయినా పని జరగలేదని వాపోయారు. ఆ సమయంలో నివేదిత ఇంట్లో లేనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ధర్నాలు చేయకూడదని చెప్పడంతో బాధితులు అక్కడినుండి వెళ్ళిపోయారు. ఆందోళనకు నాయకత్వం వహించిన వారు గతంలో సాయన్నకు ముఖ్య అనుచరులు, బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న వారే కావడం గమనార్హం.

ఔట్‌సోర్సింగ్ అక్రమాలపై ఇంటెలిజెన్స్ ఆరా!

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో అప్రమత్తం

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 13 : ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. తొలుత ఈ వ్యవహారంపై ఆరా తీసిన ఎస్పీ కిరణ్ ఖరే.. ఇంటెలిజెన్స్‌ను అప్రమత్తం చేసినట్లు తెలుస్తోంది. 'ఆంధ్రజ్యోతి' కథనం ఆధారంగా జిల్లా ఇంటెలిజెన్స్ బృందాలు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో ఈ దందా కొనసాగిస్తున్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల నిర్వాహకులు అప్రమత్తమై దిద్దుబాటు చర్యలకు దిగగా.. ఇప్పటికే ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ దందాపై ప్రధాన సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది.


పేషెంట్‌తో డాక్టర్ల బృందం

ఏఆర్, ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ

- దేశంలోనే మొదటిసారిగా 'కిమ్స్'లో నిర్వహణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మెదడులో కణితి ఏర్పడితే శస్త్రచికిత్స తప్ప మరో మార్గం లేదు. దీనికి స్కానింగ్, ఇతర పరీక్షలు చేయాలి. న్యూరో నేవిగేషన్ సాయంతో కణితి ఉన్న ప్రదేశాన్ని మార్క్ చేసుకోవాలి. దీనికి రోగికి అనస్తీషియా ఇవ్వాలి. రోగికి ఇబ్బందులు, ఖర్చు కూడా ఎక్కువే! అంతేకాకుండా శస్త్రచికిత్సలో పొరపాట్లు జరిగే అవకాశం ఉంది. కొత్త సాంకేతికతతో ఈ సమస్యలకు ఇప్పుడు చెక్ పడుతుందని అంటున్నారు కిమ్స్ వైద్యులు. వారు దేశంలోనే మొట్టమొదటిసారిగా అగుమెంటెడ్ రియాలిటీ (ఏఆర్), కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించి మెదడులో కణితి తొలగింపు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శనివారం సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో హెచ్‌వోడీ, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి తన బృందంతో కలిసి ఈ వివరాలు తెలిపారు. 'బ్రెయిన్ సర్జరీలు చాలా క్లిష్టమైనవి. అత్యంత కచితత్వంతో చేయాల్సి ఉంటుంది. కొరియాకు చెందిన స్కియా.. ఏఆర్, ఏఐ సాంకేతికతతో రూపొందించిన పరికరం శస్త్రచికిత్స కచ్చితత్వాన్ని పెంచుతుందని తెలిపారు. సాధారణంగా మెదడు చికిత్సల్లో న్యూరో నేవిగేషన్ విధానం అనుసరిస్తుంటామని, దానిలో ఓ గంట అదనంగా అనస్తీషియా ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. కొత్త విధానంలో అది అవసరం లేదని, రోగి త్వరగా కోలుకుంటారని తెలిపారు. ఖర్చు కూడా 20-25 శాతం తగ్గవచ్చన్నారు. గత 15 రోజుల్లో తాము 18 శస్త్రచికిత్సలను విజయవంతంగా చేశామని తెలిపారు. స్కియా కొరియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ టిమ్ కిమ్ మాట్లాడుతూ సీటీ డాటా వినియోగించి రోగి మెదడును 3డీ డిజిటల్ రెప్లికా చేస్తామని, దీని పనితీరు యూఎస్ ఎఫ్‌డీఏ ప్రమాణాలకు లోబడి ఉంటుందన్నారు. దీని వినియోగానికి ఇండియాలో కిమ్స్ హాస్పిటల్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు.

సాధారణ స్థితికి విద్యుత్తు డిమాండ్

- 15,623 మెగావాట్ల.. పీక్ డిమాండ్ నుంచి 10,513 మెగావాట్లకు చేరిక

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బోరుబావుల కింద యాసంగి పంటల సాగు ముగింపు దశకు చేరుకుంది. 2-3 రోజులుగా వాతావరణం చల్లబడటంతోపాటు సుమారు 30 లక్షల బోరు బావుల ద్వారా విద్యుత్తు వాడకం గణనీయంగా పడిపోయింది. దీంతో.. విద్యుత్తు డిమాండ్ తగ్గి, సాధారణస్థితికి చేరింది. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ సహా చాలా జిల్లాల్లో యాసంగి పంటల సాగు ఇప్పటికే ముగియడంతో ఆయా జిల్లాల్లో విద్యుత్తు డిమాండ్ తగ్గిపోయింది. ఈ నెల 20 నాటికి యాసంగి పంటకాలం ముగియనుంది. ఆ తర్వాత విద్యుత్తు డిమాండ్ మరింతగా పడిపోనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత నెల(మార్చి) 8న రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 15,623మెగావాట్ల పీక్ విద్యుత్తు డిమాం డ్ రికార్డు కాగా, శనివారం ఉదయం 7 గంటల సమయం లో అది 10,513 మెగావాట్లకు పడిపోయింది. నిరుడు ఇదే రోజు 13,046 మెగావాట్లుగా డిమాండ్ ఉండటం గమనార్హం.

జగన్ త్వరగా కోలుకోవాలి: మోదీ

ఏపీ సీఎం జగన్‌పై దాడికి ఘటనపై ప్రధాని మోదీ ట్విటర్ వేదికగా స్పందించారు. సీఎం జగన్ త్వరగా కోలుకుని మంచి ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నా.. అని ట్వీట్ చేశారు.

తీవ్రంగా ఖండిస్తున్నా: చంద్రబాబు

జగన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈఘటన పై ఎన్నికల కమిషన్ నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని, బా..ధ్యులైన అధికారులను శిక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

దాడి బాధాకరం: వైఎస్ షర్మిల

సీఎం జగన్‌పై దాడి, ఆయన ఎడమ కంటిపై గాయం బాధాకరం. దురదృష్టకరం. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందని అనుకుంటున్నాం. అలా కాకుండా ఎవరైనా కావాలని చేసి ఉంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఖండించాల్సిందే. ఆయన త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా.

ప్రజాస్వామ్యంలో హింసకు చోటులేదు: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 13 : జగన్‌పై శనివారం జరిగిన దాడిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసకు చోటు లేదని, ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా ఎన్నికల సంఘం జాగ్రత్తలు తీసుకోవాలని కేటీఆర్ పేర్కొన్నారు.

మహిళనని చూడకుండా అసెంబ్లీలో అవమానించారు

వైసీపీ పాలనలో మహిళలపై అడుగడుగునా దాడులే.. అభివృద్ధి కావాలంటే ఈ రాక్షస ప్రభుత్వాన్ని దించేయండి

- చంద్రబాబు అరెస్టు జీవితంలో మర్చిపోలేని దుర్దినం
- 'నిజం గెలవాలి' ముగింపు సభలో భువనేశ్వరి



తిరువూరులో 'నిజం గెలవాలి' ముగింపు సభలో ప్రసంగిస్తున్న భువనేశ్వరి

విజయవాడ/తిరువూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మహిళననే విచక్షణ కూడా లేకుండా దేవాలయం వంటి అసెంబ్లీలో తనపై తప్పుడు విమర్శలు చేశారని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి ఎన్టీఆర్ ఇచ్చిన పౌరుషం తోనే ఈ పరిణామాలను తట్టుకున్నానని చెప్పారు. వైసీపీ రాక్షస పాలనలో మహిళాపై అడుగడుగునా దాడులు జరుగుతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో శనివారం 'నిజం గెలవాలి' ముగింపు సభలో ఆమె ప్రసంగించారు. 'చంద్రబాబు అరెస్టు నా జీవితంలో మర్చిపోలేని ఘటన. సెప్టెంబరు 10న మా పెళ్లి రోజు. ఆ రోజు లోకేశ్ నుంచి ఫోన్ వస్తే పెళ్లి శుభాకాంక్షలు చెప్పడానికి అనుకున్నాను. కానీ నాన్నను అరెస్టు చేశారు అని చెప్పడంతో ఒక్కసారిగా నాకు ఏమీ తోచలేదు. చంద్రబాబు అరెస్టుతో కుటుంబ సభ్యులం అందరం నాలుగు దిక్కులకు చెల్లాచెదురయ్యాం. లోకేశ్ కోర్టు కేసుల గురించి ఢిల్లీ వెళ్లారు. దేవాన్ష్ హైదరాబాద్‌లో ఉండిపోయాడు. నేను, కోడలు బ్రాహ్మణి రాజమండ్రి జైలు వద్దే ఉన్నాం. 53 రోజులు ఎలా బతికామో మాకే తెలియదు. నా భర్త అరెస్టు అక్రమమని నేను బలంగా నమ్మాను. ఏ కేసులోనూ అధికారులు ఒక్క ఆధారం చూపలేకపోవడమే నా నమ్మకానికి నిదర్శనం. తండ్రి, భర్త, కొడుకు రాజకీయాల్లో ఉన్నా ఏనాడూ బయటకు రాని నేను, చంద్రబాబు అరెస్టు అక్రమమని తెలియజేసేందుకు నిజం గెలవాలి కార్యక్రమంతో జనంలోకి వచ్చాను' అని భువనేశ్వరి పేర్కొన్నారు. సభకు మహిళా అభిమానులు భారీగా తరలివచ్చారు. అశేషంగా హాజరైన మహిళలను చూసి భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. చంద్రబాబు అరెస్టు జరిగిన తీరును వివరించిన సమయంలో ఆమెతోపాటు పలువురు మహిళలు కంటతడి పెట్టారు. అన్న క్యాంటీన్ల ద్వారా లక్షల మంది పేదలకు ఆహారం అందిస్తున్న పథకాన్ని రద్దు చేయడంతో పాటు ప్రజావేదిక కూల్చివేతతో వైసీపీ దుర్మార్గపు పాలన ప్రారంభమైందని భువనేశ్వరి నిప్పులు చెరిగారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి కావాలంటే ఎన్నికల కురుక్షేత్రంలో ఓటు అనే ఆయుధంతో వైసీపీ రాక్షస పాలనను అంతమొందించాలని కోరారు. జెండాలు వేరైనా అజెండా ఒక్కటే అని, ఎన్డీయే అభ్యర్థుల్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

6 నెలలు.. 9,080 కిలోమీటర్లు

చంద్రబాబు అక్రమ అరెస్టు వార్త విని మృతి చెందిన టీడీపీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను పరామర్శించి, ఓదార్చాలన్న ఉద్దేశంతో భువనేశ్వరి ప్రారంభించిన నిజం గెలవాలి కార్యక్రమం 6 నెలలపాటు కొనసాగింది. ఆమె సుమారు 9,080 కిలోమీటర్ల మేర ప్రయాణించారు. 2023 అక్టోబరు 25న చిత్తూరు జిల్లాలో ప్రారంభమైన ఈ యాత్ర ముగింపు కార్యక్రమం శనివారం తిరువూరులో జరిగింది.

ఫోన్ ట్యాపింగ్ బ్యాకప్!

(మొదటి పేజీ తరువాయి)

బదిలీలు జరిగితే.. వారు పాతస్థానంలో రిలీవడ్ అవ్వడంతోపాటు.. 'నో డ్యూస్' సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రణీత్‌రావు ఎస్ఐబీలోని తన సెక్షన్‌లో ఉన్న 17 కంప్యూటర్ల హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేశాక.. వాటి స్థానంలో కొత్తవాటిని బిగించి, ఏమీ తెలియనట్లే నటించాడని సమాచారం. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక.. పోలీసు శాఖను క్రమంగా ప్రక్షాళన చేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే డిసెంబరు 31న జరిగిన డీఎస్పీల బదిలీల్లో ప్రణీత్‌రావుకు స్థానచలనం కలిగింది. హార్డ్‌డిస్క్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల లెక్క సరిగ్గా ఉండడంతో.. ఉన్నతాధికారులు ఆయనకు 'నో డ్యూస్' సర్టిఫికెట్ ఇవ్వడం గమనార్హం..!

నన్ను ఓడించేందుకు కుట్ర: వెంకట్రామారెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తనను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక.. మీడియాకు లీకులిచ్చి తప్పుడు వార్తలు రాయిస్తున్నారని మెదక్ లోకసభ సెగ్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌పార్టీలు చేతులు కలిపి.. తనను ఓడించేందుకు కుట్ర పన్నుతున్నాయని శనివారం శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. గత ఎన్నికల్లో పోటీ చేయని తాను.. డబ్బులు తరలించినట్లుగా కథలు అల్లుతున్నారని మండిపడ్డారు. అప్పట్లో తాను ఎమ్మెల్సీగా, పరోక్షరాజకీయాల్లో ఉన్నట్లు గుర్తుచేశారు. బట్టకాల్చి మీద వేసినట్లుగా ఆ రెండు పార్టీలు తనపై కుట్రలు చేస్తున్నాయన్నారు. సిద్ధాంతాలు, విలువలను గాలికి వదిలేసి, ప్రజలను మభ్యపెట్టేలా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగిగా, కలెక్టర్‌గా ప్రజలకు నిజాయితీగా సేవలందించిన అనుభవంతోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రజల్లో తనకు వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకనే బీజేపీ, కాంగ్రెస్‌లు కుట్ర చేస్తున్నాయని, తన మనోధైర్యాన్ని దెబ్బతీసేయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.

ఏపీ సీఎం జగన్‌పైకి రాళ్లు!

- నుదుటిపై స్వల్ప గాయం
- విజయవాడ రోడ్‌షోలో ఘటన


బస్సులోనే జగన్‌కు వైద్యం అందిస్తున్న దృశ్యం

విజయవాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ 'మేమంతా సిద్ధం' రోడ్ షోలో రాళ్ల దాడి జరిగింది. శనివారం రాత్రి విజయవాడలో యాత్ర సాగుతుండగా ఆగంతకులు ఆయనపైకి రెండు రాళ్లు విసిరారు. దీంతో బస్సుపై నిలబడి ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్ ఎడమ కంటికి పైభాగాన నుదుటిపై స్వల్ప గాయమైంది. ఆయన పక్కనే ఉన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కంటి కింద గాయం తగిలింది. ఆ వెంటనే బస్సులోకి వెళ్లిన జగన్‌కు సీఎంఆర్ఎఫ్ ఇన్‌చార్జ్, వృత్తిరీత్యా సీనియర్ వైద్యుడైన హరికృష్ణ ప్రథమ చికిత్స చేసి, గాయానికి ప్లాస్టర్ వేశారు. ఆ తర్వాత కొద్దిసేపు బస్సు నుంచే ప్రజలకు అభివాదం చేసిన జగన్.. తర్వాతి సెంటర్‌లో మళ్లీ బస్సుపైకెక్కి యథావిధిగా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. యాత్ర గన్నవరం నియోజకవర్గ పరిధిలోకి ప్రవేశించగానే బస్సు ఎక్కిన వైసీపీ లోక్‌సభ అభ్యర్థి, డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్.. మరోసారి జగన్ గాయాన్ని శుభ్రపరచి, ఇంకోసారి ప్లాస్టర్ వేశారు. ఆ తర్వాత విజయవాడ పరిధి దాటి గన్నవరం మండలం కేసరపల్లి వరకు యాత్ర కొనసాగింది. ఆయన అక్కడ రాత్రి బస చేయాల్సి ఉంది. ఈలోగా జగన్ వెంట ఉన్న స్థానిక వైసీపీ నేతలు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యులను పిలిపిద్దామని ప్రతిపాదించగా, వద్దని వారించిన జగన్.. ఆస్పత్రికి తానే వస్తానని చెప్పి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. ఆస్పత్రికి చేరుకున్న జగన్‌ను నేరుగా ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. అక్కడ ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ మోహన్ ఆధ్వర్యంలో ఆయనకు చికిత్స అందించారు. గాయానికి 3 కుట్లు పడ్డాయని, నాలుగైదు రోజుల్లో గాయం నయమైపోతుందని వైద్య వర్గాలు తెలిపాయి. జగన్ వెళ్లాక మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కూడా అదే ఆస్పత్రిలో తన ఎడమ కంటి కింద తగిలిన గాయానికి చికిత్స తీసుకుని వెళ్లారు.

ఎన్నెన్నో ప్రశ్నలు?

దాడిపైన విపక్ష పార్టీలు, ఇంటెలిజెన్స్ వ్యవహారాలపై అవగాహన ఉన్న వర్గాలు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి.

- అజిత్‌సింగనగర్ ప్రాంతానికి యాత్ర చేరే సమయానికి పూర్తిగా చీకటి పడింది. అయినా పోలీసు ఉన్నతాధికారులు పవర్ స్టేషన్ వద్దకెళ్లి మరీ ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఇందుకు వాళ్లు చెబుతున్న కారణం జగన్ బస్సుపై నిలబడి అభివాదం చేస్తుండటంతో వైర్ల వల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడటం. ఇప్పటిదాకా జగన్ వెళ్లిన పలు ప్రాంతాల్లో రోడ్‌షోకు అడ్డుగా ఉన్న వైర్లను ముందుగానే తొలగిస్తుండటం మనకు తెలిసిందే. మరి ఇక్కడ అలా ఎందుకు చేయలేదు? ఒకవేళ వైర్లు తగిలే పరిస్థితే ఉంటే కరెంటు లేకున్నా అవి తాకడం వల్ల కింద పడిపోయే ప్రమాదమూ ఉంటుంది గదా! పైగా అది నిత్యం బస్సులు తిరిగే రూట్ కావడంతో సీఎంకు వైర్లతో ముప్పు ఉందని కరెంటు ఆపామన్న వాదనపై మరిన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
- ప్రతిరోజూ జగన్ యాత్ర సాగుతున్న ప్రాంతాన్ని రోప్ పార్టీ కచ్చితంగా అనుసరిస్తూ ముందుకు సాగుతోంది. కానీ రాళ్ల దాడి సమయంలో ఆ స్థాయి జాగ్రత్తలు కనిపించలేదు.
- జనం దాదాపు బస్సుకు దగ్గరికంటా చేరిపోవడం, ఆ సమయంలో రెండు రాళ్లు గురి చూసి విసిరినట్టు దూసుకొచ్చి, జగన్‌కు కంటిపైన నుదుటికి, స్థానిక అభ్యర్థి వెలంపల్లి ఎడమ కంటికి కింద తగలడం చకచకా జరిగిపోయాయి. ఈ దాడికి క్యాట్‌బాల్ వాడారా అన్న అనుమానాలున్నాయి.
- ఇలాంటి హఠాత్పరిణామం జరిగినప్పుడు భద్రతా బలగాలు పూర్తిస్థాయిలో అప్రమత్తమైపోతాయి. ముందుగా సీఎం వెంట ఉండే బలగాలు బుల్లెట్ ప్రూఫ్ షీట్స్‌ను అడ్డుగా పెట్టేస్తాయి. కింద ఉన్న బలగాలు బస్సు సమీపంలో ఎవరూ లేకుండా క్లియర్ చేసేస్తాయి. కానీ ఇక్కడ ఆ రెండూ జరగలేదు.
- ఎన్నికల సమయం కావడంతో సీఎం కాస్త జనంలోకి వెళ్లడం సహజమే కదా అనుకున్నా, చీకటి పడ్డాక, కరెంటు కూడా లేని సమయంలో భద్రతను గాలికొదలడం ఏ విధంగానూ సమర్థనీయం కాదన్న వాదన గట్టిగా వినిపిస్తోంది.
- దాడి జరిగిన వెంటనే రకరకాల వీడియోలను వైసీపీ సోషల్ మీడియాలోకి వదిలారు. మొదట డాక్టర్ హరికృష్ణ ప్రథమ చికిత్స చేయగా, కాస్త ముందుకెళ్లగానే పార్టీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ మళ్లీ అదే చికిత్స చేసిన వీడియోలు పోస్టు చేశారు. పెట్టిన కొన్ని వీడియోల్లో 'జై చంద్రబాబు' అన్న నినాదాలు కూడా వినపడటం వ్యూహాత్మకంగానే జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- చివరికి ప్రభుత్వాసుపత్రికి వెళ్లడం వెనుకా రాజకీయ లబ్ధే పరమావధిగా కనిపిస్తోందన్న వాదన వినిపిస్తోంది.

జానపదాల బిరుదురాజు



కొందరు శిష్యవర్గం ప్రచారంతో, మరికొందరు అభిమానుల ఆదరణతో, ఇంకొందరు అధికార ప్రాభవంతో గొప్పవారుగా గుర్తింపు పొందుతున్న ఈ రోజులలో, కేవలం తన పరిశోధనల వల్ల, దాని ఫలితమైన రచనల వల్లనే ఎవరికీ సాధ్యం కానంత ఉన్నత శిఖరాలు అధిరోహించిన అక్షరాల జాతీయ ఆచార్యుడు– డా. బిరుదురాజు రామరాజు. ఈ నెల 16న 99వ జయంతి జరుగుతున్న జానపద సాహిత్యోద్ధారకుడు రామరాజు– ఆనాటి నుంచి శతజయంతి సంవత్సరంలో ప్రవేశిస్తున్నాడంటే– నిజాయితీ, కృతజ్ఞత గల పరిశోధక ప్రముఖులకు, వారి శిష్యులకు, బంధుమిత్ర వర్గానికి, ప్రతిభాసంపన్నుల కృషిని గుర్తించి, గౌరవించే ప్రభుత్వానికి ఎంత అపురూపమైన, స్ఫూర్తిదాయకమైన ఘటనో! కాని ఇంతవరకు ఆ దాఖలాలు కన్పించకపోవడం శోచనీయం.

ఈనాడు అన్ని విశ్వవిద్యాలయాల్లో జానపద సాహిత్యానికి విశిష్ట సాహిత్యంతో సమానమైన పీఠం లభించిందంటే, దాని వెనక రామరాజు కృషి ఎంతో ఉంది. శిథిలమై, జీర్ణమైపోతున్న జానపద సాహిత్య విలువలను వెలికి తెచ్చి, దేశం ముందు పెట్టి, అందులోని గొప్పతనాన్ని, కమ్మదనాన్ని రుచి చూపించిన పండిపోయిన పండితుడు రామరాజు. ఇంటర్నెట్, గూగుల్ సౌలభ్యం లేని కాలంలో అహోరాత్రులు, కాలిబాటల్లో, ముళ్లదారుల్లో, ఎడ్లబండ్లలో, ఎండ–వానల్లో ఊరూరా తిరిగి మరుగున పడిపోతున్న పసిడి సాహిత్యాన్ని అష్టకష్టాలు పడి సేకరించి 'జానపద సాహిత్యం'పై సాధికారమైన పరిశోధన గ్రంథం వెలువరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో

నేడు అన్ని విశ్వవిద్యాలయాల్లో జానపద సాహిత్యానికి విశిష్ట సాహిత్యంతో సమానమైన పీఠం లభించిందంటే, దాని వెనక బిరుదురాజు రామరాజు కృషి ఎంతో ఉంది. శిథిలమై, జీర్ణమైపోతున్న జానపద సాహిత్య విలువలను వెలికి తెచ్చి, దేశం ముందు పెట్టి, అందులోని గొప్పతనాన్ని, కమ్మదనాన్ని రుచి చూపించిన పండిపోయిన పండితుడు ఆయన.

తెలుగులో చేసిన తొలి పరిశోధనే కాకుండా, జానపద సాహిత్యం గురించి దక్షిణ భారతంలోని విశ్వవిద్యాలయాల్లో అన్ని భాషల్లోను ఇది తొలి పరిశోధన. వారి తర్వాతనే మిగతా విశ్వవిద్యాలయాల్లో ఇతర భాషల్లోను జానపద సాహిత్యంపై పరిశోధన ప్రారంభమైంది, జానపదుల జీవన విధానాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రారంభమైంది. ప్రామాణికమైన వీరి పరిశోధనా వ్యాసమే ఆ తర్వాత వారందరికీ మార్గదర్శకమైంది. అందులో నుంచే చిలవలు పలువలుగా ఎన్నెన్నో సిద్ధాంతగ్రంథాలు వచ్చాయి. వీరి పరిశోధనా గ్రంథమే సినీ కవులకు మూలగ్రంథం.

వీరి సిద్ధాంత గ్రంథాన్ని కొందరు చాదస్త పండితులు చులకనగా చూశారు. దానితో వారిని ఢీకొనాలనే ధ్యేయంతోనే వందలాది సంస్కృత ఆంధ్ర తాళపత్ర గ్రంథాలను సేకరించి పరిష్కరించి ముద్రించారు. సంస్కృతంలో కూడా ఎం.ఏ చేశారు. 'సంస్కృత సాహిత్యానికి ఆంధ్రుల చేయూత' అనే అంశంపై సిద్ధాంత గ్రంథం పూర్తి చేశారు. కాని కారణాంతరాల వల్ల సమర్పించనే లేదు. ఆ గ్రంథాన్ని వారు 2002లో వెలువరించారు. ఇందులో 224 మంది కవుల రచనల గురించి సమగ్రంగా ఒకచోట ఇవ్వడం వారి పఠన శీలాన్ని, పరిశోధనా సామర్థ్యాన్ని తేటతెల్లం చేస్తుంది. ఇంగ్లీషులో ఈ అంశంపై వెలువడింది కేవలం ఇదొక్కటే గ్రంథం కావచ్చు.

తొలినాళ్లలో వీరొక చక్కని కవి. కాని వీరిలోని పరిశోధనా పాటవాన్ని గమనించిన సుప్రసిద్ధ సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి సలహా మేరకు కవిత్వం రాయడం మానివేసి తన జీవితం సమస్తం పరిశోధనా రంగానికే అంకితం చేసిన పరమేశ్వరుడు ఆయన. వారు కవిత్వం రాసిన రోజుల్లో ఎం.ఏలో ఉన్నప్పుడు, బి.ఏ చదువుతున్న సి. నారాయణరెడ్డితో కలిసి 'రామనారాయణ కవులు'గా జంట కవిత్వం రాశారు. సినారె స్థాయిలో కవిత్వం చెప్పగలిగిన రామరాజు, కవిత్వం జోలికి పోకుండా తన జీవితాన్ని పరిశోధనకు, విమర్శకు అంకితం చేయడం వెనక ఎంత పట్టుదల, పరిశ్రమ ఉందో వేరుగా చెప్పనవసరం లేదు. "జానపద సాహిత్యం శిష్ట సాహిత్య సౌధానికి పునాది" అన్నది రామరాజు అభిప్రాయం.

దాదాపు మూడున్నర దశాబ్దాల కాలం విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడుగా సేవలందించి ఎంతోమందిని ఉత్తమ ఆచార్యులుగా తీర్చిదిద్దారు. పేర్వారం జగన్నాథం, రవ్వా శ్రీహరి లాంటి వీరి శిష్యులు వైస్ ఛాన్సలర్లు అయ్యారు. ఆచార్య రామకోటి శాస్త్రి, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, ఆచార్య యం. వీరభద్ర శాస్త్రి, అక్కిరాజు రమాపతిరావు, ఇందుర్తి ప్రభాకరరావు, ఇటీవల ఆచార్య తిరుమలరావు వంటి ఎందరో శిష్యులు, ప్రశిష్యులు వివిధ విశ్వవిద్యాలయాల్లో తెలుగు జానపద శాఖల్లో ఉన్నా, ఎందుచేతనో గాని కేవలం ఒకే ఒక విదుషీమణి– కంచి విజయలక్ష్మి మాత్రమే "డా. రామరాజు జీవితం–రచనలు" అనే అంశంపై పరిశోధన 25 సంవత్సరాల క్రితం చేశారు.

ఊరు పేరు తెలియని ఎందరో అనామకులపై అనేక పరిశోధనలు చేయించే, లేదా ఒకే అంశంపై పదేపదే పరిశోధనలు చేయించే విశ్వవిద్యాలయ ఆచార్యులకు డా. రామరాజు పరిశీలించి, పరిష్కరించి, వెలుగులోకి తెచ్చిన సంస్కృత గ్రంథాలపై పరిశోధన వేరుగా చేయించవచ్చుననీ, వారు సేకరించిన తాళపత్ర గ్రంథాలను, ప్రపంచానికి తెలియజేసిన వ్యాసావళి పైనే ప్రత్యేక పరిశోధన చేయించవచ్చునని తెలియకపోదు. అంతేకాదు మరుగునపడిన మాణిక్యాలను తాను వెలికి తీశారు. చరిత్రకెక్కని చరితార్థులను పరిచయం చేశారు. వాటిపై కూడా పరిశోధన చేయించవచ్చు. సంస్కృత భాషా సాహిత్యాలకు ఆంధ్రులు చేసిన సేవలను గురించి, ఇంగ్లీషులో రచించిన పలు పరిశోధన వ్యాసాలపై పరిశోధన చేయించవచ్చు. అంతదాకా ఎందుకు? 'ఆంధ్ర యోగులు' గొలుసు గ్రంథాలపైనా పరిశోధన చేయవచ్చు. కాని అలక్ష్యం జరిగింది. వారి శతజయంతి సందర్భంగానైనా ఈ అంశాలలో కొన్నింటిపైనైనా, మన విశ్వవిద్యాలయాలు పరిశోధనకు శ్రీకారం చుడితే సంతోషం.

వరంగల్ సమీపంలోని దేవునూరులో 1925 ఏప్రిల్ 16న లక్ష్మీదేవి –నారాయణరాజు దంపతులకు జన్మించిన రామరాజు, మడికొండలో వారి పెదనాన్న రాఘవరాజు కనుసన్నలలో పెరిగి విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. అక్కడ పుట్టిన హేమాహేమీలు, సమకాలీనులైన అభినవ పోతన వానమామలై వరదాచార్యులు, 'రైతు రామాయణం' కర్త వానమామలై జగన్నాథాచార్యులు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, వారి సోదరుడు కాళోజీ రామేశ్వరరావు, 'గంగిరెద్దు' కావ్యకర్త పల్లా దుర్గయ్య, 'సరస్వతీ సాక్షాత్కారం' లాంటి కావ్యాలు రాసిన అనుముల కృష్ణమూర్తిల స్నేహం లభ్యమై తెలుగు పట్ల అభిమానానికి, మమకారానికి దోహదం చేసింది. ఇంటర్మీడియెట్ స్థాయిలో హైదరాబాద్‌కు రావడంతో, పరిశోధనా రంగంలో విశేష కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి దృష్టి ఆకర్షించారు. ఆయన వద్దే తాళపత్ర గ్రంథ సేకరణ, శోధన నేర్చుకున్నారు. చదువుకుంటూ హైదరాబాద్ సివిల్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి సెలక్టయి, జిల్లా పంచాయితీ అధికారిగా ఉద్యోగం సంపాదించారు. అదే ఉద్యోగంలో కొనసాగి ఉంటే రాష్ట్ర ప్రభుత్వంలో శిఖర స్థాయికి చేరేవారు. కాని ఆయన ఆ ఉద్యోగంలో చేరక నిజాం కళాశాలలో బి.ఏలో చేరారు. హైదరాబాద్ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడై హైదరాబాద్ విమోచనకై నిజాం వ్యతిరేక సత్యాగ్రహంలో పాల్గొని జైలుకెళ్లారు. ఆ తర్వాత ఎం.ఏ పూర్తి చేశారు. దేశంలో జరుగుతున్న తొలి ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ టికెట్ ఇస్తామన్నా, సురవరం వారి సలహాపై తిరస్కరించారు. పిన్న వయసులోనే 1951లో లెక్చరర్లై, పిదప రీడర్ అయి, ఆచార్య పదవి అలంకరించి ఎంతో మంది శిష్యప్రశిష్యులకు స్ఫూర్తిమంతమైన గురువయ్యారు.

ప్రామాణికమైన వీరి పరిశోధనా వ్యాసమే ఆ తర్వాత వారందరికీ మార్గదర్శకమైంది. అందులో నుంచే చిలవలు పలువలుగా ఎన్నెన్నో సిద్ధాంతగ్రంథాలు వచ్చాయి. వీరి పరిశోధనా గ్రంథమే సినీ కవులకు మూలగ్రంథం.

తెలుగు శాస్త్రీయ పరిశోధన రంగంలో మార్గదర్శకుడైన డా. రామరాజు– 123 సంవత్సరాల క్రితం తెలుగుభాషకు ఏ మాత్రం ఆదరణలేని నిజాం నిరంకుశ పాలనా కాలంలో తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సంస్కృతీ వికాసానికి పాటుపడే మహదాశయంతో స్థాపించిన 'శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం'కు 1956 నుంచి 1959 దాకా, మళ్లీ 1963 నుంచి 1965 దాకా గౌరవ కార్యదర్శిగా, అంతకుముందు 1960 నుంచి 1962 దాకా ఉపాధ్యక్షులుగా సేవలందించారు.

వారి గౌరవార్థం మా భాషా నిలయం 2019లో 'డా. బి. రామరాజు స్మారక పరిశోధక పురస్కారం' ఏర్పాటు చేసి, ప్రతియేటా ఒక పరిశోధక ప్రముఖుడికి ప్రదానం చేస్తున్నాం. ఈ యేడాది 'డా. రామరాజు జీవితం–రచనలు' అనే అంశంపై పరిశోధన చేసిన ఏకైక విదుషీమణి శ్రీమతి కంచి విజయలక్ష్మికి ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు రావిచెట్టు రంగారావు సభామందిరం, (శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం)లో భాషా నిలయం గౌరవ అధ్యక్షులు డా. కె.వి. రమణాచారి ప్రదానం చేస్తారు.

■ టి. ఉడయవర్లు

(ఏప్రిల్ 16: బిరుదురాజు రామరాజు శతజయంతి సంవత్సరం ఆరంభం)

ELECTORAL BONDS

పులుగడిగిన ముత్యాలు ఎవరు?

మద్రిమాను విశాలమైన ప్రాంతమంతటా ఊడలు దించుకున్నట్టు అవినీతి దేశమంతటా వ్యాపించి ఉంది. అది లేని చోటు లేదంటే అతిశయోక్తి కాదు. మనమంతా అవినీతి పంకజాలమే అంటే చాలా మందికి కోపం రావొచ్చేమో కానీ, అది వాస్తవం. మన ఆర్థికవ్యవస్థ మూలాలే అవినీతిలో కూరుకుపోయి ఉన్నాయి. అశ్రితపెట్టుబడి దేశం నరనరానా ప్రవహిస్తున్న చోట కేంద్రప్రభుత్వ ఆర్థికనిర్ణయాలే ఎలెక్టోరల్ బాండ్ల మీద ఆధారపడి వెలువడుతున్నప్పుడు మనమంతా దొర్లుతున్నది అవినీతి పంకిలంలోనే. ఆ పంకిలాన్ని ఎదుటివారి మీద చల్లడంలో ఎవరి శక్తిసామర్థ్యాలు ఎక్కువైతే వారిదే పైచేయి అవుతుంది. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వ అవినీతిని భూతద్దంలో చూపి ఢిల్లీ రామ్‌లీలా మైదాన్ వేదికగా ఆర్ఎస్ఎస్ ప్రాయోజిత అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని బీజేపీ బాగా రక్తి కట్టించింది. అది ఆ ఎన్నికల్లో

ఎప్పుడూ ఎదుటివారినే దొంగలుగా చూపించి తాను పులుగడిగిన ముత్యాన్ని అని చెప్పుకుంటున్న బీజేపీ మనల్నీ అదే నమ్మమంటోంది. జాతీయ మీడియా అండతో నీతికి నిలువెత్తు కటౌట్‌గా పోజు కొడుతోంది. అవినీతిపరులంతా ప్రతిపక్షంలోనే ఉన్నారని మోదీ దేశప్రజలను నమ్మింపజూస్తున్నారు. ధగధగలాడే నీతికిరీటంతో మెరిసిపోతున్న తనను మూడోసారి ప్రధానిని చేయడం మినహా వేరే దారి లేదని వారికి స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అవినీతిని భూతద్దంలో చూపించి ప్రయోజనం పొందదలచినట్టు మోదీ ప్రసంగాలు స్పష్టపరుస్తున్నాయి. తన పదేళ్ల పాలనలో పేరుకుపోయిన మురికి ఎంత ఉతికినా వదలదనే విషయాన్ని కప్పిపెట్టి అందరి ముందు యూపీఏని దోషిగా నిలబెట్టడం ద్వారా ఆయన పబ్బం గడుపుకోవాలనుకుంటున్నారు.

యూపీఏ ఓటమికి, దాని సారథి కాంగ్రెస్ పార్టీ ఘోరపరాజయానికి కారణమయింది. అలా పాలనాపగ్గాలు చేపట్టిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే అవినీతి అస్త్రాన్ని మరింత సునిశితంగా, జుగుప్సాకరంగా ప్రతిపక్షాల మీద సంధిస్తూ ఉండడం విశేషం. పాలకపక్షంగా బీజేపీ స్వతంత్ర దర్యాప్తుసంస్థలను సైతం తన చెప్పుచేతల్లో పెట్టుకుని ప్రతిపక్షానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి పుట్టిన 'ఆప్' అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అదే అవినీతి ఆయుధంతో మద్యం కేసులో అరెస్ట్ చేయించి చిరునవ్వు నవ్వుకుంటోంది. హేమంత సోరెన్‌తో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయించి జైల్లో తోసింది. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర భగేల్ ముఖ్యమంత్రిగా ఉండగానే ఆ రాష్ట్ర ఎన్నికల నడిమధ్యలో ఆయన మీద అవినీతి కేసు బిగించింది.

ఎప్పుడూ ఎదుటివారినే దొంగలుగా చూపించి తాను పులుగడిగిన ముత్యాన్ని అని చెప్పుకుంటున్న బీజేపీ మనల్నీ అదే నమ్మమంటోంది. జాతీయమీడియా అండతో నీతికి నిలువెత్తు కటౌట్‌గా పోజు కొడుతోంది. ఇటీవల ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో మహాసభ నిర్వహించిన ప్రతిపక్ష కూటమి 'ఇండియా', అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ల అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సునిశిత దాడి చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగిన ఎన్నికల సభలో ప్రధాని మోదీ దీనిపై స్పందిస్తూ అవినీతిపై పోరాటం కొనసాగి తీరుతుందని స్పష్టంచేశారు. 'మోదీని ఎవరూ ఆపలేరు, ప్రతి ఒక్క అవినీతిపరుని మీద చర్య తీసుకుంటాం. నన్ను భయపెట్టడం కోసం అవినీతిపరులంతా ఒక్కచోట చేరారు. అది ఇంతకు ముందుకంటే బలమైన సంకల్పంతో అవినీతిపై రాజీలేని పోరుకు నన్ను సమాయత్తం చేసిందని హెచ్చరించారు. అంటే, అవినీతిపరులంతా ప్రతిపక్షంలోనే ఉన్నారని ఆయన దేశప్రజలను నమ్మింపజూస్తున్నారు. ధగధగలాడే నీతికిరీటంతో మెరిసిపోతున్న తనను మూడోసారి ప్రధానిని చేయడం మినహా వేరే దారి లేదని వారికి స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అవినీతిని భూతద్దంలో చూపించి ప్రయోజనం పొందదలచినట్టు మోదీ ప్రసంగాలు స్పష్టపరుస్తున్నాయి. తన పదేళ్ల పాలనలో పేరుకుపోయిన మురికి ఎంత ఉతికినా వదలదనే విషయాన్ని కప్పిపెట్టి అందరి ముందు యూపీఏని దోషిగా నిలబెట్టడం ద్వారా ఆయన పబ్బం గడుపుకోవాలనుకుంటున్నారు. ఈ సందర్భంలో మోదీని జాతి అడగవలసిన ప్రశ్నలు చాలానే ఉన్నాయి. వాస్తవానికి ఎటువంటి రంగు కళ్లద్దాలు లేని నిష్పాక్షిక పరిశీలకులు వాటిని తరచూ ఆయన పైకి సంధిస్తున్నారు కూడా. విస్తృతప్రాచుర్యం గల జాతీయ మీడియా సంస్థలు వాటికి ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో అవి ప్రజల దృష్టిలో పడడంలేదు. గత పదేళ్లలో ఒక్క ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగమే లక్షకోట్ల రూపాయల అవినీతి సొమ్మును స్వాధీనం చేసుకుందని, తన అవినీతి నిర్మూలన యజ్ఞం ఎట్టిపరిస్థితులలోనూ ఆగబోదని మోదీ ప్రకటించారు.

ఐతే గత పదేళ్ల కాలంలోకి మనం ఒకసారి చూపు సారిస్తే వ్యక్తిగతంగా మోదీపైనే దట్టంగా అల్లుకున్న అవినీతిమేఘాలు చెక్కు చెదరకుండా కనిపిస్తాయి. తనకు అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీని వెంటబెట్టుకుని విదేశయాత్రలు కూడా చేసిన ప్రధాని మోదీ, హిండెన్‌బర్గ్ పరిశోధనలు అతడి స్టాక్‌మార్కెట్ మోసాలచిట్టా విప్పిన తర్వాత పార్లమెంటుకు ముఖం చూపించలేకపోయారన్న చేదువాస్తవం అందరికీ తెలిసిందే. మాజీప్రధాని మన్మోహన్‌సింగ్‌ను 'మౌన్ మోహన్ సింగ్' అని ఎద్దేవా చేసిన ఆయన ఈ విషయంలో మౌనవ్రతం పాటించడం ప్రపంచానికి వినోదమయింది. యుద్ధవిమానాల తయారీరంగంలో బొత్తిగా అనుభవం లేని అనిల్ అంబానీకి అనుకూలంగా మోదీ ఫ్రెంచ్ రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందాన్ని స్వయంగా కుదిర్చిపెట్టడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీజేపీ పాలితరాష్ట్రాల్లో వ్యాపం (మధ్యప్రదేశ్) వంటి భారీ అవినీతి కుంభకోణాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. పాలకపక్షంగా కీలకమైన నిర్ణయాలు తీసుకునే విశేషాధికారాలను చూపించి కార్పొరేట్ సంస్థల నుంచి క్విడ్ ప్రో కో రూపంలో విశేష ధనరాసులను మూటకట్టుకోడానికి దుర్భేద్యమైన రీతిలో రూపొందించిన ఎలెక్టోరల్ బాండ్ల పథకం ముసుగును సుప్రీంకోర్టు స్వహస్తాలతో తొలగించింది. ఈ బాండ్ల ద్వారా పార్టీలకు చేరిన మొత్తం సొమ్ములో దాదాపు సగం ఒక్క బీజేపీకే అందిందన్న కఠోరవాస్తవం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అందరూ అనుకుంటున్నట్టు బాండ్ల ద్వారా తమ పార్టీకి అందినది విశేషమొత్తమేమీ కాదని, మొత్తం రూ.20000 కోట్లలో తమకు ముట్టినది రూ.6000 కోట్లేనని, మిగతా రూ.14000 కోట్లు ఇతర పార్టీల ఖాతాల్లోకే వెళ్లాయని అమిత్ షా బుకాయించారు. అయితే వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. మొత్తం బాండ్ల విలువ రూ 16,518 కోట్లు కాగా అందులో బీజేపీ ఖాతాకు వెళ్ళింది రూ 8251.8 కోట్లని తేలింది. ఇలా ఎక్కడికక్కడ తన నిజస్వరూపాన్ని కప్పిపుచ్చుకోడానికి అబద్ధాల దడి కట్టుకోవడం కంటే జుగుప్సాకరం ఇంకేముంటుంది?

బీజేపీకి వెలుపల ఉన్నవాళ్లంతా అవినీతిపరులు, ఈడీ సంకెళ్లకు అర్హమైనవారు. ఆ పార్టీలో చేరిపోతే మాత్రం వారే నీతిమంతులు. ఈడీ కాదు కదా, ఈగ కూడా వారి మీద వాలదనే అభిప్రాయం దేశప్రజల్లో బలపడిపోయింది. దేశమంతటా అనేకమంది తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీలో చేరి నిష్పూచీగా బతుకుతున్నారు. ఇప్పటికే ప్రతిపక్ష 'ఇండియా' కూటమి, కాంగ్రెస్‌నేతలు ఈడీ, సీబీఐలను బీజేపీ జవాన్లని పిలుస్తున్నారు. ఎంతటి అవినీతి నేతలనైనా పాలకపక్షంలో చేరగానే నీతిమంతులుగా మార్చివేసే వాషింగ్ మెషీన్ అంటూ ఆ పార్టీని ఎద్దేవా చేస్తున్నారు. ఇలా తీవ్ర ఆర్థిక నేరాభియోగాలుండి బీజేపీ లేదా దాని మిత్రపక్షాల్లో చేరిన వెంటనే పరమపావనులైపోయినవారి ఉదంతాలు ప్రతి రాష్ట్రంలోనూ ఉన్నాయి. మహారాష్ట్రలోని యవత్మల్‌వాషిమ్ నియోజకవర్గ ఎంపీ భావన గవాలి (శివసేన) అయిదుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. సీనియర్ శివసేన నాయకుడు, మాజీ ఎంపీ పుండలీకరావు గవాలి కుమార్తె ఈమె. మహిళా ఉత్కర్ష ప్రతిష్ఠాన్ వైస్‌ఛైర్‌పర్సన్‌గా ఆమె రూ.7 కోట్ల దుర్వినియోగానికి పాల్పడినట్టు 2020లో ఈడీ ఆరోపించింది. ఆమెకు సన్నిహితుడైన సయీద్‌ఖాన్‌ను అరెస్టు చేసింది. గవాలిని పిలిచి ఈడీ అనేకసార్లు విచారణ జరిపింది. ఈ కేసులో ఛార్జిషీట్ కూడా దాఖలయింది. 2022 జూలైలో భావన గవాలి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరారు. వెంటనే ఆమెను లోక్‌సభలో ఆ పార్టీ చీఫ్‌విప్‌గా చేశారు. అంతే, ఈడీ కేసు హుష్ కాకి అయింది. ఆమెపై ఒక్క అనుబంధ ఛార్జిషీట్ దాఖలు కాలేదు. ఈడీ మళ్ళీ ఆమెను విచారణకు పిలవనే లేదు. ఇలాగే అజిత్‌పవార్ మీద మహారాష్ట్ర అవినీతి నిరోధక శాఖ కోర్టు పర్యవేక్షణలో మొదలుపెట్టిన విచారణ ఇప్పుడు ఏమైందో ఎవ్వరికీ తెలీదు. 2019లో ఇలా పుట్టి అలా గిట్టిపోయిన దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వంలో అజిత్ ఉపముఖ్యమంత్రిగా చేరినప్పుడు ఏసీబీ ఆయనకు అన్ని అభియోగాల నుంచి విముక్తి కలిగిస్తూ బొంబాయి హైకోర్టులో క్లీన్‌చిట్ దాఖలు చేసింది.



ప్రతిపక్షంలో ఉంటే కేసులు, బీజేపీలో లేదా దానితో మిలాఖత్ అయిన మిత్రపక్షాల్లో చేరితే అనాయాసంగా క్లీన్ చిట్లు లభించేస్తున్నాయి. ప్రధాని మోదీ తన విశాలమైన ఛాతీ మీద చేయివేసి అవినీతి అంతు చూస్తానని చేసే ప్రకటనలు, ప్రతిజ్ఞల అసలు బండారం ఇదన్నమాట. కాంగ్రెస్‌ను వీడి అజిత్‌పవార్ నాయకత్వంలోని ఎన్‌సీపీలో చేరిన బాంద్రా ఎమ్మెల్యే బాబా సిద్ధికి, అజిత్‌పవార్ వర్గంలో చేరిన ఓబీసీ నేత ఛగన్ భుజబల్, మరికొంతమంది మహారాష్ట్ర నాయకులు, బీజేపీకి అనుకూలంగా రాజకీయ విధేయతలు మార్చుకుని అవినీతి ఊబిలోంచి బయటపడి నీతి యోగ్యతాపత్రాలతో మెరిసిపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో 'నారదవల' (ఒక కంపెనీకి మేలు చేస్తే నగదు లంచం ఇచ్చే విధంగా అంగీకారం కుదిరిన ఒక వార్తా సంస్థ స్టింగ్ ఆపరేషన్)కు చిక్కిన ఒకప్పటి తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు సువేందు అధికారి 2020లో బీజేపీలో చేరి కడిగిన ముత్యమైపోయారు, ప్రతిపక్షానికి నాయకుడిగా కొత్త అవతారమెత్తారు. మోదీ ఆశ్రితులై అవినీతిగతాన్ని వదిలించుకుని నీతి నిష్ఠాగరిష్ఠులైపోయిన మాజీ విపక్షనేతలు ఎందరెందరో.

తప్పు జరిగితే తక్షణమే శిక్ష విధించాలి. అందులో మరో మాటకు అవకాశమే లేదు. 2022 జూలై, ఆగస్టులో నమోదైన మద్యం విధానం కేసును ఇంతకాలం నాన్చి నాన్చి ఇప్పుడు అత్యంత కీలకమైన లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయ దురాశ, పేరాశతోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారన్నది బహిరంగ రహస్యం. 2014 తర్వాత కేంద్ర దర్యాప్తుసంస్థలు కేసులు పెట్టి వేధించిన వివిధ పార్టీలకు చెందిన 25 మంది ప్రముఖ నాయకులు బీజేపీలో చేరి ఊరట పొందారని ఆంగ్ల దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జరిపిన స్వతంత్ర దర్యాప్తులో తేలింది. కాంగ్రెస్ పాలనలోనూ ఇటువంటివి ఉన్నప్పటికీ ఇంత దారుణంగా ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తుసంస్థలను దుర్వినియోగపరచడం ఇంతకు ముందెన్నడూ జరగలేదని ఆ పత్రిక దర్యాప్తు నిగ్గుతేల్చింది. అపరిమిత అధికారం వ్యవస్థలు, సంస్థల నిష్పాక్షికతను బలితీసుకోవడం దేశానికి అత్యంత హానికరం. తన నిండా పూడ్చలేని కంతలు ఉంచుకుని ఎదుటివారిని వేలెత్తిచూపడం పిల్లి కళ్ళు మూసుకుని దొంగతనంగా పాలు తాగుతూ లోకం తనను గమనించడం లేదని అనుకోడం వంటిదే.




కీలకమైన లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయ దురాశ, పేరాశతోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారన్నది బహిరంగ రహస్యం. 2014 తర్వాత కేంద్ర దర్యాప్తుసంస్థలు కేసులు పెట్టి వేధించిన వివిధ పార్టీలకు చెందిన 25 మంది ప్రముఖ నాయకులు బీజేపీలో చేరి ఊరట పొందారని ఆంగ్ల దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జరిపిన స్వతంత్ర దర్యాప్తులో తేలింది.



• శ్రీరామమూర్తి గార

సీనియర్ జర్నలిస్ట్

వికాస భారత వైతాళికుడు



డాక్టర్ అంబేడ్కర్ కేవలం దళితుల నాయకుడు మాత్రమేకాదు, 140 కోట్ల మందికి పైగా భారతీయుల నాయకుడు. ఆయన ఆలోచనల విస్తృతి, విశాలత మన రాజ్యాంగంలో పూర్తిగా ప్రతిబింబించాయి. బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రవర్తించాలని అంబేడ్కర్ జీవితమూ, ఆదర్శాలు మనకు నేర్పుతున్నాయి. అలా ప్రవర్తించని పక్షంలో 2047 సంవత్సరం నాటికి సమ్మిళిత వికసిత భారతాన్ని నిర్మించుకోలేము. సామాజిక అస్తిత్వాలపై మనలో ఎటువంటి దురభిప్రాయాలు ఉండకూడదు. వికసిత భారత్ నిర్మాణానికి అదే మొదటి అడుగు.


సమ్మిళిత భారతదేశ నిర్మాణానికి భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అందించిన సేవలు ఎప్పటికీ మరిచిపోలేనివి, సదా గౌరవ భావంతో స్మరించుకోవలసినవి. ఆయన ఒక సామాజిక న్యాయ ప్రవక్త; సమ్మిళితత్వం, న్యాయం, సమానత్వ వైతాళికుడు. ప్రశస్త న్యాయకోవిదుడు, ప్రతిభావంతుడైన ఆర్థికవేత్త, మానవతావాది. సాంఘిక సంస్కర్తగా అంబేడ్కర్ తన జీవితాన్ని కుల వివక్షను రూపుమాపడానికి, అణగారిన, వెనుకబడిన వర్గాలను సముద్ధరించేందుకు అంకితం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ పౌరులు అందరికీ ప్రాథమిక హక్కులు, రక్షణలు సమకూరేందుకు ఆయన చాలా శ్రద్ధ వహించారు. దళితులు, ఇతర అణగారిన వర్గాల వారి హక్కులను కాపాడేందుకు ఆయన నిరంతరాయంగా చేసిన కృషి మన సామాజిక వ్యవస్థలో మౌలిక సంస్కరణలకు దారి తీసింది.

మహోన్నత సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం ఆదర్శాల స్ఫూర్తితో రూపుదిద్దుకున్న ఆయన సామాజిక న్యాయ దార్శనికత నుంచి మనం నేర్చుకోవలసింది, అనుసరించవలసింది ఎంతో ఉంది. భారతీయ సమాజంలో శతాబ్దాలుగా పాదుకుపోయి ఉన్న అసమానతలను, ముఖ్యంగా కుల వ్యవస్థ దౌష్ట్యాన్ని ఆయన గుర్తించారు. వేదాల ప్రబోధాలకు విరుద్ధంగా మన సమాజంలో అమానుషంగా అమల్లో ఉన్న అస్పృశ్యతను నిర్మూలించడానికి ఆయన పోరాడారు.

కుల వ్యవస్థ దుర్మార్గాలకు అంబేడ్కర్ స్వయంగా బాధితుడు అయ్యారు. హిందూ సమాజానికి గుణపాఠం చెప్పేందుకు, భారతీయ విలువలు, సంప్రదాయల నుంచి ప్రభవించిన బౌద్ధ మతాన్ని ఆయన స్వీకరించారు. హిందూ మతం పట్ల ఆగ్రహం ఎంతగా ఉన్నప్పటికీ ఆ మతాన్ని ఆయన వ్యతిరేకించలేదు. హిందుత్వకు ఆయన ప్రతికూలం కాదు. ఇస్లామిక్, క్రైస్తవ మత పెద్దలు తమ మతం స్వీకరించేలా అంబేడ్కర్‌ను ప్రభావితం చేసేందుకు ఎంతగా ప్రయత్నించినప్పటికీ పరాయి సీమలలో ప్రభవించిన ఆ మతాలలో దేనినీ ఆయన స్వీకరించలేదు.

పేద కుటుంబంలో జన్మించిన అంబేడ్కర్ బాల్యంలోనే అనేకానేక సామాజిక, ఆర్థిక కష్టాలను ఎదుర్కొన్నారు. అయితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యాన్ని ఆయన విడనాడలేదు. కష్టనష్టాలన్నిటినీ చాలా ధైర్యంగా అధిగమించారు. తల్లిదండ్రులకు ఆయన 14వ బిడ్డ. తండ్రి ఆ బిడ్డను ఉత్తమ సంస్కారిగా తీర్చిదిద్దారు. తుకారమ్, జ్ఞానేశ్వర్, రవిదాస్ ప్రబోధాలను వివరించి చెప్పేవారు. రామాయణ, మహాభారత గాథలను బాల అంబేడ్కర్ తన తండ్రి నుంచే విన్నారు. 1908లో ఎల్ఫిన్ స్టోన్ ఉన్నత పాఠశాల నుంచి మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణుడయ్యారు. ఎల్ఫిన్ స్టోన్ కళాశాలలో ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రంను ఆయన అభ్యసించారు. 1912లో బాంబే విశ్వవిద్యాలయం నుంచి ఆయన బిఏ డిగ్రీ పొందారు. మహారాజా బరోడా ఇచ్చిన ఉపకార వేతనంతో ఉన్నత విద్యాభ్యాసానికై కొలంబియా విశ్వవిద్యాలయానికి వెళ్లారు. 'పురాతన భారతీయ వాణిజ్యం' అన్న అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని రచించడం ద్వారా 1915లో ఆ ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆ తరువాత ఆ వర్శిటీలోనే 'ది ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ: ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్' అన్న అంశంపై పరిశోధన చేసి పట్టా పొందారు. 1920లో లండన్ విశ్వవిద్యాలయం ఆయనకు డిఎస్‌సి ప్రదానం చేసింది. తరువాత జర్మనీలోని బాన్ విశ్వవిద్యాలయంలో తన అధ్యయనాలు, పరిశోధనలను ఆయన కొనసాగించారు. ఆ కాలంలో కొలంబియా (అమెరికా), లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ బాన్ నుంచి డిగ్రీలు, డాక్టొరేట్ పొందిన ఏకైక భారతీయ రాజకీయవేత్త అంబేడ్కర్ మాత్రమే. 'అధ్యయనం, పోరాటం' అన్న సూత్ర స్ఫూర్తితో మేధో ప్రపంచంలో తనకొక అనితరసాధ్యమైన స్థానాన్ని సాధించుకన్న మహా మేధావి అంబేడ్కర్.

అణగారిన కులాల వారి సాధికారత, విముక్తికి విద్య, రాజకీయ ప్రాతినిధ్యం అత్యంత ఆవశ్యకాలని డాక్టర్ అంబేడ్కర్ భావించారు. సామాజిక న్యాయం గురించిన తన దార్శనికతలో ఆయన ఈ అంశానికి అగ్ర ప్రాధాన్యమిచ్చారు. ప్రజాస్వామ్య భావన, ఆదర్శాలను ఆయన సంపూర్ణంగా విశ్వసించారు. ఉన్నతాదర్శాల సాధనకు సాయుధ పోరాటం అవసరమని ఆయన భావించలేదు. సహ జీవన సూత్రాన్ని ఆయన పరిపూర్ణంగా విశ్వసించారు. అన్నికులాల, మతాల ప్రజలను సమభావంతో గౌరవించాలన్న ఆదర్శాన్ని పాటించారు. అణగారిన, వెనుకబడిన వర్గాల వారి విముక్తికి విద్య ఒక సాధనమని ఆయన నొక్కి చెప్పుతుండేవారు. ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా కుల వివక్ష, సామాజిక అసమానతల కారణంగా చారిత్రకంగా చదువు సంధ్యలకు నోచుకోని బడుగు వర్గాల వారికి సంపూర్ణ విద్యావకాశాలు కల్పించాలని ఆయన సదా కోరేవారు. సహానుభూతి, న్యాయం, సామాజిక సమానత్వం భావాలను ప్రతి ఒక్కరూ మనసా వాచా కర్మణా అనుసరించాలని ఆయన కోరేవారు. మేధో శక్తులను పరిపూర్ణంగా వికసింప చేసుకోవడమే మానవ అస్తిత్వ అంతిమ ధ్యేయంగా ఉండాలని ఆయన అభిలషించేవారు. మహిళా సాధికారతకు ఆయన ఎనలేని కృషి చేశారు. 'ఒక సామాజిక సమూహం అభ్యున్నతిని, ఆ సమూహానికి చెందిన మహిళలు సాధించిన పురోగతి ప్రాతిపదికన చూడాలని' అంబేడ్కర్ సదా అంటుండేవారు.



జాతీయ ఐక్యత, సమగ్రతపై అంబేడ్కర్ ఆలోచనలను గుర్తు చేసుకోకపోతే మనం ఆయనను అగౌరవపరిచిన వారమవుతాం. ఒక జాతి అభ్యున్నతి, సుస్థిరతకు సమైక్యత, సమగ్రతలు పునాదులని ఆయన భావించారు. ప్రతి వ్యక్తికి సమాన హక్కులు, అవకాశాలు ఉండే సమాజాన్ని మనం నిర్మించుకోవాలని ఆయన కోరేవారు. సామాజిక సామరస్యం, పరస్పర గౌరవం సంఘ జీవనంలో చాలా ముఖ్యమని ఆయన నొక్కి చెప్పుతుండేవారు. మన కార్మిక చట్టాల పరిణామంలో అంబేడ్కర్ పాత్ర విశిష్టమైనది. ఆయన దార్శనికత, కృషి కారణంగానే సమాన వేతనాలు, బాల కార్మికతపై నిషేధం మొదలైన నిబంధనలను రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది. స్వతంత్ర భారతదేశ ప్రథమ న్యాయశాఖ మంత్రిగా ఫ్యాక్టరీల చట్టం, కనీస వేతనాల చట్టం, పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం ఇత్యాది ప్రగతిశీల శాసనాలను తీసుకువచ్చారు. కార్మిక హక్కుల సాధనకు, పారిశ్రామిక పురోగతికి అవి ఇప్పటికీ ఇతోధికంగా దోహదం చేస్తున్నాయి.

సమాజంలోని బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు, దేశ సమైక్యతను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య సంప్రదాయాలు, లౌకిక వాద విలువలు, రాజ్యాంగ బద్ధ విధానాలకు మనం కట్టుబడి ఉండాలని అంబేడ్కర్ గట్టిగా వాదించేవారు. వైవిధ్యమనేది విభేదాలకు కాకుండా సమైక్యపరిచేదిగా ఉంచే సమ్మిళిత, బహుళత్వ సమాజాన్ని నిర్మించుకోవాలని ఆయన అభిలషించారు. సమాజంలోని కొన్ని వర్గాల వారి పట్ల అమానుషమైన వివక్షను చూపడాన్ని తీవ్రంగా ఖండించారు. అంటరానితనం అనేది నైతిక నేరమేగాక సామాజిక పురోగతికి, దేశ సమైక్యతకు తీవ్ర అవరోధమని ఆయన గర్హించేవారు. అస్పృశ్యతతను సంపూర్ణంగా రూపుమాపాలని, ఇందుకు చట్టపరమైన చర్యలతో పాటు సాంఘిక సంస్కరణలు అవసరమని ఆయన భావించారు. ఆయన నిరంతర కృషి వల్లే 1936లో దేవాలయాలలో ప్రవేశానికి అస్పృశ్యులకు చట్టబద్ధమైన అనుమతి లభించింది. అంబేడ్కర్ తన ప్రముఖ గ్రంథమైన 'ఎనిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్'లో దళితల హక్కుల గురించి గట్టిగా వాదించారు. కుల వ్యవస్థను పూర్తిగా రద్దు చేయవలసిన అవసరం గురించి స్పష్టంగా చెప్పారు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ భారతీయ సమాజంలో తీవ్ర అసమానతలకు ఎలా కారణమవుతుందో ఎత్తి చూపారు. అసమానతలు, వివక్షను ప్రోత్సహించడమే కాకుండా వ్యక్తి స్వేచ్ఛకు, జాతీయ వికాసానికి కుల వ్యవస్థ కారణమవుతుందని అంబేడ్కర్ సహేతుకంగా నిరూపించారు.

స్వతంత్రభారతదేశ ప్రజాస్వామిక సంస్థల పురోగతికి డాక్టర్ అంబేడ్కర్ ఆదర్శాలు, కృషి విశేషంగా తోడ్పడుతున్నాయి. ఆయన ప్రతిపాదనలు దేశ సామాజిక–రాజకీయ పరిస్థితులలో మౌలిక మార్పులకు దారి తీశాయి. ఆర్థిక, న్యాయ శాస్త్రాలలో ఆయన అపార పాండిత్యం, సాంఘిక సంస్కరణలను తీసుకురావడంలో ఆయన కృషి మనకు పేదరికం–అసమానతల నిర్మూలనలో మార్గదర్శకాలు. మరింత సమ్మిళిత, దయాశీల సమాజాన్ని నిర్మించుకోవలసిన అవసరాన్ని అంబేడ్కర్ జీవితం మనకు సదా గుర్తు చేస్తుంటుంది.

నేడు డాక్టర్ అంబేడ్కర్ జయంతి. ఆయనకు మన కృతజ్ఞతను వ్యక్తం చేయవలసిన సందర్భమిది. అంతే కాదు ప్రజాస్వామిక, లౌకిక, సమ్మిళిత జాతి నిర్మాణం విషయమై మన నిబద్ధతను పురుద్ఘాటించాల్సిన సమయమిది. అటువంటి సమాజంలో మాత్రమే దేశ పౌరులందరికీ ప్రాథమిక హక్కులు, సామాజిక న్యాయం, సమానవకాశాలు దక్కుతాయని, ప్రజల మధ్య శాంతి సామరస్యాలు వర్ధిల్లుతాయనే సత్యాన్ని మనం విస్మరించకూడదు. డాక్టర్ అంబేడ్కర్ కేవలం దళితుల నాయకుడు మాత్రమేకాదు, 140 కోట్ల మందికి పైగా భారతీయుల నాయకుడు. అంబేడ్కర్ ఆలోచనల విస్తృతి, విశాలత మన రాజ్యాంగంలో పూర్తిగా ప్రతిబింబించాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు ఎంతో మంది ఆర్థిక స్తోమత లేక పాఠశాల విద్య మధ్యలోనే ఆపివేయడం జరుగుతోంది. వారి విద్యాభ్యాసానికి మనం తోడ్పడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రవర్తించాలని ఆయన జీవితమూ, ఆదర్శాలు మనకు నేర్పుతున్నాయి. బాధ్యతాయుత పౌరులుగా ప్రవర్తించని పక్షంలో 2047 సంవత్సరం నాటికి సమ్మిళిత వికసిత్ భారత్‌ను నిర్మించుకోలేము. సామాజిక అస్తిత్వాలపై మనలో ఎటువంటి దురభిప్రాయాలు ఉండకూడదు. వికసిత భారత నిర్మాణానికి అదే మొదటి అడుగు.

○ బండారు దత్తాత్రేయ

హర్యానా రాష్ట్ర గవర్నర్

(నేడు అంబేడ్కర్ జయంతి)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
హైదరాబాద్
నగర వార్తలు
ఆదివారం 14 ఏప్రిల్ 2024

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.8 కనిష్ఠం 26.2

ఘనంగా వైశాఖి ఉత్సవం



విన్యాసాలు చేస్తున్న సిక్కులు

అమీర్‌పేట గురుద్వారా ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైశాఖి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన విశాల్ దివస్, నగర కీర్తన కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పూలరథంలో పవిత్ర గురుగ్రంథాన్ని ఊరేగిస్తూ, దారిపొడవునా గ్రంథ పఠనం చేస్తూ గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు.



ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు



ఊరేగింపులో పాల్గొన్న సిక్కులు

ఓహో గులాబి బాలా



మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో ఓ షోరూమ్‌ను ప్రారంభించేందుకు వచ్చిన నటి శ్రీలీల ఇలా ఫొటోకు ఫోజులిచ్చారు.

చల్లబడిన వాతావరణం

● మరో రెండు రోజులు ఇలాగే..

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఐదు రోజుల క్రితం వరకు 40-42 డిగ్రీలు నమోదైన పగటి ఉష్ణోగ్రతలు రెండురోజులుగా 36-37 డిగ్రీలకు తగ్గాయి. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు, వడగాలుల తీవ్రత తగ్గిపోయింది. రాత్రిళ్లు చలిగాలుల ప్రభావం పెరగడంతో నగరవాసులకు కాస్త ఉపశమనం దొరికింది. మరో రెండురోజుల పాటు నగరంలో ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఆది, సోమవారాల్లో గరిష్ఠంగా 36, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలుంటాయన్నారు. గాలులు ఆగ్నేయ దిశగా గంటలకు 6-10 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముంటుందని తెలిపారు. శనివారం మౌలాలి - 37.6, గణాంకభవన్- 35.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నాలాల్లో పూడిక.. తీసేదెప్పుడో?

● మరోసారి ముంపు ముప్పు తప్పదా..?
● 201 పనులు, రూ.56.38కోట్ల నిధులు ● మరో నెలన్నరలో వర్షాకాలం ఆరంభం
● అప్పటికి సగం వ్యర్థాలు తొలగించడమూ కష్టమే
● ఉద్దేశ్యపూర్వకంగానే జాప్యం చేస్తున్నారా?

పలు ప్రాంతాల్లో ప్రారంభం కాని పనులు

సాగుతోన్న టెండర్ ప్రక్రియ

షేక్‌పేట నాలాలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్



జనవరిలో ప్రారంభం కావాల్సిన నాలాల పూడికతీత నగరంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికీ మొదలు కాలేదు. ఎంపికైన ఏజెన్సీలు కొన్నిచోట్ల పనులు ప్రారంభించకపోగా.. కొన్ని సర్కిళ్లలో టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మహానగరంలో వరద ప్రవాహ వ్యవస్థగా ఉన్న నాలాల్లో వ్యర్థాలను తొలగించేదెప్పుడు? వర్షపునీరు సాఫీగా సాగిపోయేదెలా? మరో మారు ముంపు ముప్పు తప్పదా? అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో వరద ప్రవాహ వ్యవస్థ 1302 కిలోమీటర్ల మేర ఉంది. ఇందులో ప్రధాన నాలాలు 390 కి.మీలు కాగా.. మైనర్ డ్రైన్‌లు 912 కి.మీలు. ప్రవాహంతో వచ్చే వ్యర్థాలతోపాటు చెత్తాచెదారం, పరుపులు, దిండ్లు, ఇళ్లలో ఉండే ఇతర వ్యర్థాలను పౌరులు నాలాల్లో వేస్తుంటారు. ఇవన్నీ వరద ప్రవాహానికి అవరోధంగా మారి భారీ వర్షం కురిసినప్పుడు పక్కనున్న ప్రాంతాలు నీట మునుగుతుంటాయి. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా ప్రతియేటా జీహెచ్ఎంసీ నాలాల పూడికతీత చేపడుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో వర్షాకాలం ఆరంభానికి ముందు వ్యర్థాల తొలగింపు జరిగేది. తెలంగాణ ఏర్పాటు అనంతరం జనవరి నుంచి డిసెంబర్ వరకు ఏడాది పొడవునా నాలాల్లో చెత్తాచెదారం తొలగించాలని నిర్ణయించారు. వచ్చే యేడాదిలో చేయాల్సిన పనుల కోసం ముందు సంవత్సరం డిసెంబర్‌లోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, ఇవేవీ ఇంజనీరింగ్ అధికారులకు పట్టడం లేదు. జనవరి నుంచి ఏప్రిల్, మే వరకు కొన్ని సర్కిళ్లలో టెండర్ ప్రక్రియ సాగుతుంది. దీంతో వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయడం అసాధ్యమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో టెండర్ ప్రకటించలేదని అధికారులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఏం చేశారంటే సమాధానమే రావడం లేదు.

రూ.56.38 కోట్లతో ప్రతిపాదనలు...

ఈ సంవత్సరం 210 పూడికతీత పనుల కోసం రూ. 56.38 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. దీనికి

మిగతా 8వ పేజీలో..

ఆలస్యం.. అక్రమార్జన

పూడికతీత పనుల్లో కొందరు ఇంజనీరింగ్ అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేస్తున్నారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనవరిలో పనులు మొదలుపెట్టి జూన్ వరకు వ్యర్థాలు పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. పనులు ప్రారంభం కాకపోవడం.. ఏజెన్సీలను ఎంపిక చేయకపోవడంతో ఎప్పటికి పూడికతీత పూర్తవుతుందంటే అధికారులూ స్పష్టంగా సమాధానం చెప్పలేకపోతున్నారు. బల్దియాలో పూడికతీత పనులు తూతూ మంత్రంగా సాగుతాయన్నది ఇంజనీర్లు అంగీకరించే సత్యం. గతంలో జరిగిన అక్రమాలు ఇందుకు నిదర్శనం. తొలగించిన వ్యర్థాలను ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో తరలించినట్టు చూపడంపై క్రిమినల్ కేసు నమోదైంది. పూడికతీత మమ అనిపించే క్రమంలోనే కొందరు అధికారులు ఆలస్యంగా పనులు ప్రారంభిస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వర్షాకాలంలో వరద ప్రవాహంతో కొట్టుకుపోయే వ్యర్థాలనూ తొలగించినట్టు చూపి పనులు పూర్తి చేసినట్టు లెక్కలు చూపుతారన్న ఆరోపణలూ ఉన్నాయి.

నీటి సరఫరాకు ఆటంకం కలిగించే సిబ్బందిని తొలగిస్తాం

● ట్యాంకర్ బుకింగ్ లేకుండా పైపులైన్ కనెక్షన్ సైజ్ పెంచుతాం
● బస్తీల కోసం 70మినీ ట్యాంకర్లను తీసుకొస్తున్నాం
● మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉద్దేశపూర్వకంగా నీటి సరఫరాలో ఆటంకాలు కల్పించే సిబ్బందిని విధుల నుంచి తప్పిస్తామని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ హెచ్చరించారు. నగరంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఉండకూడదని వాటర్‌బోర్డు అధికారుల్ని ఆదేశించారు. వేసవిలో తాగునీరు, ట్యాంకర్ సరఫరా తదితర అంశాలపై వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులతో ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. సెక్షన్ల వారీగా నీటి సరఫరా, ట్యాంకర్ బుకింగ్స్, డెలివరీ, లైన్‌మన్ల పనితీరు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా దానకిశోర్ మాట్లాడుతూ ప్రతి మేనేజర్, జనరల్ మేనేజర్, సీజీఎంలు క్షేత్రస్థాయిలో లైన్‌మన్ల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లైన్‌మన్లు వాటర్‌బోర్డు రూపొందించిన నాణ్యత యాప్‌లో నీటి సరఫరా, క్వాలిటీ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. సరఫరా వేళలు, నాణ్యత విషయంలో తేడా వస్తే.. కారకులైన సిబ్బందిని తొలగించాలని ఆదేశించారు. నగర తాగునీటి అవసరాలకు జంట జలాశయాల నుంచి అదనంగా రోజుకు 20మిలియన్ లీటర్ల నీరు వాడుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్ అవసరాల కోసం నీటిని శుద్ధి చేసేందుకు మిరాలం, ఆసిఫ్‌నగర్ దగ్గరున్న ఫిల్టర్ బెడ్స్ వంద శాతం పనిచేసేలా మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అదనపు నీటిశుద్ధి కేంద్రాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించాలని సూచించారు.

వాతావరణం చల్లబడటంతో..

నగరంలో వాతావరణం చల్లబడటంతో కొంత మేరకు ట్యాంకర్ బుకింగ్స్ తగ్గాయని, అంతకు ముందు రోజుకు 6వేల ట్రిప్పుల చొప్పున నీరు సరఫరా చేస్తే.. ప్రస్తుత 5వేల ట్రిప్పులు సరఫరా చేస్తున్నారని దానకిశోర్ తెలిపారు. ట్యాంకర్ బుక్ చేసుకునే పరిస్థితి లేకుండా వారి కనెక్షన్ సైజ్ పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా 5 కిలో మీటర్లు(కేఎల్) సామర్థ్యం కలిగి న వంద ట్యాంకర్లు రానున్నాయని, ఇరుకుగా ఉన్న

మిగతా 8వ పేజీలో..

కాంగ్రెస్‌తో పొత్తు లేదు.. అవగాహన అసలే లేదు



● మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తులేదని, ఎలాంటి అవగాహన కుదుర్చుకోలేదని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాము ఒంటరిగానే పోటీ చేస్తున్నట్టు తెలిపారు. మజ్లిస్ ఏ పార్టీకీ బీ టీం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అసదుద్దీన్ ఒవైసీ శనివారం బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గ పరిధి ఫలక్‌నుమా ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుందని, అవగాహనతో పోటీ చేస్తుందనే ఆరోపణలను ఖండించారు. ఉత్తరప్రదేశ్‌లో పీడీఎం కూటమిలో మజ్లిస్ భాగస్వామి అని స్పష్టం చేశారు. తమిళనాడులో ఏఐఏడీఎంకేతో మజ్లిస్ పొత్తుపెట్టుకున్నట్టు వివరించారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బోగస్ ఓట్లు ఉన్నాయన్న బీజేపీ నేతల ఆరోపణలను ఆయన ఖండించారు. నియోజకవర్గంలో దళితులు, బీసీలు, మైనార్టీ ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లు ఉన్నారని, వారందరి ఓట్లతోనే తాము ఎన్నికల్లో విజయం సాధిస్తున్నట్టు పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ)ను మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఒవైసీ విమర్శించారు. సీఏఏ సమానత్వ హక్కుకు విరుద్ధమని, మతం ఆధారంగా దీన్ని రూపొందించారని, పార్లమెంట్‌లో తాను తీవ్రంగా వ్యతిరేకించి బిల్లు ప్రతులను చించివేసినట్టు పేర్కొన్నారు.

'మహాలక్ష్మి' నగదు ప్రభుత్వం చెల్లిస్తోంది

● త్వరలో మరో 460 ఎలక్ట్రిక్ బస్సులు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద మహిళలకు జారీ చేసే జీరో టికెట్ల నగదును రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం చెల్లిస్తున్నదని టీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'గ్రేటర్ ఆర్టీసీకి భారంగా మహాలక్ష్మి' వార్త కథనంపై టీఎస్ ఆర్టీసీ స్పందించింది. ఉచిత ప్రయాణానికి సంబంధించిన రోజువారీ వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సంస్థ పంపిస్తోందని, ఆమేరకు ఉచిత ప్రయాణ రీయింబర్స్‌మెంట్ జీవో నంబర్ 47 ప్రకారం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తునట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రేటర్‌లో విడతలవారీగా త్వరలో మరో 460 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకానికి ముందు గ్రేటర్ ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజూ 11 లక్షల మంది ప్రయాణాలు సాగిస్తే ప్రస్తుతం 20 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారని, ప్రయాణికులు పెరగడంతో రాబడి పెరిగిందని తెలిపారు.

టీఎస్‌ఎస్పీడీసీఎల్ యాప్‌లో కొత్త ఆప్షన్లు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించే దిశగా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్పీడీసీఎల్) యాప్ అప్‌డేట్ వెర్షన్ అందుబాటులోకి తెచ్చింది. టీఎస్‌ఎస్పీడీసీఎల్ యాప్‌లో కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవడం మొదలు బిల్లు చెల్లింపు, గతేడాది మొత్తం వినియోగించిన యూనిట్లు, బిల్లింగ్ వివరాలు తెలుసుకోవచ్చు. విద్యుత్ అంతరాయం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, ఇతర సరఫరా సమస్యలు, విద్యుత్‌మీటర్‌లో తలెత్తే సమస్యలు, మీటర్ కాలిపోతే ఫిర్యాదు, బిల్లింగ్ సమస్యలపై యాప్‌లోనే వినియోగదారులు ఫిర్యాదు చేసుకోవచ్చు. కొత్త విద్యుత్‌కనెక్షన్లకు దరఖాస్తులు, కేటగిరీ మార్పు, గ్రీన్ టారిఫ్, సోలార్ రూఫ్ టాప్ కోసం యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యుత్ చౌర్యంపై

మిగతా 8వ పేజీలో..



కుమారి దీపాలి (ఫైల్)

వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతి

8

అయోమయంగా 'అమ్మ' కమిటీలు..!

ప్రత్యేక రైళ్లకు డ్రైవర్లే లేరు

● దక్షిణమధ్య రైల్వేలో లోకోపైలట్ల కొరత
● గూడ్స్ రైళ్లు నడిపేవారిపైనా అదనపు భారం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పండుగ రోజులు, వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్యరైల్వే ఇప్పటికే సుమారు 200 ప్రత్యేకరైళ్లను ప్రకటించింది. మే, జూన్ మాసాల్లో మరో 300 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అయితే, ఆయా ప్రత్యేకరైళ్లను నడిపేందుకు అవసరమైన మేరకు లోకోపైలెట్లు(డ్రైవర్లు), అసిస్టెంట్ లోకోపైలట్లు అందుబాటులో ఉన్నారా..! అంటే లేరనే సమాధానం రైల్వే సిబ్బంది నుంచి వస్తోంది. ప్రస్తుతం ఉన్న రెగ్యులర్ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లను నడిపేందుకే లోకోపైలట్ల కొరత ఉండగా, తప్పనిసరి పరిస్థితుల్లో వీరే ప్రత్యేకరైళ్లను కూడా నడపాల్సి వస్తోంది. దీంతో ఆయా రైళ్ల డ్రైవర్లు తీవ్రమైన శారీరక, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్యాసింజర్ రైళ్ల నడిపే డ్రైవర్లు సరిపోని పక్షంలో, గూడ్స్ రైళ్ల నడిపే లోకోపైలట్లకు బాధ్యతలు అప్పగించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్యాసింజర్ రైళ్ల నడిపే లోకోపైలట్‌లు ఒక్కసారి

మిగతా 8వ పేజీలో..

ఆరోగ్య పరీక్షలు చేశాకే డ్యూటీలోకి

ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రెగ్యులర్ రైళ్ల నడిపే లోకోపైలట్లు సరిపోని పక్షంలో.. గూడ్సురైళ్ల నడిపే లోకోపైలట్లలోనూ ప్యాసింజర్ రైళ్ల నడిపే అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేస్తాం. లోకోపైలట్ల డ్యూటీ రోస్టర్‌ను పరిశీలించి, అన్ని ఆరోగ్య పరీక్షల్లో ఫిట్ అయిన వాళ్లనే ప్రత్యేకరైళ్లకు లోకోపైలట్లుగా విధులు అప్పగిస్తాం. లోకోపైలట్లతో పాటు ఇతర సిబ్బంది లభ్యతను గుర్తించాకే.. ప్రయాణికుల రద్దీ ఉన్న మార్గాల్లో ప్రత్యేక రైళ్లను ప్రకటిస్తాం.

- రాకేష్, సీపీఆర్ఓ





21న మిద్దె తోటల నిర్వహణపై అవగాహన

ఖైరతాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరవాసుల కోసం మిద్దె తోటల నిర్వహణ, సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించడంపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్, పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 21న ఉదయం 10 గంటల నుంచి నిపుణుల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు అనుభవజ్ఞులు తమ అనుభవాలు తెలుపుతారని అన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ వారి కర్షక సేవా కేంద్రం నిర్వహణలో జరుగుతున్న ఈ సదస్సులో పాల్గొనేందుకు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని, వివరాలకు ఫోన్ నంబరు 7093973999, 9553825532లలో సంప్రదించాలని తెలిపారు.

'దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలి'


చాదర్‌ఘాట్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్ కల్యాణ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు, స్థానిక ఎన్నికల్లో 5శాతం కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దివ్యాంగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామన్నారు. సమావేశంలో దివ్యాంగుల సంఘాల నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.























ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

సభ్యత్వమే లేకుండా టికెటిస్తారా..?

గోషామహల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రాథమిక సభ్యత్వం లేని మాధవీలతకు ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారని హైదరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. బీజేపీలో ఎంతోకాలంగా ఆ పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వ లేని మోదీకి ఒక్క మాధవీలత కనిపించిందా.. అని అన్నారు.



పాదయాత్ర చేస్తున్న మాధవీలత

బస్తీల్లో ఎంపీ అభ్యర్థి మాధవీలత పర్యటన

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొంపెల్లి మాధవీలత శనివారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని ఉప్పుగూడ, లలితాబాగ్ డివిజన్లలో బీజేపీ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. కమలం గుర్తుకే ఓటేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు బహదూర్‌పురా శివాలయంలో ఆమె పూజలు చేశారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు జి.ప్రభాకర్, జె.చిరంజీవి, పండరినాథ్, తాడెం శ్రీనివాస్‌రావు, బర్ల శ్రీనివాస్, పొన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో బీజేపీని గెలిపించాలి : కొండా

రాజేంద్రనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటులో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి నవారు మురళీధర్‌రెడ్డి అన్నారు. పార్టీ నాయకులు రామిడి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మహేశ్వరంలో విశ్వేశ్వర్‌రెడ్డికి బీజేపీ ఎల్‌ఈడీ గుర్తును బహూకరించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ, చేవెళ్లగడ్డపై కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబం ముద్ర బలంగా ఉందన్నారు. నిజాయితీగల నాయకుడిగా విశ్వేశ్వర్‌రెడ్డికి పేరుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్ పాల్గొన్నారు.



పార్టీ గుర్తును విశ్వేశ్వర్‌రెడ్డికి బహూకరిస్తున్న నాయకులు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/tJ6W2oUలో చదవండి.

Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.

నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

రేష్మాకు ఎన్‌బీఈఎంఎస్‌లో గోల్డ్‌మెడల్



డాక్టర్ బి.రేష్మాను పూలబొకేతో సత్కరిస్తున్న ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శంకర్

గోషామహల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బహుంతుల రేష్మా నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్స్ న్యూఢిల్లీ (ఎన్‌బీఈఎంఎస్) పరీక్షల్లో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా శనివారం ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్టర్ ఎస్.శంకర్ రేష్మాను పూల బొకేతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ శంకర్ మాట్లాడుతూ... తమ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న రేష్మాకు జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ రావడం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. రేష్మా 2021లో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ నిర్వహించిన పీజీ డిగ్రీ ఎగ్జామ్‌లో అన్ని స్పెషాలిటీ విభాగాల్లో టాపర్‌గా నిలిచిందన్నారు.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

మంగళ్‌హట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఈఎన్‌టీఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల కోసం స్వచ్ఛమైన చల్లటి తాగునీరు అందించేందుకు మంచుకొండ ఫౌండేషన్ ఛైర్మన్ మంచుకొండ ప్రకాశం ముందుకొచ్చారు. ఆస్పత్రి ప్రాంగణంలో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని ఆస్పత్రి ఈఎన్‌టీ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వాటర్ ఫిల్టర్ ప్లాంట్ కేంద్రాన్ని డాక్టర్ శంకర్, ఎం.ప్రకాశం ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు రవికుమార్, సురేందర్, వరుణ్‌కుమార్, అరుణ్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, డాక్టర్ ఎల్ఎస్.రెడ్డి, డాక్టర్ ఆనంద ఆచార్య, డాక్టర్ దుర్గాప్రసాద్, ఎల్‌టీ.రాజేందర్, మధు, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టు సాయి కుమార్‌కు సత్కారం

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పేద మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపి వారి అభివృద్ధికి పునాది బాటలు వేస్తానని తెలంగాణ మత్స్య సహకార సంఘాల ఛైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం కరీంనగర్ జిల్లా మత్స్య సహకార శాఖ సంఘం రాష్ట్ర నాయకులు కె.గంగాధర్, నారాయణ, రజనీకాంత్, తిరుపతి ఆధ్వర్యంలో గోషామహల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సాయికుమార్‌ను ఘనంగా సత్కరించారు.

25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

బాలానగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయని, మే 2 వరకు జరుగుతాయని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మరో సెషన్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టాస్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పహాడిషరీఫ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రెండు కిలోల గంజాయి, సెల్‌ఫోన్, రూ.1500నగదు స్వాధీనం చేసుకున్నారు. బాలాపూర్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. షాజహాన్ కాలనీలోని ఘోష్ కంపెనీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయజైస్వాల్ అలియాస్ కల్లు అలియాస్ జాబెర్ ఖురేషి(34) లేబర్‌గా చేస్తున్నాడు. జల్సాలకు బానిసైన అతడు ధూల్‌పేటలో గంజాయి కొనుగోలు చేసి, మదీనా హిల్స్‌లో విక్రయిస్తున్నాడు. మహేశ్వరం జోన్ స్పెషల్, బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అతడిని అరెస్ట్ చేసి, రిమాండుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో యువకుడి ఆత్మహత్య

మదీన, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చాంద్రాయణగుట్ట ఎస్‌ఐ పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బార్కస్ ప్రాంతానికి చెందిన సాలెబిన్ అహ్మద్ మస్కతి(35) ఆటో డ్రైవర్. చాలీచాలని ఆదాయానికి తోడు తాగుడు, జూదం తదితర వ్యసనాలకు బానిసయ్యాడు. అప్పులు చేశాడు. అతని భార్య జనవరిలో దుబాయ్‌లో సోదరి వద్దకి వెళ్లింది. అప్పటి నుంచి అహ్మద్ ఒంటరిగానే ఉంటున్నాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో సలాల ఖబరస్తాన్‌లో వేపచెట్టుకు బెడ్‌షీట్‌తో ఉరేసుకున్నాడు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, ఎస్‌ఐ దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి...

పహాడిషరీఫ్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పహాడీషరీఫ్ పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. భార్య విజయలక్ష్మికి మగ బిడ్డ పుట్టడంతో పుట్టింటిలో ఉంటోంది. శనివారం ఉదయం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తండ్రి చెప్పాడు. ఈ మేరకు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు,

దైవ దర్శనానికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

రాజేంద్రనగర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి 16 తులాల బంగారం, రూ.25వేల నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన రాజేంద్రనగర్‌లోని బండ్లగూడ వికాస్‌నగర్‌లో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. వికాస్‌నగర్‌లో నివాసం ఉండే ప్రైవేట్ ఉద్యోగి నవీన్ కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం ఉదయం కర్ణాటకలోని ఓ దేవాలయానికి వెళ్లాడు. తిరిగి రాత్రి11 గంటలకు వచ్చాడు. ఇంట్లోకి వెళ్లగా బీరువా, కబోర్డ్ తాళాలు తెరిచి ఉన్నాయి. 16 తులాల బంగారం, రూ.25వేల నగదు కనిపించలేదు. శనివారం ఉదయం నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చార్మినార్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని 45 సంవత్సరాల వ్యక్తి మృతదేహం లభించింది. మీర్‌చౌక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంజీబీఎస్ బస్టాండ్ సమీపంలోని అలీకేఫ్ వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తుక్కుగూడలో వ్యక్తి అదృశ్యం

పహాడిషరీఫ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పహాడిషరీఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడకు చెందిన నర్సింహులు రాణి దంపతులు. ఈనెల 11న రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిన నర్సింహులు తిరిగి రాలేదు. అతని స్నేహితులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య శనివారం పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గన్‌ఫౌండ్రి మాజీ కార్పొరేటర్

మంగళ్‌హట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పరిపాలన కు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌కు రాజీమానా చేసి కాంగ్రెస్‌లో చేరామని గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్ గుప్తా అన్నారు. ఈ మేరకు శనివారం గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపదాస్ మున్షి, ఖైతరాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సీఎం కాంగ్రెస్‌లోకి స్వాగతించారు. అనంతరం సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని కలిసి వినాయక ప్రతిమను బహూకరించారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.



సీఎం రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న గన్‌ఫౌండ్రి మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా, సంతోష్‌గుప్తా, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ఘనంగా మహాకాళేశ్వర ఆలయ వార్షికోత్సవం

చార్మినార్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ 8వ వార్షికోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైందని ఆలయ కమిటీ ఛైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి 8 గంటల వరకు సుప్రభాత సేవ, దేవతాభిశేకాలు, దీపారాధన, వార్షికోత్సవ సంకల్పం, విగ్నేశ్వర పూజ, రక్షాబంధనం తదితర కార్యక్రమాలతో పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మాది మండలస్థాపన, లక్ష్మి స్థాపనం, రుద్ర పీఠ స్థాపనం, ఆంజనేయ, సుబ్రహ్మణ్య స్థాపనం, నవగ్రహ దేవతపూజ, నవ గ్రహహోమం, గణపతి హోమం, రుద్రహోమం, మండలహోమం, చండీహోమం, మహాపూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయన్నారు. భక్తులందరికీ మధ్యాహ్నం 1 గంటకు అన్న ప్రసాద వితరణ చేశామన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

పహాడిషరీఫ్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీసిద్ధి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీశివ పంచాయతన ధ్వజస్తంభ, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మొదలైంది. ఆలయ నిర్వాహకులు, బడంగ్‌పేట్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్‌యాదవ్ పర్యవేక్షణలో ప్రారంభమైన ఈ పూజా కార్యక్రమాలు మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కార్పొరేట్ దిగ్గజాల కోసమే కమలం పార్టీ : ప్రొ.కంచె ఐలయ్య

రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే కమలం పార్టీ పనిచేస్తుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆరోపించారు. దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. మెజారిటీ ప్రజల అభివృద్ధికి దోహదపడ్డ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే-అంబేద్కర్‌ల జనజాతర రాష్ట్ర సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉడత రవీందర్, ఆవాజ్ కార్యదర్శి ఎండి.అబ్బాస్, టీపీఎస్‌కే కన్వీనర్ జి.రాములు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నపూర్ణ, నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, గుమ్మడి గణేష్, దశరథ్, సుబ్బారావు పాల్గొన్నారు.

బీజేపీ నేతల మాటలు, చేతలకు పొంతన ఉండదు

మాజీ ఎంపీ రవీంద్రనాయక్

బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతలు చెప్పేది కేవలం నీతులేనని వారి మాటలు, చేష్టలకు పొంతన ఉండదని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ఆరోపించారు. అవినీతిరహిత పాలన అందిస్తామని గొప్పలు చెప్పే బీజేపీ జీఎస్టీ, టాక్స్ ఎగ్గొట్టిన కంపెనీల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పెద్దమొత్తంలో నిధులను సేకరించిందని ఆయన ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశభద్రతను, పౌరుల గోప్యతలను, హక్కులను కాపాడడం కోసం చర్యలు తీసుకోవాల్సిన సెంట్రల్ ఇంటలిజెన్స్, ఐబీ, ఇతర నిఘా ఏజెన్సీలు కొన్ని ఏళ్లుగా తెలంగాణలో జరిగే ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు నిఘా పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా పనిచేసిన జి.కిషన్‌రెడ్డి, కేంద్ర నిఘా వర్గాలు కనీసం పట్టించుకోకుండా ఏంచేశాయని ప్రశ్నించారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేశామని గొప్పలు చెప్పే బీజేపీ నాయకులు పార్లమెంట్ భవనం, రామమందిరం ప్రారంభోత్సవాలకు ఎందుకు ఆహ్వానించలేదన్నారు. ఇది గిరిజన మహిళాలోకాన్ని అవమానించడమేనని ఆయన ఆరోపించారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ గిరిజనులు, బంజారాలకు ఎలాంటి స్థానమూ కల్పించలేదన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను 12 శాతం ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఈబీసీ కమిటీ జాతీయఅధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రవీంద్రనాయక్



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

ఎంపీ అసదుద్దీన్ ఇంటింటి ప్రచారం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శనివారం బహదూర్‌పురా నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హాషమాబాద్, అల్‌జుబేల్ కాలనీ, పరిసరప్రాంతాల్లో ఇంటింటికీ పర్యటించి గాలిపటం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఫలక్‌నుమా కార్పొరేటర్ తారాబాయి మోతిలాల్ పాల్గొన్నారు.

నేడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి

రాజేంద్రనగర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న ఉదయం 9 గంటలకు రాజేంద్రనగర్ లో భారత రాజ్యంగ నిర్మాత బాబాసాహేబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి జయంతి ఉత్సవాల కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ సంవత్సరం మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడిగా పచ్చ నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఆయన ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.



కాంగ్రెస్ సీనియర్ నాయకులు మురళీధర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నేతాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్ రావు, బబ్లూ

ఏర్పాట్లు పూర్తి : మురళీధర్‌రెడ్డి

● **హిమాయత్‌నగర్:** ఈనెల 14న రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ జయంతిని పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గోషామహల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కొందరు అధికారులు ఎన్నికలకోడ్ అని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం చిరాగ్‌అలీ లేన్‌లో నేతాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే అంబేడ్కర్ జయంతి, అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని మురళీధర్‌రెడ్డికి ఆహ్వానపత్రాన్ని అందజేశామని నిర్వాహకులు వెంకటేశ్వర్ రావు, బబ్లూ తెలిపారు.



మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు శనివారం టీపీసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ కార్యనిర్వాహక సభ్యుడు కేఎస్ ఆనంద్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. చిత్రంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఉన్నారు. - చాంద్రాయణగుట్ట

మోకాలి శస్త్రచికిత్సలో ఆధునిక పద్ధతులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మోకాలి శస్త్రచికిత్సలో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని డా.కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఇంజురీ ఆర్థోస్కోపీ 25 ఏళ్ల సేవలు పూర్తిచేసిన సందర్భంగా హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం లైవ్‌సర్జరీ కాన్ఫరెన్స్-2024ను నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సులో దేశంలోని సుమారు 400 మంది సర్జన్లు పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కె.రఘువీర్‌రెడ్డి, డా.ఆడ్రియన్ విల్సన్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ మోకాలి కీళ్లసంరక్షణలో నాన్‌సర్జికల్, సర్జికల్ చికిత్సలు రెండూ ఉన్నాయన్నారు. మోకాలికీలులో దెబ్బతిన్న భాగాలను తొలగించి, వాటిస్థానంలో కృతిమభాగాలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. రీఆలైన్‌మెంట్ ఆస్టియోటమి, మెనిస్కస్(జాయింట్ స్పాంజ్), లిగమెంట్, కార్టిలేజ్ శస్త్రచికిత్సల వంటి ఆధునాతన పద్ధతులున్నాయని తెలిపారు. సదస్సులో డా.క్రిస్టియన్ క్లే, దేశంలోని 20 మంది ప్రముఖ సర్జన్లు పాల్గొన్నారు.



లైవ్ సర్జరీ కాన్ఫరెన్స్-2024లో మాట్లాడుతున్న డాక్టర్లు

కొంటామని పిలిచి.. స్పోర్ట్స్‌కారు దహనం

పహాడీ షరీఫ్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కారు కొనుగోలు చేస్తామని పిలిచిన కొందరు కోట్ల విలువ చేసే కారును దహనం చేశారు. పహాడిషరీఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్ ప్రాంతానికి చెందిన నీరజ్‌కు స్పోర్ట్స్ కారు ఉంది. దీన్ని విక్రయిస్తానని స్నేహితుడు ఇయాన్‌కు చెప్పాడు. ఇదే విషయాన్ని తన స్నేహితుడు మొఘల్‌పురాకు చెందిన అమన్ హైదర్‌కు ఇయాన్ చెప్పాడు. అమన్ అహ్మద్ అనే వ్యక్తికి చెప్పగా 'నేను కారు కొంటా. తీసుకురా' అని చెప్పాడు. దాంతో ఇయాన్ నీరజ్ నుంచి కారు తీసుకొచ్చి అమన్‌కు ఇచ్చాడు. అమన్ అతడి స్నేహితుడు హందాన్ కలిసి కారును తీసుకొని శనివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో మామిడిపల్లికి వెళ్లారు. అహ్మద్ సూచించిన విధంగా శంషాబాద్ రోడ్డులో కారుతో నిలుచున్నారు. అహ్మద్ రెండు కార్లలో తన స్నేహితులతో అక్కడికి వచ్చాడు. 'నీరజ్ ఎక్కడ. నీరజ్ నాకు డబ్బులు ఇవ్వాలి. వెంటనే పిలిపించాలి' అని డిమాండ్ చేశారు. ఇంతలోనే అహ్మద్ స్నేహితులు కారుపై పెట్రోల్ పోసి మంట పెట్టారు. అమన్ డయల్ 100 కు ఫోన్ చేశాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకునేలోపు కారు పూర్తిగా దహనమైంది. నిందితులు పరారయ్యారు. పహాడీషరీఫ్ పోలీసులు మహేశ్వరం జోన్ ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పహాడిషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మామిడిపల్లి చౌరస్తాలో కాలిపోతున్న స్పోర్ట్స్ కారు



జాతీయ చేనేత సిల్క్‌ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న వేణుగోపాలచారి, పక్కన నిర్వాహకులు

జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

కవాడిగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు, చేతివృత్తుల వారు తయారు చేసిన చేనేత వస్త్రాలు, వస్తువులను కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా ఆదుకుంటూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను ఆయన రిటైర్డ్ జడ్జి జస్టిస్ మధుసూదన్‌రావుతో కలిసి ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన దాదాపు 300 స్టాళ్లను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు నెల రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర అధ్యక్షురాలు కోట దేవకిదేవి, నిర్వాహకులు సత్యనారాయణచౌదరి, మహేష్‌సాయిచౌదరి, నదీమ్ పాల్గొన్నారు.

శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించిన డీసీపీ

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పాతనగర శ్రీరామసేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామ నవమి శోభాయాత్ర మార్గాన్ని శనివారం సౌత్ ఈస్ట్ డివిజన్ డీసీపీ జానకి, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్‌గౌస్‌తో కలిసి పరిశీలించారు. శ్రీరామసేన అధ్యక్షుడు తాడెం శ్రీనివాసరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు.



ఊరేగింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీసీపీ జానకి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

నలుగురి దుర్మరణం

- ఎదురుగా వస్తున్న కారును ఢీకొని ఇద్దరు..
- రోడ్డు మధ్యలో ఆగిన లారీని ఢీకొని ఇద్దరు మృతి

నగర శివారు ప్రాంతాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. ముగ్గురు గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నిద్రమత్తులో అతివేగంగా కారు డ్రైవింగ్ చేస్తూ గుర్రంగూడ సమీపంలో డివైడర్‌ను ఢీకొని పక్కరోడ్డులోని కారును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో సంఘటనలో సరూర్‌నగర్ స్టేడియం సమీపంలో ప్రధాన రోడ్డు మధ్యలో నిబంధనలకు విరుద్ధంగా నిలిచి ఉన్న లారీని ఓ కారు ఢీకొట్టడంతో కారులోని ఇద్దరు మృతిచెందారు.

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అతివేగం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. నిద్రమత్తులో అతివేగంగా కారు నడిపి డివైడర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన బొల్లం ప్రణయ్ కుమార్(29),


ప్రణయ్ కుమార్(ఫైల్)


రవీందర్ బాబు (ఫైల్)

ప్రకాశం జిల్లా సంతనూతల మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కుంచాల రవీందర్ బాబు(29) స్నేహితులు. శుక్రవారం అర్ధరాత్రి 2.30 గంటలకు వీరు స్విఫ్ట్ కారు (టీఎస్22టిఎ 0898)లో తుర్కయాంజాల్‌నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వస్తున్నారు. అదేసమయంలో నల్గొండ జిల్లా వడ్డెమోనిగూడెం తండాకు చెందిన ఇస్లావత్ దస్రు(26)తన క్రెటా కారు(టీఎస్05ఈసీ0123)తో బీఎన్‌రెడ్డినగర్ నుంచి తుర్కయంజాల్ వైపు వెళ్తున్నాడు. గుర్రంగూడ చౌరస్తా దాటిన తర్వాత నిద్రమత్తులో అతివేగంగా కారు నడపడంతో డివైడర్‌ని ఢీకొని అవతలివైపు నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారులోని బొల్లం ప్రణయ్ కుమార్, కుంచాల రవీందర్ బాబు అక్కడికక్కడే మృతి చెందారు. ఇస్లావత్ దస్రుకు తీవ్ర గాయాలు కాగా అతన్ని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వనస్థలిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..


ప్రమాదానికి గురైన కారు

వనస్థలిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా చిల్కూర్ బేతవోలుకు చెందిన సాడే వీరయ్య(78), అదే ప్రాంతానికి చెందిన సుంకర మొగ్గయ్య(60)లు హయత్‌నగర్ సూర్యనగర్ కాలనీలో ఉంటున్న సాడే జగదీశ్‌తో కలిసి హెల్త్ చెకప్ కోసం శనివారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి ఓలా క్యాబ్‌లో బయలుదేరారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద నిబంధనలకు విరుద్ధంగా, రోడ్డు మధ్యలో ఆగి ఉన్న లారీని వెనక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న మొగ్గయ్య అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి తీవ్ర గాయాలైన వీరయ్యను సమీపంలోని కామినేని ఆస్పత్రికి, స్వల్ప గాయాలైన జగదీశ్, కిరణ్‌కుమార్‌లను మరో ఆస్పత్రికి తరలించారు. వీరయ్య చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాల్‌గర్ల్ అంటూ వధువు ఫోన్ నంబర్

- ఫేస్‌బుక్, మెట్రో స్టేషన్ టాయ్‌లెట్లలో రాతలు
- క్యాటరింగ్ మాటున బెదిరింపులు, వేధింపులు
- 11 కేసుల్లో నిందితుడి అరెస్ట్


ఉన్నారు స్వామి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాల్‌గర్ల్ కావాలా.. అయితే సంప్రదించండి అంటూ ఓ నూతన వధువు ఫోన్ నంబర్‌ను ఫేస్‌బుక్, మెట్రో రైల్వే టాయ్‌లెట్‌లపై రాసి, వేధింపులకు గురిచేసిన ఘరానా నేరగాడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బషీర్‌బాగ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ కవిత.. వివరాలను వెల్లడించారు. అనంతపూర్‌కు చెందిన ఎం. ఉన్నారు స్వామి (34) యూసఫ్‌గూడలో ఉంటూ క్యాటరింగ్ పనులు చేస్తుంటాడు. క్యాటరింగ్‌కు సంబంధించి పాంప్లెట్లు, పోస్టర్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నాడు. అంతేకాకుండా జస్ట్ డయల్‌లో కూడా నమోదు చేసుకున్నాడు. పనుల కోసం నిరుద్యోగ యువకులు ఇతడిని సంప్రదించేవారు. ఆన్‌లైన్ ద్వారా పెళ్లిళ్లు, ఫంక్షన్లకు క్యాటరింగ్ కోసం మనుషులు కావాలని సంప్రదించే వారికి వీరిని పంపేవాడు. ఫంక్షన్ ముగిసిన తర్వాత ఎక్కువ డబ్బులు డిమాండ్ చేసి, ఇవ్వకుంటే గొడవ పడేవాడు. అంతటితో ఆగక ఫంక్షన్‌లో వచ్చిన బంధువులు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, అసభ్యకరంగా దూషించడంతోపాటు డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తానని బెదిరించేవాడు. దీంతో ఇతడిపై నగరంలో ఇప్పటికే 10 కేసులు నమోదయ్యాయి. పోలీసు కేసుల నుంచి తప్పించుకునేందుకు స్వామి తరచూ ఫోన్ నెంబర్లు మార్చేవాడు.

నూతన వధువుకు వేధింపులు

బోయినపల్లిలో ఓ నూతన జంట రిసెప్షన్ వేడుకకు క్యాటరింగ్ బాయ్స్ కోసం జస్ట్‌డయల్‌ను సంప్రదించింది. క్యాటరింగ్ కోసం మనుషులను సరఫరా చేస్తానని, అందుకు రూ.7,500 ఇవ్వాలని స్వామి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఫంక్షన్ ముగిసిన తర్వాత ఎక్కువ సమయం ఉంచుకున్నారు.. పని ఎక్కువ చేయించుకున్నారంటూ రెట్టింపు డబ్బు (రూ.15వేలు) డిమాండ్ చేశాడు. పెళ్లి బృందం వారు ఒప్పుకోకపోవడంతో వారితో గొడవపడ్డాడు. పలు ఫోన్‌నంబర్లతో ఫోన్‌లు చేసి దూషించడమే కాకుండా అంతుచూస్తానని బెదిరించేవాడు. వధువు వివరాలతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించి అసభ్య ఫొటోలు, సందేశాలు పంపేవాడు. అంతేకాకుండా మెట్రో టాయ్‌లెట్లలో కాల్‌గర్ల్ కావాలా సంప్రదించండంటూ వధువు ఫోన్ నంబర్ పెట్టాడు. దాంతో నూతన దంపతుల ఫోన్‌లకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ అసభ్య సందేశాలు వస్తున్నాయి. దాంతో మనస్తాపానికి గురైన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు నిందితుడు ఉన్నారు స్వామిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి 2 ఫోన్లు, 3 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఇప్పటికి 30 సిమ్‌కార్డులను మార్చినట్లు తమ విచారణలో గుర్తించామని డీసీపీ తెలిపారు. క్యాటరింగ్ పేరుతో మనుషులను సరఫరా చేస్తున్న ఇతడు, అడిగినంత డబ్బు ఇవ్వకుంటే మహిళల నంబర్లు తీసుకొని సోషల్ మీడియాలో పెట్టి వేధింపులకు గురిచేస్తున్నాడని తెలిపారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.సైదులు, ఎస్సైలు ప్రసేన్‌రెడ్డి, తేజశ్రీలతో పాటు కానిస్టేబుళ్లు నరేష్‌కుమార్, విజయ్, మణికంఠ, తిరుమలేష్‌లను డీసీపీ అభినందించారు.

అయోమయంగా 'అమ్మ' కమిటీలు..!

- సమావేశాలు పెట్టకుండానే బ్యాంకు ఖాతాల ఓపెనింగ్
- ఉన్నతాధికారుల మెప్పు కోసం డీఐఓఎస్‌ల ఆరాటం
- ఇబ్బందులు పడుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు
- పలుచోట్ల తెలిసిన తల్లుల పేర్లతో ఖాతాలు తీయాల్సిన పరిస్థితి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏపీసీసీ)లు అయోమయంగా మారాయి. మండల స్థాయిలో పనిచేసే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐఓఎస్‌లు) అధికారుల్లో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల మెప్పు పొందేందుకు పాఠశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేయకుండానే తమకు తెలిసిన విద్యార్థుల తల్లుల పేర్లతో తీర్మానం కాపీలు తయారు చేసి బ్యాంకు ఖాతాలు తీస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం దెబ్బతినడంతోపాటు పథకంపై తల్లులకు అవగాహన కొరవడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు నడుం బిగించింది. గత ప్రభుత్వం పట్టించుకోని పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఈ మేరకు ప్రతి పాఠశాలలో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను భాగస్వాములుగా చేసి వారినే కమిటీల్లో నియమించి ప్రతిపాదిత పనులను చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. కాగా, గ్రామస్థాయి కమిటీలో సంబంధిత పాఠశాల సమీపంలోని విలేజీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (వీడీఓ)గా, పట్టణాల్లో ఏరియా లెవల్ ఫెడరేషన్లు (ఏఎల్‌ఎఫ్)గా గుర్తించారు. ఈ మేరకు అక్కడి మహిళలనే కమిటీ చైర్‌పర్సన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లులను.. చైర్మన్, హెచ్‌ఎంతో కలిసి చర్చించి సభ్యులుగా ప్రతిపాదించాలి. ఇందులో ఒకరు ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారై ఉండాలి. కమిటీ కాలపరిమితి రెండేళ్లు లేదా విద్యార్థి పాఠశాల నుంచి వదిలి వెళ్లే వరకు ఏది ముందుగా జరిగితే అంతవరకు ఉంటుంది. ఆ తర్వాత కొత్తవారిని కమిటీలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

రూ.30.63 కోట్లు మంజూరు..

పాఠశాల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ), ఏరియా లెవల్ ఫెడరేషన్లను (ఏఎల్‌ఎఫ్) భాగస్వాములను చేయడం ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్య అందించే అవకాశం ఏర్పడుతోందని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భావించింది. ఇందులో భాగంగా సర్కారు బడుల్లో మౌలిక వసతులను ప్రాధాన్యం కల్పిస్తూ జీఓ-5ని జారీ చేసింది. ఈ మేరకు స్కూల్ యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్) లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల చేయనున్నారు. జూన్ 10లోగా ఆయా స్కూళ్లలో పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం అధి కారులను ఆదేశించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లాలోని 562 పాఠశాలలకు రూ. 30.63 కోట్లు మంజూరు చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ పనులను కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

కమిటీలు వేయకుండానే బ్యాంకు ఖాతాలు..

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (మండల విద్యాధికారి) ఆధ్వర్యంలో తొలుత కమిటీలను పూర్తి చేయాల్సి ఉంటుంది. తర్వాత పాఠశాలలో కావాల్సిన పనులను గుర్తించి కమిటీ తీర్మానం చేయాలి. అనంతరం చైర్‌పర్సన్, మెంబర్ కన్వీనర్ (హెచ్‌ఎం) పేరిట బ్యాంకుల్లో జాయింట్ ఖాతా తెరవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని చాలా చోట్ల కమిటీలను నియమించకుండానే తమకు తెలిసిన విద్యార్థుల తల్లులను కమిటీల్లో సభ్యులుగా నియమిస్తున్నారు. అందులో ఒకరిని చైర్‌పర్సన్‌గా ఎంపిక చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అమ్మ ఆదర్శ కమిటీలపై తొలుత తల్లులతో అవగాహన సమావేశం నిర్వహించిన తర్వాతనే కమిటీలు వేయాల్సిన అధికారులు హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకొస్తూ హడావుడి చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక తమకు తెలిసిన పేర్లనే కమిటీల్లో పెడుతుండడంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరలేకపోతోందని పలువురు హెచ్‌ఎంలు వాపోతున్నారు. సరైన పనులను గుర్తించకుండా తూతూ మంత్రంగా తీర్మానాలు చేస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరదని పేర్కొంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కూడా హెచ్‌ఎంల భాగస్వామ్యాన్ని పట్టించుకోకపోవడంతో అత్యవసర పనులు పూర్తికాలేదని చెప్పుకొచ్చారు. ఉన్నతాధికారుల మెప్పు పొందేందుకు కొంతమంది డీఐఓఎస్‌లు ఆగమేఘాలపై కమిటీలు వేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక రైళ్లకు డ్రైవర్లే లేరు..

(5వ పేజీ తరువాయి)

ఇంటి నుంచి బయల్దేరి రైలింజన్ క్యాబిన్‌లోకి వెళితే, తిరిగి ఇంటికి వచ్చే సరికి 20గంటల సమయం పడుతుండగా, గూడ్స్‌రైళ్లు నడిపే లోకో పైలెట్లయితే.. ఏకంగా 60నుంచి 80గంటల పాటు వారి కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ఇన్ని గంటల పాటు పనిచేసి వచ్చిన గూడ్స్ డ్రైవర్లకు.. వేసవి ప్రత్యేక రైళ్లకు డ్యూటీలు వేయడం వలన, వారిపై మానసికంగా, శారీరకంగా ఒత్తిడి పెరుగుతోందని రైల్వే సిబ్బంది చెబుతున్నారు. కొత్తగా వచ్చిన ఆధునిక రైలింజన్లలో లోకోపైలట్‌లకు ఏసీ, టాయిలెట్లు వంటి సదుపాయాలుండగా, ప్రత్యేక రైళ్లకు వినియోగించే పాత రైలింజన్లలో కొన్నింటికి టాయిలెట్ సదుపాయాలు కూడా లేవంటున్నారు. దీంతో 50ఏళ్లకు పైబడిన డ్రైవర్లు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్లు చెబుతున్నారు. రైల్వేలో రెగ్యులర్‌గా డ్రైవర్ల నియామకాలు జరగకపోవడం, నియామకాలు జరిగినపుడు బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాలకు చెందినవారు లోకోపైలట్లుగా హైదరాబాద్‌కు వచ్చి, రెండు మూడేళ్లలోపే వారి సొంత ప్రదేశాలకు బదిలీపై వెళుతుండడం.. డ్రైవర్ల కొరతకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్‌లో సుమారు 2,200మంది లోకోపైలట్లు, అసిస్టెంట్ లోకోపైలట్లు అందుబాటులో ఉన్నారు. వీరిలో సుమారు 600మంది ప్యాసింజర్ రైళ్లు నడిపే లోకోపైలట్లు కాగా, మిగిలిన వారంతా గూడ్స్ రైళ్లు నడుపుతున్నారు. సికింద్రాబాద్ డివిజన్‌తో పాటు గుంటూరు, విజయవాడ, నాందేడ్, గుంతకల్, హైదరాబాద్ డివిజన్లలోనూ దాదాపు ఇదే పరిస్థితులున్నాయని ఉద్యోగ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

నాలాల్లో పూడిక తీసేదెప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

సంబంధించి సర్కిళ్ల వారీగా టెండర్ నోటిఫికేషన్ ప్రకటించి ఏజెన్సీలను ఖరారు చేస్తారు. ఇప్పటికీ ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్ జోన్లలో కొన్ని పనుల టెండర్ ప్రక్రియ పూర్తవలేదని ఓ అధికారి చెప్పారు. వందల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడమూ ఒక కారణంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర పనుల కేటగిరీలో రీ టెండర్‌కు అనుమతి ఇవ్వాలని ఎన్నికల సంఘానికి జీహెచ్‌ఎంసీ లేఖ రాసినట్టు తెలిసింది. ఇదిలా ఉంటే సంస్థలను ఎంపిక చేసినా.. కొన్ని సర్కిళ్లలో పనులు ప్రారంభించలేదు. నగరంలో ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు కురుస్తుంటాయి. జూన్‌లోనూ ఒక్కోసారి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఆ లోపు పూడికతీత పూర్తి చేయాల్సి ఉన్నా.. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది సర్కిళ్ల వారీగా రెండు, మూడు ప్యాకేజీలుగా టెండర్లు ప్రకటించారు. రూ.53.60 కోట్లతో 63 పనులకు ఏజెన్సీలను ఎంపిక చేశారు. 3.04 లక్షల క్యూబిక్ మీటర్ల వ్యర్థాలను తొలగించారు. కిందటి సంవత్సరమూ సకాలంలో పనులు జరగకపోవడంతో తక్కువ వర్షపాతం నమోదైనా.. నాలా పక్కనున్న పలు బస్తీలు, కాలనీలు నీట మునిగాయి. గతానికి భిన్నంగా ఈ దఫా ఏరియాల వారీగా పూడికతీతకు టెండర్లు ప్రకటించారు.

టీఎస్ఎస్పీడీసీఎల్ యాప్‌లో కొత్త ఆప్షన్లు

(5వ పేజీ తరువాయి)

రిపోర్ట్ చేయడం, టారిఫ్ వివరాలు, సేఫ్టీ టిప్స్ వంటి వివరాలు యాప్‌లో చూసుకోవచ్చు. అప్‌డేట్ చేసిన యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని యూఎస్సీ నంబర్ నమోదు చేసుకుంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. యాప్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటికే యాప్ వాడుతున్న వినియోగదారులు కొత్త వెర్షన్ అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రెడ్‌ఫోర్ట్ అక్బర్ కంపెనీ నిర్మాణాల్లో జోక్యానికి

హైకోర్టు నిరాకరణ

- నిర్మాణాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ సమీపంలోని షేక్‌పేట సర్వే నంబర్ 403 (వార్డు నంబర్ 9)లోని 4.18 ఎకరాల భూమిలో ఇందూ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రెడ్‌ఫోర్ట్ అక్బర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేపడుతున్న నిర్మాణాలపై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. అయితే సదరు నిర్మాణాలు ప్రస్తుత ప్రజాప్రయోజన వ్యాజ్యంలో వెలువడే తుది తీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంది. ప్రస్తుతం వివాదంలో ఉన్న ఈ 4.18 ఎకరాల భూమిని 2013 నాటి తక్కువ ధరకు 2021లో తెలంగాణ ప్రభుత్వం రెడ్‌ఫోర్ట్ అక్బర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అక్రమంగా కేటాయించిందని, ఈ భూకేటాయింపును అడ్డం పెట్టుకుని ప్రైవేటు ప్రతివాదులు (ఇందూ ప్రాజెక్ట్స్, రెడ్‌ఫోర్ట్ అక్బర్ ప్రాపర్టీస్) అక్కడ ఉన్న గుట్టలను తొలగించడంతోపాటు హనుమాన్ ఆలయాన్ని కూల్చేశారని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్‌ను రాష్ట్రీయ వానరసేన అనే సంస్థ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది గుర్రం రఘు వాదనలు వినిపిస్తూ.. రెడ్‌ఫోర్ట్ అక్బర్ ప్రాపర్టీస్ కంపెనీ భూకేటాయింపును ఆసరాగా చేసుకొని హనుమాన్ ఆలయాన్ని కూల్చేశారని తెలిపారు. 2013 నాటి ఈ-వేలం ధరకు 2021లో కేటాయించడం అక్రమమని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ. వందల కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ప్రైవేటు ప్రతివాదులు సదరు స్థలంలో ఉన్న గుట్టలను అనుమతి లేకుండానే మైనింగ్ చేస్తున్నారని, 40 ఏళ్లుగా ఉన్న హనుమాన్ ఆలయాన్ని కూల్చివేశారని పేర్కొన్నారు. నిర్మాణాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఇందూ, రెడ్‌ఫోర్ట్ ప్రాపర్టీస్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ జారీచేసిన అవార్డు ద్వారా సదరు భూమి ప్రతివాదులకు కేటాయించారని, తక్కువ ధరకు కేటాయించారనే వాదనకు ఆస్కారం లేదని పేర్కొన్నారు. చట్టబద్ధంగా అన్ని అనుమతులు పొందిన తర్వాతే డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ప్రతివాదులకు సదరు భూమి ఆర్బిటేషన్ అవార్డు ద్వారా వచ్చిందని పేర్కొంటున్నందున ఈ దశలో నిర్మాణాలు నిలిపేస్తే ఆర్థికంగా నష్టం జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు నిర్మాణాల్లో జోక్యం చేసుకోలేమని.. సదరు నిర్మాణాలు ప్రస్తుత పిటిషన్‌లో ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గుడిసెల ముందు ఆడుకుంటున్న చిన్నారిపై వీధికుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాలకు గురైన చిన్నారి మృతి చెందింది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన విశ్రం ప్రసాద్ కుటుంబ సభ్యులతో నాలుగు మాసాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. కుత్బుల్లాపూర్ గోదారిహోమ్స్‌లోని భీమ్ కాలమ్ అపార్టుమెంట్స్ నిర్మాణం వద్ద గుడిసె వేసుకొని కూలీగా పని చేస్తున్నారు. దంపతులకు ముగ్గురు సంతానం. శుక్రవారం భార్యాభర్తలు ఇద్దరూ పనికి వెళ్లగా గుడిసె ముందు ఆడుకుంటున్న సోదరితో కలిసి చిన్నారి దీపాలి(2.5) ఆడుకుంటుండగా రెండు కుక్కలు దాడి చేశాయి. దీంతో దీపాలికి తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు నిలోఫర్‌కు రెఫర్ చేశారు. నిలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ మేరకు తల్లిదండ్రులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కిరాణ షాపునకు వచ్చిన ఆరేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై మలక్‌పేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ముసారాంబాగ్‌లో నివాసముంటున్న కుటుంబానికి చెందిన ఆరేళ్ల బాలిక ఈనెల 10న రాత్రి 9గంటల ప్రాంతంలో స్థానికంగా ఉన్న కిరాణ షాపునకు వెళ్లింది. సలీంనగర్ నివాసి అయిన కిరాణ షాపు యాజమాని జి.సుబ్బారావు (52) బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఏడుస్తూ తన తల్లికి విషయం చెప్పడంతో ఆమె మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జరిగిన సంఘటనపై విచారణ జరిపి సుబ్బారావును అరెస్టు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద, ఎస్సీఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సరఫరాకు ఆటంకం కలిగించే..

(5వ పేజీ తరువాయి)

కాలనీలు, బస్తీలు, కలుషిత నీటి ప్రభావిత ప్రాంతాలకు నీటి సరఫరా చేసేందుకు 2.5 కేఎల్ సామర్థ్యం కలిగిన 70 మినీ ట్యాంకర్లను కూడా తీసుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ట్యాంకర్ డెలివరీ టైమింగ్స్ తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పుడున్న ట్యాంకర్లతో పాటు రానున్న వంద ట్యాంకర్లను సమర్థంగా వినియోగించుకుని డెలివరీ సమయాన్ని 12 గంటలకు తగ్గించాలని ఆదేశించారు. ఇందుకు ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

సాగర్‌లో ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాట్లు

నాగార్జున సాగర్‌లో ఎమర్జెన్సీ పంపింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని, 15వ తేదీ తర్వాత ఏ క్షణమైనా పంపింగ్ చేసే అవకాశముందని వివరించారు. గ్రేటర్ పరిధిలో నీటిసేకరణ, సరఫరా ప్రాంతాలు, ఇతర వివరాలు సేకరించడానికి ప్రత్యేక సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్షలో ఈడీ. డా.ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు వీఎల్. ప్రవీణ్‌కుమార్, రవికుమార్, స్వామి, సీజీఎంలు, జీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

9 ఆంధ్రజ్యోతి 14 ఏప్రిల్ 2024
నవ్య కుటుంబ కదంబం ఆదివారం



'క్రాక్' సినిమాతో తాను వైవిధ్యమైన నటినని నిరూపించుకున్న వరలక్ష్మీ శరత్‌కుమార్... ప్రస్తుతం అనేక చిత్రాలలో ముఖ్యమైన పాత్రల్లో నటిస్తోంది. తాజాగా ఆమె నటించిన 'శబరి' విడుదలకు సిద్ధంగా ఉంది. "ఇప్పటిదాకా నేను చేసిన పాత్రలన్నీ ఒక ఎత్తు. 'శబరి'లో పాత్ర మరో ఎత్తు" అంటున్న వరలక్ష్మీ శరత్‌కుమార్‌తో 'నవ్య' ఇంటర్వ్యూ.

సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్‌నే అంటారు

మీరు సినిమా కుటుంబం నుంచి వచ్చారు? ఒక నటిగా మీ జర్నీ ఎలా సాగుతోంది?

చాలా బాగా ఉంది. అనేక పాత్రలు నాకు వచ్చాయి. ఈమధ్య కాలంలో రైటర్లు నా కోసం పాత్రలు రాస్తున్నారు. దీని వల్ల వైవిధ్యభరితమైన పాత్రలలో నటించగలుగుతున్నా. చెప్పాలంటే ఒక విధంగా చాలా సంతృప్తిగా ఉంది.

మీ విషయంలో రకరకాల పాత్రలు వస్తున్నాయి కదా! మీరు వాటిని ఎలా ఎంచుకొంటారు?

నా ఉద్దేశంలో ఒక సినిమాకు హీరో... స్క్రిప్ట్. ఈ స్క్రిప్ట్‌లో నా పాత్ర ఎంత ఉందనే విషయంపైనే నా దృష్టి ఉంటుంది. ఆ క్యారెక్టర్ నేను అంతకు ముందుగా చేశానా లేదా అనే విషయాన్ని ఆలోచిస్తా. ఒకవేళ నేను అప్పటికే ఆ తరహా పాత్ర చేసి ఉంటే దానిలో ఏదైనా వైవిధ్యం చూపించగలమా... అనే విషయాన్ని ఆలోచిస్తా. అప్పుడు ఆ పాత్రను ఒప్పుకుంటా.

మీరు మెయిన్ రోల్స్‌నే ఎంచుకొంటారా?

లేదండి. ఒక నటిగా నన్ను నేను ఇంకా నిరూపించుకోవాల్సి ఉంది. అందువల్ల ఎప్పటికప్పుడు కొత్త తరహా పాత్రలను ఎంచుకొంటూ ఉంటాను. ఉదాహరణకు ఇప్పటిదాకా నేను కామెడీ పాత్రలు చేయలేదు. అలాంటి పాత్ర వస్తే చేయాలని ఉంది. అదే విధంగా ఒక పీరియడ్ ఫిల్మ్ చేయలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే... నన్ను నేను నటిగా నిరూపించుకొనే పాత్ర ఇప్పటి దాకా రాలేదు. అలాంటి పాత్ర కోసం ఎదురుచూస్తున్నా.

చేద్దామని మిస్ అయిన పాత్రలు ఏమైనా ఉన్నాయా?

లేవు. నాకు ఈ మధ్యకాలంలో కొన్ని రకాల బోల్డ్ పాత్రలు వస్తున్నాయి. బహుశా ఆ కేటగిరిలో నాలా చేసేవాళ్లు ఎవరు లేరనుకుంటా! నెమ్మదిగా నాకు వైవిధ్యభరితమైన పాత్రలు వస్తున్నాయి.

సాధారణంగా అక్కలు... వదినల పాత్రలు ఎక్కువుంటాయి. మీకు అలాంటి పాత్రలు రాలేదా?

అలాంటి పాత్రలైనా నాకు ఎలాంటి సమస్యా లేదు. కానీ నాకు ఇప్పటి దాకా అలాంటివి ఎక్కువ రాలేదు. అలాంటి పాత్రలు చేయటానికి కూడా నాకు అభ్యంతరం లేదు. నా దృష్టిలో ఏదైనా పనే! అది చిన్నది కావచ్చు.. పెద్దది కావచ్చు.. ఎప్పుడూ నటిగా నా పరిధిని పెంచుకోవటానికి ప్రయత్నిస్తూ ఉంటా!

మీరు తమిళం నుంచి వచ్చారు. అక్కడ సంస్కృతి.. వేషభాషల ప్రభావం మీపై ఉందా?

అదృష్టవశాత్తు నన్ను ఒక తమిళ నటిగా ఎవరూ గుర్తించలేదు. మొదటి నుంచి నేను అన్ని భాషల్లోనూ యాక్ట్ చేశాను. అన్ని భాషలవారూ నన్ను గుర్తించారు. ఇప్పటికీ చాలా మంది నన్ను తెలుగు అమ్మాయి అనుకుంటారు. కన్నడలో యాక్ట్ చేస్తే... వాళ్లు తమ అమ్మాయి అనుకుంటారు.

చిన్నప్పుడు ఎప్పుడైనా సినిమాల్లోకి రావాలనుకున్నారా?

చిన్నప్పటి నుంచి నేను థియేటర్‌లో యాక్టివ్‌గా ఉండేదాన్ని. అనేక నాటకాలు కూడా వేశాను. కానీ ఎప్పుడూ సినిమాల్లోకి రావాలని అనుకోలేదు. నా దృష్టిలో నటనకు సినిమాలు ఒక్కటే వేదిక కాదు. నేను యాక్టింగ్ స్కూలుకు వెళ్లినప్పుడు నాలో ఈ సినిమాల పట్ల ప్రత్యేక ఆసక్తి ఉందనే విషయం అర్థమయింది. చిన్నప్పుడు నాకు డాక్టర్ కావాలని ఉండేది. కానీ చివరకు యాక్టర్ అయ్యాను.

'పీఎస్'లో ఉంటాననుకున్నారు

'పీఎస్' చిత్రంలో నేను ఉంటానని అందరూ అనుకున్నారు. చాలా మంది చెప్పారు కూడా. నా చేతిలోకి పాత్ర వచ్చి.. ఆ తర్వాత నన్ను వద్దనుకుంటే ఫీలవ్వాలి. కానీ అసలు సినిమాలో పాత్రకే నన్ను ఎంపిక చేయనప్పుడు నేను ఫీలవ్వాల్సిన అవసరం ఏముంది? డైరక్టర్‌కు ఒక విజన్ ఉంటుంది. దానికి తగ్గట్టుగా పాత్రలను ఎంపిక చేస్తారు.



మీరు ఒక స్టార్ కిడ్ కదా. మీకు సినిమా రంగంలో ప్రవేశం సులభమయిందా?

ఈ ప్రశ్న నన్ను చాలా కాలంగా వెంటాడుతోంది. స్టార్‌కిడ్‌లకు ప్రవేశం సులభం అవుతుంది అంతే! విమిగిలిన కష్టాలన్నీ వాళ్లు కూడా పడాలి. చాలా మంది స్టార్‌కిడ్స్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంటుందనుకుంటారు. కానీ అలా ఉండదు. ప్రేక్షకులకు నచ్చకపోతే కెరీర్ పోతుంది. సినిమాలో నటించేవారు... స్టార్ కిడ్సా లేదా సాధారణ నేపథ్యం నుంచి వచ్చినవారా అనే విషయాన్ని ప్రేక్షకులు చూడరు. వారికి సినిమా బావుండాలంతే! నా ఉద్దేశంలో టాలెంట్, అదృష్టం ఉండాలి. కొన్నిసార్లు ఎంత కష్టపడినా విజయం రాదు. నన్నే తీసుకోండి... నేను ఇండస్ట్రీకి వచ్చి చాలా కాలమయింది. కానీ 'క్రాక్' సినిమా తర్వాతే నాకు సక్సెస్ వచ్చింది. అంత కాలం నేను సరైన పాత్ర కోసం వేచి చూశానంతే! కష్టపడి పనిచేయాలి. మంచి ఫలితం కోసం వేచి చూడాలి. అంతకన్నా వేరే మార్గం లేదు.

బెస్ట్ కాంప్లిమెంట్

ఒకప్పుడు నా వాయిస్ బావుండదనేవారు. డబ్బింగ్ పెట్టుకుంటే మంచిదనేవారు. ఇప్పుడు వాళ్లే నా వాయిస్ చాలా బావుందంటున్నారు. నేనే డబ్బింగ్ చెప్పాలనుకుంటున్నారు. అదే నాకు వారు ఇచ్చే బెస్ట్ కాంప్లిమెంట్.

డైరక్షన్ చేస్తా

ఏదో ఒక రోజు నేను డైరక్షన్ చేస్తా. అది కూడా నా జర్నీలో ఒక భాగమే!

కానీ అలా వేచి చూడటం వెనక చాలా మానసిక ఒత్తిడి ఉంటుంది కదా..!

ఉంటుంది. యాక్టర్స్‌కు చాలా ఒత్తిడి ఉంటుంది. దానిని బయటకు చెప్పలేం. ఎవరైనా నా దగ్గరకు వచ్చి సినిమాల్లోకి వస్తానంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకొమ్మని చెబుతా! ఎందుకంటే ఇండస్ట్రీలో మనుగడ సాగించటం అంత సులభం కాదు. మనపై ఎవరో ఒకరు కామెంట్స్ చేస్తూ ఉంటారు. పాత్రల కోసం వేచి చూస్తూ ఉండాలి. సినిమాల పట్ల అవితమైన ప్రేమ, ఆత్మనిబ్బరం ఎక్కువగా ఉన్న వ్యక్తులు మాత్రమే సినిమా రంగానికి రావాలి. ఒక్క ఛాన్స్ దొరకాలి. సినిమా విడుదల కావాలి. అది హిట్ కావాలి. హీరోయిన్లకు ఇంకా కష్టం. సినిమా హిట్ కాకపోతే... హీరోయిన్‌ది ఐరెన్ లెగ్ అంటారు. ఛాన్స్ ఇవ్వద్దంటారు. కథ బావుండక సినిమా ఫ్లాప్ అయితే.. దానికి హీరోయిన్‌కు సంబంధమేమిటి?

మీరు ఎమోషనల్‌గా ఉంటారా?

లేదు. నేను వీలైనంత బ్యాలెన్స్‌గా ఉంటా! ఎప్పుడూ ఆనందంగా ఉండటానికి ప్రయత్నిస్తా. అనవసరపు విషయాలను ఎక్కువగా పట్టించుకోను. చిన్నప్పటి నుంచి నేను ఇంతే! నాకు జీవితంలో అనేక కష్టనష్టాలొచ్చాయి. నాకు ఎన్ని కష్టనష్టాలొచ్చినా పాజిటివ్‌గానే ఉండేదాన్ని.

ఈ తరం వాళ్లకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

లైఫ్ ఈజ్ నాట్ ఈజీ. అనేక అడ్డంకులు ఎదురవుతాయి. కొత్త కొత్త సవాళ్లు వస్తాయి. వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్లాలి. నన్నే ఒక ఉదాహరణగా తీసుకోండి... నేను సినిమాల్లోకి వచ్చిన తర్వాత నాకు గొప్ప పాత్రలు రాలేదు. ఆ సమయంలో నిరాశ పడివుంటే నేను ఈ రోజు ఇలా ఉండేదాన్ని కాదు. నేను ఈ రంగంలోనే ఉండాలనుకున్నా.

సీవీఎల్ఎన్ ప్రసాద్

వైరల్



రికార్డులు 'ఎత్తేసింది'

ఈ చిన్నారిని చూస్తున్నారుగా... పేరు అర్షియా గోస్వామి. ఉండేది హరియాణాలోని పంచకుల. వయసు తొమ్మిదేళ్లు. కానీ వెయిట్‌లిఫ్టింగ్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. వయసుకు మించిన బరువులు ఎత్తేసి... అబ్బుర పరుస్తోంది. ఇటీవల 75 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో మరో అరుదైన ఘనత సాధించింది. ఈ ఫీట్‌ను వీడియో తీసి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు ఒకరు. ఇక చెప్పేదేముంది... అర్షియా నైపుణ్యానికి నెటిజనులు ఫిదా అవుతున్నారు. వేల లైక్స్‌తో ఆ చిన్నారిని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. వెయిట్‌లిఫ్టింగ్ రికార్డులు అర్షియాకు కొత్తేమీ కాదు. ఆరేళ్ల వయసులో 45 కేజీల డెడ్‌లిఫ్ట్ ప్రదర్శించి, ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. అదే ఏడాది 35.8 కేజీల బరువును ఎత్తిన 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో తన పేరు నమోదు చేసుకుంది.

అలుపెరుగని ప్రయాణం

నాలుగు దశాబ్దాలుగా తెర మీద కనపడుతోంది. బాలీవుడ్‌తోపాటుదక్షిణాది భాషల్లోనూ నటిగా ఆమె క్రేజ్ వేరు. ఆమే.. టబు. ఇటీవలే 'క్రూ' చిత్రం విడుదలైన సందర్భంగా టబు గురించి కొన్ని విశేషాలు..

ఇటీవలే కరీనా కపూర్, కృతిసనన్‌తో కలసి టబు ఎయిర్‌హోస్టెస్‌గా 'క్రూ' చిత్రంలో నటించింది. ఈ కామెడీ ఫిల్మ్‌లో టబు నటనకు ఫిదా అవుతున్నారు. టబు ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు నలభై రెండేళ్లయింది.. అంటే ఎవరూ నమ్మరు. అయినా ఇప్పటికీ నటిగా ఆమె ఏమాత్రం తగ్గలేదు. 'మేల్ ఓరియంటెడ్ ఇండస్ట్రీలో ఓ ముగ్గురు కథానాయికలం కలసి వందకోట్ల వసూళ్లను సాధించాం. ఇదెంతో ఆనందం' అంటుంది టబు.

ఇదీ నేపథ్యం

టబు నేపథ్యం హైదరాబాద్‌తో ముడిపడి ఉంటుంది. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగింది. పూర్తి పేరు తబస్సుమ్ ఫాతిమా హష్మీ. తన తండ్రి పాకిస్తాన్ నటుడు. పేరు జమాల్ అలీ హష్మీ. తల్లి పేరు రిజ్వానా. 'మా అమ్మ నుంచి విడిపోయాక మా అమ్మమ్మతో కలసి హైదరాబాద్‌నుంచి మనాలి వెళ్లిపోయాం. అక్కడ రెండు పెంపుడు కుక్కలు, చేపలు నా ప్రపంచం. మా పూర్వీకులు అంతా చదువుకున్నవాళ్లే. అమ్మమ్మ దగ్గర ప్రపంచం అర్థమైంది. పుస్తకాల నుంచి ఉర్దూ కవిత్వం వరకూ చదివా. 1975-76 ప్రాంతంలో చిన్నప్పుడు అమ్మమ్మతో, కజిన్స్‌తో కలసి సాయంత్రాల్లో సినిమా చూడటం, వీధి చివర దోశలు తినటం బాగా గుర్తు. మా అమ్మమ్మతో సంభాషించేప్పుడు సినిమాల కంటే ఉర్దూ కవిత్వమే డామినేట్ చేసేది' అంటుంది టబు.

అలా ఇండస్ట్రీలోకి..

స్కూలింగ్ చదివేప్పుడే 'బజార్' అనే చిత్రంలో నటించింది. ఆ తర్వాత దేవానంద్ కూతురిగా పద్నాలుగేళ్ల వయసులో ఓ సినిమా చేసింది. అయితే కథానాయికగా ఆమె తొలి చిత్రం 'కూలి నంబర్ 1' (తెలుగు) కావటం విశేషం. 'జీత్' తర్వాత .. 1996 సంవత్సరంలో వచ్చిన 'కాదల్ దేశం' (ప్రేమదేశం) చిత్రంతో ఆమె దక్షిణాదిలో పాపులర్ అయింది. అదే ఏడాది 'మచ్చిస్' చిత్రంతో నటిగా జాతీయ అవార్డు దక్కించుకుంది. 'ఇరువర్', 'చాచి 420', 'బివి నంబర్ వన్' 'హమ్ సాత్ సాత్ హే', 'చాందినీ బార్', 'మక్బూల్', 'మీనాక్షి- ఎ టేల్ ఆఫ్ త్రీ సిటీస్', 'లైఫ్ ఆఫ్ పై', 'హైదర్', 'దృశ్యం', 'అంధాధూన్'.. ఇటీవల వచ్చి 'క్రూ' చిత్రం వరకూ టబు పాత్రలు గుర్తుండిపోయేవే. అందుకే ఆమె నటనకు జాతీయస్థాయిలో క్రేజ్ ఉంది.

భిన్నంగా ఉంటా...

'కొత్త పాత్రలు వస్తే వదులుకోను. రొటీన్‌కు భిన్నంగా ఆలోచించాలి. చిన్నప్పటి నుంచీ ఇదే తీరు. 'మక్బూల్', 'చాందినీ బార్', 'హైదర్' లాంటివి అలాంటివే. ఫలానా దర్శకుడు మంచి కథనంతో వచ్చి 'మీరైతే సరిపోతారు ఈ పాత్రకు' అంటుంటారు. ఇది నిజంగా గొప్ప విషయం అనిపిస్తుంది. నాకోసమే పాత్రలు రాసే రచయితలున్నారు. ఇప్పటి వరకూ 92 చిత్రాల దాకా నటించా. అన్ని చిత్రాల స్క్రిప్టును చదివా. 1990ల్లో రోజుకు మూడు షిఫ్టుల్లో పని చేసిన సందర్భాలెన్నో. ఏడాదికి పన్నెండు చిత్రాలు విడుదలయ్యేవి. ఇప్పుడు అలా కాదు.. ఏడాదికి రెండు చిత్రాల్లో నటిస్తే గొప్ప విషయం. కాలం మారిందిలా. మెయిన్ స్ట్రీమ్ ప్రేక్షకులు మారిపోయారు. కొత్త కాన్సెప్టులు ఉంటేనే చూస్తున్నారు. ఇచ్చిన పాత్రలో ప్రేక్షకులను ఎలా మెప్పించామన్నదే యాక్టర్‌కు ఉన్న సవాల్. "





అలనాటి కథ

ఓ రాజకుమారి విషాద గాథ

కొన్ని అందమైన కథలు చివరికి విషాదాంతాలుగా మిగులుతాయి. అలాంటి ఒక అందమైన కథ... ప్రిన్సెస్ నిలోఫర్‌ది. ప్రిన్స్ మొజంజాని వివాహం చేసుకొని టర్కీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన నిలోఫర్ తన చివరి దశలో పారిస్‌లో స్థిరపడ్డారు.



ఇప్పటి తరం వారిని 'నిలోఫర్ ఆసుపత్రికి.. మొజంజాహీ మార్కెట్‌కు సంబంధం ఏమిటి?' అని అడిగితే వెంటనే సమాధానం చెప్పలేకపోవచ్చు. నిలోఫర్ ఆసుపత్రిని కట్టించింది ప్రిన్సెస్ నిలోఫర్. మొజాంజాహీ మార్కెట్ ఉన్న ప్రాంతంలోనే ప్రిన్స్ మొజంజా బహదూర్ పేరిట వెలిసింది. ఒకప్పుడు వీరిద్దరూ హైదరాబాద్ హైసొసైటీలో 'పవర్ కపుల్' అని చెప్పవచ్చు. వీరితో నాకు మంచి అనుబంధం ఉంది.

ప్రిన్సెస్ నిలోఫర్ తండ్రి సుల్తాన్ దామాద్ మోర్లిజేడ్ షహలుద్దీన్ ఆలీ బే... టర్కీ ఆఖరి సుల్తాన్. ఆ సమయంలో నిజాం వంశీకులతో సంబంధాలు పెట్టుకోవాలనే ఉద్దేశంతో ఆమెను మొజంజా బహదూర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరిద్దరూ హిల్‌ఫోర్ట్ ప్యాలెస్‌లో నివసించేవారు. ఆ సమయంలోనే ఆమె అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. వాటిలో నిలోఫర్ ఆసుపత్రి కూడా ఒకటి. ప్రిన్స్ మొజంజా బహదూర్, ప్రిన్సెస్ నిలోఫర్ మా ఇంటికి తరచూ వస్తూ ఉండేవారు. వారికి నాన్న ధన్‌రాజ్‌గిర్ అతిథ్యం ఇస్తూ ఉండేవారు. ఇక్కడ మొజంజా బహదూర్ గురించి కొంత చెప్పాలి. ఆయన సహజంగా కవి. తాను రాసిన కవితలను పాడించి వినటం ఆయనకు ఒక సరదా. అదే విధంగా ఆయన అనేక నాటకాలు కూడా రాశారు. ఆ నాటకాలను జ్ఞాన్‌బాగ్ పాలెస్‌లో ఉన్న జూనో, హెర్క్యులిస్ విగ్రహాల వద్ద రాత్రిళ్లు ప్రదర్శించేవారు. ఆ సమయంలో ప్రత్యేక లైటింగ్స్ పెట్టేవారు. ప్యాలెస్ అంతా కళకళలాడుతూ ఉండేది. ఆయన నాతో చాలా ప్రేమగా ఉండేవారు. అప్పుడప్పుడు నాకు ఒకటి రెండు కాదు.. పదేసి పెర్ఫ్యూమ్ బాటిల్స్ ఇచ్చేవారు. ఒకసారి నేపాల్ రాజవంశం వారు ఆయనకు బహూకరించిన బంగారు పూత పూసిన డిన్నర్ ప్లేట్ సెట్ కూడా బహుమతిగా



ప్రిన్సెస్ నిలోఫర్, మొజంజా

ఇచ్చారు. సాధారణంగా మేమందరం మ్యూజిక్ రూమ్‌లో కలిసేవాళ్లం. ఒకసారి నాన్న ముంబయిలోని ధన్‌రాజ్ మహల్‌లో ఒక పార్టీ ఇచ్చారు. దీనికి నిలోఫర్‌తో కలిసి ఆయన బొంబాయి వచ్చారు. అప్పుడు మా ఇంట్లోనే వారు మా ప్యాలెస్ టాప్ ఫ్లోర్‌లో ఉండేవారు. నిలోఫర్ మా అందరితోనూ కలివిడిగా ఉండేది.

సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడ బొంబాయి పార్టీ సీను గురించి కూడా చెప్పాలి. హైదరాబాద్ పార్టీలలో ఆల్కాహాల్ ఇచ్చేవారు కాదు. టీ, ఇతర తినుబండారాలతో సరిపెట్టుకొనేవారు. కానీ బొంబాయిలో పార్టీ అంటే షాంపైన్ ఇవ్వాల్సిందే. ఆ రోజు మా నాన్నగారు ఇచ్చిన పార్టీకి అనేక మంది రాజకుటుంబీకులు వచ్చిన జ్ఞాపకం. టాటాలు, విస్త్రీలు, బరోడా మహరాజు, గ్వాలియర్ మహరాజులతో పాటుగా అనేక మంది రాజకుటుంబీకులు వచ్చేవారు. ఆ పార్టీలో నిలోఫర్ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిలోఫర్, మొజంజా బహదూర్ రెడ్ కార్పెట్‌మీద నడిచి వస్తుంటే అందరూ చప్పట్లు కొట్టిన జ్ఞాపకం. ఇంకో విషయమేవిటంటే... హైదరాబాద్ పార్టీలలో లైవ్ బ్యాండ్ ఉండేది కాదు. కానీ బొంబాయిలో ఉండాల్సిందే. పార్టీకి వచ్చినవారందరూ డ్యాన్స్ చేయాల్సిందే. మా పార్టీలో నిలోఫర్ కూడా డ్యాన్స్ చేసిన జ్ఞాపకం ఉంది. పార్టీలకు వచ్చినప్పుడు నిలోఫర్ ఎంత ఉత్సాహంగా ఉండేవారో... సామాజిక సేవా కార్యక్రమాలు చేసే విషయంలోనూ అంతే ఉత్సాహంగా ఉండేవారు. ఒకసారి హైదరాబాద్‌లో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఆ సభలో నిలోఫర్- ప్రాథమిక విద్య అందించే బాధ్యత ప్రభుత్వానిదే ఎలా అవుతుందనే విషయంపై చేసిన ప్రసంగం ఇంకా నాకు గుర్తుంది. ఈ మధ్య పుస్తకాలు తిరగేస్తుంటే ఆమె ప్రసంగం దొరికింది. "మన జీవితాలకు వెలుగునిచ్చేవి పల్లెటూర్లు. దురదృష్టమేమిటంటే వాటిని మనం చిన్నచూపు చూస్తున్నాం. ఇలాంటి పల్లెటూర్లను అభివృద్ధి చేయాలంటే ధనం అవసరం. కానీ మన దగ్గర అంత డబ్బు లేదు కానీ మంచి ఆలోచనలున్న మనుషులు ఉన్నారు. వారికి మంచి విలువలు నేర్పితే వారే పల్లెటూళ్లను అభివృద్ధి చేస్తారు. డబ్బు కన్నా ఆలోచన ముఖ్యం. మంచి చెడుల మధ్య వ్యత్యాసం తెలుసుకోవటమే అసలైన విద్య" అని ఆమె చేసిన ప్రసంగం అందరినీ ఆశ్చర్యచకితులు చేసింది. సభ అయిన తర్వాత కూడా అనేకమంది ఆమె ప్రసంగం గురించే మాట్లాడుకున్నారు.

బొంబాయి ధన్‌రాజ్ మహల్‌కు అనేక ప్రత్యేకతలుండేవి. నాన్న అక్కడ ఉంటే పార్టీలు జరగాల్సిందే. ప్రతి పార్టీకి కనీసం రెండు వందల మంది దాకా అతిథులు వచ్చేవారు. కొన్ని సార్లు బాలేలు.. కొన్ని సార్లు కేబరేలు.. ఇలా రకరకాల థీమ్‌లు ఉండేవి. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ధన్‌రాజ్ మహల్‌ను భారతీయ నేవీ నెలకు 5 రూపాయల అద్దెకు తీసుకొంది. ఆ సమయంలోనే మేము బొంబాయి వదిలేసి హైదరాబాద్ వచ్చేశాం. ఆ తర్వాత కాలంలో నేను ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ మహల్‌ను మా కుటుంబ ఆధీనంలోకి వచ్చేలా చేశాను.

నిలోఫర్ కొద్ది కాలం హైదరాబాద్‌లో నివసించారు. ఆ తర్వాత ముంబయికి, అక్కడి నుంచి ప్యారిస్‌కు వెళ్లిపోయారు. చాలా కాలం ఆమె దగ్గర నుంచి ఎలాంటి సమాచారం లేదు. కొద్ది కాలం తర్వాత ఆమె ఫ్రెంచ్ దేశస్థుడిని పెళ్లి చేసుకున్నట్లు విన్నాను. ఒకసారి నేను ప్యారిస్ వెళ్లినప్పుడు- ఆమె నెంబర్ సంపాదించి ఫోన్ చేశా. ఇంటికి వచ్చి కలుస్తానన్నా. ఆమె నన్ను కలవటానికి ఇష్టపడలేదు. "నేను గతంలో ఎలా ఉండేదాన్నో.. అలాగే ఉన్నాననుకో.. అలాగే ఊహించుకో" అని ఫోను పెట్టేసింది. ఆ తర్వాత నాకు ఎవరో.. ఆమెకు మొహం కండరాల క్యాన్సర్ వచ్చిందని.. చాలా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని చెప్పారు. ఒకప్పటి అందాల యువరాణి నిలోఫర్‌కు.. ప్యారిస్‌లో క్యాన్సర్‌తో బాధ పడుతున్న నిలోఫర్‌కు సంబంధం లేదన్నారు. నా మనస్సు బాధతో నిండిపోయింది. ఆ తర్వాత కొద్ది కాలానికి ఆమె అక్కడ దీనస్థితిలో మరణించారు. నిలోఫర్‌ను తలుచుకున్నప్పుడల్లా ముంబాయి ధన్‌రాజ్ మహల్‌లో పార్టీలోకి ప్రవేశిస్తున్న యువరాణే గుర్తుకొస్తుంది. చాలా మందికి నిలోఫర్ చివరి రోజుల గురించి తెలియదు. రాజకుటుంబీకుల జీవితాలు పూలపాన్పులే అనుకుంటున్నారు. కానీ చాలా మంది జీవితాల్లో విషాదం ఉంటుందనే విషయం గమనించరు.

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

‘మనూ’లో కోర్సులు

దిక్సూచి

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)- రెగ్యులర్ మోడ్‌లో అందిస్తున్న పలు అకడమిక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా...

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు: ఉర్దూ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, దక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ ఉర్దూ కల్చర్ స్టడీస్, కంపారిటివ్ స్టడీస్, లా, సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్‌క్లూజన్ పాలసీ, లాంగ్వేజ్ టీచింగ్ ఇన్ మదర్సా.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్), ఎంఈడీ, మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం)

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీటెక్(కంప్యూటర్ సైన్స్), బీటెక్-కంప్యూటర్ సైన్స్(లేటరల్ ఎంట్రీ), ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీఈడీ.

ప్రొఫెషనల్ డిప్లొమాలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), పాలిటెక్నిక్ డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, అప్పారెల్ టెక్నాలజీస్), పాలిటెక్నిక్ డిప్లొమా లేటరల్ ఎంట్రీ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

అకడమిక్ మెరిట్ ద్వారా...

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ(ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, అరబిక్, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంఎస్‌డబ్ల్యు(సోషల్ వర్క్), ఎంఏ జేఎంసీ(లేటరల్ ఎంట్రీ), ఎంకాం, ఎమ్మెస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), ఎం ఒకేషనల్(ఎంఎల్‌టీ, ఎంఐటీ), ఎంసీఏ(లేటరల్ ఎంట్రీ)

ఇవి కాకుండా ఫుల్‌టైమ్ పార్ట్ టైమ్ కోర్సులు మరికొన్ని కూడా ఉన్నాయి.

పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమాలు: హైదరాబాద్ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లు అందిస్తోంది.

(ఇవి కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లోని క్యాంపస్‌ల్లో ఉన్న కోర్సులు - అర్హతలు తదితరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.)

‘దిక్సూచి’ వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/i2PKLBDలో చదవండి.

చిత్ర పరిశ్రమకు, అభిమానులకు అంకితం

- రామ్‌చరణ్



హీరో రామ్‌చరణ్ ‘గౌరవ డాక్టరేట్’ అందుకున్నారు. సినీ, సామాజిక సేవా రంగాల్లో ఆయన చేసిన సేవలకు గాను చెన్నైలోని ప్రముఖ ‘వేల్స్ యూనివర్శిటీ’ ఆయనకు శనివారం సాయంత్రం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత సాంకేతిక విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, యూనివర్శిటీ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డాక్టర్ ఐసరి గణేశ్ చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ... ‘నా పై ఇంత అభిమానంతో గౌరవ డాక్టరేట్ బహూకరించిన వేల్స్ వర్శిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు. 38 ఏళ్లగా నడుస్తున్న యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వస్తోందంటే ముందు మా అమ్మే నమ్మలేదు. ఆర్మీలాంటి గ్రాడ్యుయేషన్స్ మధ్య నేను ఇలా ఉండడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది నా తల్లిదండ్రులకు, అభిమానులకు, దర్శకులకు, నిర్మాతలకు, తోటి నటీనటులకు అంకితమిస్తున్నా.’ అన్నారు. తాను చెన్నైలోని విజయా హాస్పిటల్లోనే జన్మించానని, పద్మశేషాద్రి స్కూల్లో చదివానన్నారు. ఈ ప్రాంతం తనకెంతో ఇచ్చిందన్నారు. తన తండ్రి చిరంజీవి జీవన ప్రయాణం కూడా ఇక్కడి నుంచే ప్రారంభించారన్నారు. తన సతీమణి ఉపాసన కుటుంబం అపోలో హాస్పిటల్స్‌ను కూడా ఇక్కడి నుంచే ప్రారంభించిందన్నారు. 80 శాతం తెలుగు సినిమాలు ఇక్కడే రూపొందేవని, తెలుగు సినీ పరిశ్రమకు ఇది పుట్టిల్లులాంటిదన్నారు. ఏదైనా సాధించాలని కలలు కని, చెన్నైకి వస్తే అది తప్పకుండా నెరవేరుతుందని వ్యాఖ్యానించారు. అది ఈ ప్రాంతం గొప్పతనమన్నారు. అన్ని రంగాల వారికి ఈ భూమి కలలు నెరవేర్చేదన్నారు. తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తను నటిస్తున్న ‘గేమ్ చేంజర్’ మూవీ సెప్టెంబర్-అక్టోబరు నెలల్లో విడుదలయ్యే అవకాశముందని రామ్‌చరణ్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి, చెన్నై.

జీరో బడ్జెట్‌తో శరపంజరం



గంగిరెద్దుల అబ్బాయితో జోగిని ప్రేమలో పడితే ఎటువంటి పరిణామాలు సంభవించాయన్న ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న ‘శరపంజరం’ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. నవీన్‌కుమార్ గట్టు, లయ జంటగా నటించారు.ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నవీన్‌కుమార్ మాట్లాడుతూ ‘ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాను. ఎంతో మంది మిత్రులు నాకు అండగా నిలిచారు. జీరో బడ్జెట్‌తో కేవలం స్నేహితుల సహకారంతో ప్రారంభించిన ఈ యజ్ఞం పూర్తి చేసి విడుదల వరకూ వచ్చాం. గణపతిరెడ్డి మాకు ఎంతో సహకరించారు.’ అని చెప్పారు. సంగీత దర్శకుడు మల్లిక్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందనీ, ఆకలితో ఉన్న వాడికి అన్నం పెడితే జీవితాంతం గుర్తుంచుకుంటాడని, ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలనీ గణపతిరెడ్డి అన్నారు.

వినోదం పంచే కొంచెం హట్కే



గురుచరణ్, కృష్ణ మంజూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కొంచెం హట్కే’. అవినాశ్ కుమార్ దర్శకత్వంలో అభిమాన థియేటర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ‘ఇందులో హీరో హీరోయిన్లు ఉండరు. పాత్రలే ఉంటాయి. సినిమా వినోదాత్మకంగా ఉంటుంది’ అన్నారు. కొంతమంది కలసి సినిమా తీయడానికి చేసే ప్రయత్నాలు వినోదం పంచుతాయని గురుచరణ్ తెలిపారు.

గొప్ప కంటెంట్‌తో టెనెంట్

సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ‘టెనెంట్’. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించారు. ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. నటుడు ప్రియదర్శి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యం రాజేశ్ మాట్లాడుతూ ‘డబ్బింగ్ చెబుతున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి. ఇందులో గొప్ప కంటెంట్ ఉంది. ప్రేక్షకులు ప్రతి క్షణం ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది’ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ‘మహిళలకు కనెక్ట్ అయ్యే



కథ ఇది. మా నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే చిత్రమవుతుంద’న్నారు. నిర్మాత మాట్లాడుతూ “బలగం, కాంతార’ లాంటి సహజత్వం ఉన్న కథతో తెరకెక్కిన సినిమా ‘టెనెంట్’. ఈ చిత్రంలో భావోద్వేగాలు అద్భుతంగా పండాయి’ అని చెప్పారు.

మేకప్ మాన్‌కు క్లాప్



దివంగత నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం మేనల్లుడు శ్రీకాంత్ అవుటూరి హీరోగా పరిచయం అవుతున్న చిత్రం ‘మేకప్ మ్యాన్’. దివాకర్ యడ్ల దర్శకత్వం వహిస్తున్నారు. కుమార్ మెట్టుపల్లి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు రవి కుమార్ చౌదరి క్లాప్ కొట్టగా, లయన్ సాయి వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. భరత్ పారేపల్లి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ప్రతి చిత్రానికి కీలకమైన మేకప్ మ్యాన్‌ల పాత్రను, వారి జీవితాన్ని ఇందులో చూపించనున్నామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో కట్టా రంజిత్, ఆనంద్ భారతి, చిట్టిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ, ఎడిటర్: వాసు వర్మ, సంగీతం: ఎం ఎం శ్రీలేఖ.

నవ్య ‘దృశ్యం’లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zvr6wiU లో చదవండి.

స్పోర్ట్స్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
319 పరుగులు	11 వికెట్లు

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా X లఖ్‌నవూ	మ.3.30 గం. నుంచి
ముంబై X చెన్నై	రాత్రి 7.30 గం. నుంచి

గట్టెక్కిన రాజస్థాన్



హెట్‌మయెర్ (10 బంతుల్లో 27 నాటౌట్)

ఆఖరి ఓవర్‌లో విజయం

హెట్‌మయెర్ మెరుపులు ● పోరాడిన పంజాబ్ బౌలర్లు

ముల్లాపూర్ (చండీగఢ్): లో స్కోర్ థ్రిల్లర్‌లో రాజస్థాన్ రాయల్స్ ఒత్తిడిని జయించింది. అయితే కేవలం తమ 147 పరుగుల స్కోరును కాపాడుకోవడంలో అటు పంజాబ్ బౌలర్లు సైతం పట్టువదలకుండా పోరాడారు. దీంతో ఆఖరి ఓవర్ వరకు ఇరువైపులా మ్యాచ్ చేతులు మారుతూ వచ్చింది. కానీ హెట్‌మయెర్ (10 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 27 నాటౌట్) హిట్టింగ్ మరో బంతి ఉండగా ఆర్ఆర్‌ను గట్టెక్కించింది. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాయల్స్ 3 వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే పాయింట్ల పట్టికలో 10 పాయింట్లతో తమ అగ్రస్థానాన్ని మరింత పదిలపర్చుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 147 పరుగులు చేసింది. అశుతోష్ (16 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 31), జితేశ్ (29) మాత్రమే రాణించారు. కేశవ్, అవేశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 19.5 ఓవర్లలో 7 వికెట్లకు 152 పరుగులు చేసి నెగ్గింది. జైస్వాల్ (39), తనుష్ (24) ఫర్వాలేదనిపించారు. రబాడ, కర్రాన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా హెట్‌మయెర్ నిలిచాడు.

ఒత్తిడికి లోనైనా..: స్వల్ప ఛేదనే అయినా స్లో వికెట్‌పై రాజస్థాన్ కూడా తడబడింది. ఆరంభంలో ఇన్నింగ్స్ నిదానంగా సాగడంతో పాటు వికెట్లను కోల్పోయి ఒత్తిడికి లోనైంది. ఇక ఓటమి ఖాయమే అనిపించినా.. ఆఖర్లో హెట్‌మయెర్ బాదుడు జట్టును ఆదుకుంది. ఐపీఎల్ అరంగేట్రం చేసిన తనుష్. జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. అయితే, ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 56 పరుగులు జత చేసినా వేగం లోపించింది. అడపాదడపా ఫోర్లతో పవర్‌ప్లేలో జట్టు 43 పరుగులు చేసింది. బంతులు ఎక్కువగా వృథా చేసిన తనుష్‌ను తొమ్మిదో ఓవర్‌లో లివింగ్‌స్టోన్ అవుట్ చేశాడు. అటు శాంసన్ (18) 6,4తో 13 పరుగులు వచ్చాయి. అయితే తొలిసారి ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేసిన జైస్వాల్‌ను, శాంసన్‌ను వరుస ఓవర్లలో రబాడ అవుట్ చేయడం ఆర్ఆర్‌ను ఇబ్బందుల్లోకి నెట్టింది. దీనికి తోడు ఫామ్‌లో ఉన్న పరాగ్ (23), ధ్రువ్ జురెల్ (6) కూడా వెంటవెంటనే అవుట్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. 16 బంతుల్లో 33 పరుగులు కావాల్సిన వేళ మ్యాచ్ ఇరువైపులా మొగ్గు చూపింది. కానీ హెట్‌మయెర్ 18వ ఓవర్‌లో 4,6.. తర్వాతి ఓవర్‌లో పోవెల్ (11) రెండు ఫోర్లతో పంజాబ్‌లో గుబులు రేపారు. అదే ఓవర్‌లో పోవెల్, కేశవ్ (1)లను సామ్ కర్రాన్ అవుట్ చేసి ఆర్ఆర్‌లో ఆందోళన రేపాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 10 రన్స్ కావాల్సిన వేళ.. అర్ష్‌దీప్ రెండు డాట్ బాల్స్ వేసినా హెట్‌మయెర్ ఆ తర్వాత 6,2,6తో రాజస్థాన్‌ను సంబరాల్లో ముంచాడు.

బౌలర్లదే జోరు: తొలి పది ఓవర్లలో 53/4. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ స్కోరిది. రాజస్థాన్ బౌలర్లు అదరగొట్టడంతో పరుగులు రాకపోగా, వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో పడింది. చివరి ఓవర్లలో అశుతోష్ ధాటికి కాస్త పరువు దక్కించుకుంది. కెప్టెన్ ధవన్ గాయంతో బరిలోకి దిగకపోగా.. బెయిర్‌స్టో (15)కు జతగా అథర్వ (15) బరిలోకి దిగాడు. అయితే నాలుగో ఓవర్‌లోనే అతడిని పేసర్ అవేశ్ వెనక్కి పంపాడు. ఇక వరుస ఓవర్లలో ప్రభ్‌సిమ్రన్ (10)ను చాహల్, బెయిర్‌స్టోను కేశవ్ అవుట్ చేయడంతో పంజాబ్ పతనం మొదలైంది. ఈ మ్యాచ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన సామ్ కర్రాన్ (6)ను పదో ఓవర్‌లో కేశవ్ అవుట్ చేశాడు. ఇదే ఓవర్‌లో శశాంక్ (9) ఎల్బీ కావాల్సి ఉన్నా అంపైర్ కాల్‌తో గట్టెక్కాడు. ఐదు ఓవర్లపాటు కనీసం ఫోర్ కూడా రాకపోగా 12వ ఓవర్‌లో జితేశ్, శశాంక్‌ల ఒక్కో ఫోర్‌తో 12 రన్స్ వచ్చాయి కానీ తర్వాతి ఓవర్‌లోనే శశాంక్‌ను పేసర్ కుల్దీప్ అవుట్ చేయగా, మరుసటి బంతికే లివింగ్‌స్టోన్ క్యాచ్‌ను కీపర్ శాంసన్ అందుకోలేకపోయాడు. పరుగులు మరింత కష్టంగా మారిన వేళ 15వ ఓవర్‌లో జితేశ్ తమ ఇన్నింగ్స్‌లో తొలి సిక్సర్‌ను బాదాడు. 16వ ఓవర్‌లోనూ జితేశ్ మరో సిక్సర్‌తో పాటు లివింగ్‌స్టోన్ 4,6తో 17 రన్స్ రాగా స్కోరు కూడా వంద దాటింది. ఇక పంజాబ్ ఆటలో వేగం పెరిగిందనుకునేలోపే అవేశ్ ఓవర్‌లో జితేశ్ పెవిలియన్‌కు చేరగా, లివింగ్‌స్టోన్ రనౌటయ్యాడు. అప్పటికి 18 ఓవర్లలో స్కోరు 122/7 మాత్రమే. ఈ స్థితిలో అషుతోశ్ 19వ ఓవర్‌లో ఇచ్చిన క్యాచ్‌ను శాంసన్, అవేశ్ ఢీకొని వదిలేశారు. ఆ తర్వాత రెండు సిక్సర్లతో అత్యధికంగా 18 రన్స్ రాబట్టాడు. అయితే ఆఖరి ఓవర్‌లో బౌల్ట్ ఆరు పరుగులే ఇచ్చి అశుతోష్ వికెట్ తీశాడు.



కేశవ్ మహరాజ్ (4-0-23-2)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	6	5	1	0	10	0.767
కోల్‌కతా	4	3	1	0	6	1.528
చెన్నై	5	3	2	0	6	0.666
లఖ్‌నవూ	5	3	2	0	6	0.436
హైదరాబాద్	5	3	2	0	6	0.344
గుజరాత్	6	3	3	0	6	-0.637
ముంబై	5	2	3	0	4	-0.073
పంజాబ్	6	2	4	0	4	-0.218
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	6	1	5	0	2	-1.124

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

పంజాబ్: అథర్వ (సి) కుల్దీప్ (బి) అవేశ్ 15, బెయిర్‌స్టో (సి) హెట్‌మయెర్ (బి) కేశవ్ 15, ప్రభ్‌సిమ్రన్ (సి) జురెల్ (బి) చాహల్ 10, కర్రాన్ (సి) జురెల్ (బి) కేశవ్ 6, జితేశ్ (సి) పరాగ్ (బి) అవేశ్ 29, శశాంక్ (సి) జురెల్ (బి) కుల్దీప్ 9, లివింగ్‌స్టోన్ (రనౌట్) 21, అశుతోష్ (సి) కేశవ్ (బి) బౌల్ట్ 31, హర్‌ప్రీత్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 147/8; వికెట్ల పతనం:** 1-27, 2-41, 3-47, 4-52, 5-70, 6-103, 7-122, 8-147; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-22-1, కుల్దీప్ సేన్ 4-0-35-1, అవేశ్ ఖాన్ 4-0-34-2, చాహల్ 4-0-31-1, కేశవ్ మహరాజ్ 4-0-23-2.

రాజస్థాన్: జైస్వాల్ (సి) హర్షల్ (బి) రబాడ 39, తనుష్ (బి) లివింగ్‌స్టోన్ 24, సంజూ శాంసన్ (ఎల్బీ) రబాడ 18, రియాన్ పరాగ్ (సి) రబాడ (బి) అర్ష్‌దీప్ 23, ధ్రువ్ జురెల్ (సి) శశాంక్ (బి) హర్షల్ 6, హెట్‌మయెర్ (నాటౌట్) 27, పావెల్ (సి) జితేశ్ (బి) కర్రాన్ 11, కేశవ్ (సి) లివింగ్‌స్టోన్ (బి) కర్రాన్ 1, బౌల్ట్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 19.5 ఓవర్లలో 152/7; వికెట్ల పతనం:** 1-56, 2-82, 3-89, 4-113, 5-115, 6-136, 7-138; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.5-0-45-1, రబాడ 4-0-18-2, కర్రాన్ 4-0-25-2, లివింగ్‌స్టోన్ 3-0-21-1, హర్షల్ 2-0-21-1, హర్‌ప్రీత్ బ్రార్ 3-0-22-0.

రజత రాధిక

శివానికి కాంస్యం ● ఆసియా రెజ్లింగ్



రాధిక

బిష్‌కెక్ (కిర్గిస్థాన్): ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ మహిళల తొలిరోజు పోటీల్లో భారత రెజ్లర్లు అదరగొట్టారు. ఒక రజతం, ఓ కాంస్య పతకంతో సత్తా చాటారు. శనివారం జరిగిన 68 కిలోల ఫైనల్లో రాధిక 2-15తో నొనొకా ఒజాకి చేతిలో ఓటమిపాలై రజత పతకం దక్కించుకుంది. అంతకుముందు తొలి బౌట్‌లో అల్బినా (కజకిస్థాన్)పై సాంకేతిక ఆధిపత్యంతో నెగ్గిన రాధిక..సెమీస్‌లో గుల్‌నూరా (కిర్గిస్థాన్)ను చిత్తు చేసింది. ఇక 50 కేజీల విభాగం కాంస్య పతక పోరులో శివాని 9-7తో మంగోలియాకు చెందిన డోల్గోజోవ్‌ను చిత్తుచేసింది.

పంత్‌పై ఓ మ్యాచ్ నిషేధం?



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌పై ఓ మ్యాచ్ సస్పెన్షన్ విధించే అవకాశం కనిపిస్తోంది. స్లో ఓవర్ రేట్ కారణంగా పంత్‌పై ఇప్పటికే రెండుసార్లు జరిమానా పడింది. గత నెల 31న చెన్నైతో మ్యాచ్‌లో, ఈ నెల 3న కోల్‌కతాతో మ్యాచ్‌లో సమయ నిబంధనను అతిక్రమించాడు. అయితే, శుక్రవారం లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో కూడా ఢిల్లీ నిర్ణీత సమయానికి వేయాల్సిన ఓవర్ల కంటే తక్కువే బౌల్ చేసింది. 16 ఓవర్ల వరకూ సమయపాలనలో క్యాపిటల్స్ వెనుకబడినా.. చివరి ఓవర్ బౌల్ చేసేలోపు ఆ ఆలస్యాన్ని భర్తీ చేసింది. అంతేకాకుండా అంపైర్‌తో పంత్ వాగ్వాదానికి కూడా దిగాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం మూడోసారి స్లో ఓవర్ రేట్‌కు పాల్పడితే ఆ టీమ్ కెప్టెన్‌పై రూ. 30 లక్షల జరిమానాతో పాటు ఓ మ్యాచ్ నిషేధం విధించే అవకాశం ఉంది. అయితే, పంత్ జరిమానా విషయమై ఐపీఎల్ నిర్వాహకుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.

6 బంతుల్లో.. సిక్సులు

నేపాల్ బ్యాటర్ దీపేంద్ర రికార్డు



అల్ అమీరత్ (ఖతార్): నేపాల్ బ్యాటర్ దీపేంద్ర సింగ్ ఐరీ ఒకే ఓవర్‌లో ఆరు వరుస సిక్సలతో దుమ్మురేపాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సలు బాదిన మూడో బ్యాటర్‌గా సింగ్ రికార్డులకెక్కాడు. ఏసీసీ ప్రీమియర్ కప్‌లో కతార్‌తో జరిగిన మ్యాచ్‌లో దీపేంద్ర ఈ అరుదైన ఫీట్‌ను నమోదు చేశాడు. 2007 టీ20 వరల్డ్‌కప్‌లో బ్రాడ్ బౌలింగ్‌లో యువరాజ్ సింగ్ ఒకే ఓవర్‌లో ఆరు సిక్సలు బాదగా.. 2021లో శ్రీలంకతో మ్యాచ్‌లో స్పిన్నర్ ధనంజయ బౌలింగ్‌లో వెస్టిండీస్ బ్యాటర్ కీరన్ పొలార్డ్ ఈ రికార్డును సాధించాడు. వన్డేల్లో గిబ్స్ (సౌతాఫ్రికా), జస్‌కరణ్ మల్హోత్రా (యూఎస్) కూడా ఈ ఫీట్‌ను నమోదు చేశారు. కాగా, దీపేంద్ర నిరుడు మంగోలియాతో జరిగిన టీ20 మ్యాచ్‌లో 9బంతుల్లోనే అర్ధసెంచరీ బాది రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే.

హుసాముద్దీన్‌పై వేటు

- బాక్సింగ్ జట్టులో మళ్లీ అమిత్
- ఒలిపింక్ క్వాలిఫయింగ్ టోర్నీ

న్యూఢిల్లీ: వరల్డ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత అమిత్ పంగల్ భారత బాక్సింగ్ జట్టులో పునరాగమనం చేశాడు. బ్యాంకాక్‌లో వచ్చేనెల 25 నుంచి జరిగే ఒలింపిక్స్ ఆఖరి క్వాలిఫయింగ్ టోర్నీకి శనివారం ప్రకటించిన జట్టులో అతడు చోటు దక్కించుకున్నాడు. గత నెలలో ఇటలీలో జరిగిన క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో మన బాక్సర్లు ఘోరంగా విఫలమై ఒక్కరూ విశ్వ క్రీడల బెర్త్ సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో..బ్యాంకాక్‌లో జరిగే పోటీలకు జట్టులో సమూల మార్పులు చేశారు. తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ (57కి.), దీపక్ భోరియా (51కి.), శివ థాపా (63.5కి.) లక్ష్యా చాహర్ (80కి.), జాస్మిన్ లంబోరియా (60కి.) సహా ఇటలీ టోర్నీలో తలపడిన ఐదుగురు బాక్సర్లపై వేటు వేశారు.



క్రీడారంగ సలహాదారుడిగా నియమితులైన మాజీ ఎంపీ జితేందర్ రెడ్డిని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాలచారి, కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ శనివారం ఘనంగా సన్మానించారు.

హాకీలో ఐదోదీ పాయె

పెర్త్: ఆస్ట్రేలియాతో హాకీ టెస్టు సిరీస్‌లో భారత పురుషుల జట్టు పూర్తిగా విఫలమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన ఆఖరి పోరులోనూ పరాజయం పాలైంది. భారత్ 2-3తో ఆతిథ్య ఆసీస్ చేతిలో కంగుతింది. ఫలితంగా ఈ సిరీస్‌ను ఆసీస్ 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

టెన్నిస్‌లో అమ్మాయిలకు నిరాశ

చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత టెన్నిస్ అమ్మాయిల జట్టుకు నిరాశ ఎదురైంది. ఆసియా/ఓసియానియా గ్రూప్-1లో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 1-2తో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. ఫలితంగా ఆరు జట్లు తలపడే ఈ గ్రూప్-1 పోరులో భారత్ మూడోస్థానంతో సరిపెట్టుకుంది. దీంతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైన భారత జట్టు మళ్లీ గ్రూప్-1కే పరిమితమైంది. కివీస్‌తో పోరులో తొలి సింగిల్స్‌లో రుతుజా ప్రత్యర్థిని ఓడించి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించినా, ఆ తర్వాత రెండో సింగిల్స్‌లో అంకితా రైనా ఓటమిపాలైంది. అనంతరం జరిగిన డబుల్స్ పోరులోనూ అంకిత-ప్రార్థన జోడీ ఓడడంతో భారత్‌కు నిరాశ తప్పలేదు.

బిజినెస్

మార్కెట్లోకి హెచ్‌పీ ఏఐ ఆధారిత ల్యాప్‌ట్యాప్స్



హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి హెచ్‌పీ ఇండియా ఏఐ ఆధారిత ల్యాప్‌టాప్స్‌ను విడుదల చేసింది. గేమర్స్, క్రియేటర్స్ కోసం ఈ ల్యాప్‌ట్యాప్స్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు సంస్థ హెడ్ (కన్స్యూమర్, గేమింగ్ పీసీ) టీ గణేశ్ వెల్లడించారు. ఒమెన్ ట్రాన్సెండ్ 14, హెచ్‌పీ ఎన్వీ ఎక్స్360 14 పేరుతో వీటిని తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ఇందులో ఒమెన్ ట్రాన్సెండ్ 14ను ఎన్‌విడియా జీఈ ఫోర్స్ ఆర్‌టీఎక్స్ 4060 గ్రాఫిక్స్‌తో రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా హెచ్‌పీ తీసుకువచ్చిన అతి తేలికైన గేమింగ్ ల్యాప్‌ట్యాప్ ఇదని గణేశ్ తెలిపారు. కాగా మైక్రోసాఫ్ట్ కోపైలట్ బటన్‌తో ఎన్వీ ఎక్స్ 360 ల్యాప్‌ట్యాప్స్‌ను రూపొందించామన్నారు. ఇంటెల్ కోర్ అల్ట్రా ప్రాసెసర్స్‌తో కూడిన ఈ ల్యాప్‌ట్యాప్స్ హై-ఎండ్ గేమింగ్, క్రియేషన్‌కు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఇందులో హెచ్‌పీ ఒమెన్ ట్రాన్సెండ్ ధర రూ.1,74,999గా ఉండగా హెచ్‌పీ ఎన్‌వీ 360 ధర రూ.99,999గా ఉన్నాయి.

దేశీయ రియల్టీ రంగంలో 55% తగ్గిన సంస్థాగత పెట్టుబడులు



- జనవరి- మార్చి త్రైమాసికంలో 55.2 కోట్ల డాలర్లకు పరిమితం
- విదేశీ సంస్థాగత పెట్టుబడుల్లో 99% క్షీణత

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికంలో దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలోకి సంస్థాగత పెట్టుబడులు వార్షిక ప్రాతిపదికన 55 శాతం తగ్గి 55.2 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. అందులో విదేశీ సంస్థాగత పెట్టుబడులు 99 శాతం క్షీణించి 1.1 కోట్ల డాలర్లకు పడిపోగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు మాత్రం 21 శాతం పెరుగుదలతో 54.1 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టింగ్ సేవల సంస్థ వెస్టియన్ తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది తొలి త్రైమాసికంలో ఈ రంగంలోకి దేశీయ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల మొత్తం పెట్టుబడులు 123 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు కొత్త పెట్టుబడుల విషయంలో అప్రమత్త ధోరణితో వ్యవహరించారని వెస్టియన్ సీఈఓ శ్రీనివాస్ రావు అన్నారు.

దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రం భారత ఆర్థికాభివృద్ధి అవకాశాలపై అత్యంత ఆశావహంగా ఉన్నారని, స్థిరాస్తి రంగంలో పెట్టుబడులను కొనసాగించారన్నారు. గడిచిన మూడు నెలలకు నమోదైన సంస్థాగత పెట్టుబడుల్లో అత్యధికంగా 23.16 కోట్ల డాలర్లు కమర్షియల్ రియల్ ఎస్టేట్ (ఆఫీస్, రిటైల్, కో-వర్కింగ్, హాస్పిటాలిటీ ప్రాజెక్టులు)లోకి వచ్చాయని వెస్టియన్ రిపోర్టు వెల్లడించింది. కాగా, రెసిడెన్షియల్ ప్రాజెక్టుల్లోకి 22.5 కోట్ల డాలర్ల పెట్టుబడులొచ్చాయి. పారిశ్రామిక, గిడ్డంగుల రంగంలోకి పెట్టుబడులు వార్షిక ప్రాతిపదికన 73 శాతం తగ్గి 5.89 కోట్ల డాలర్లకు పడిపోయాయి.

నగరాలవారీగా చూస్తే, బెంగళూరు అత్యధికంగా 29.9 కోట్ల డాలర్ల సంస్థాగత ఇన్వెస్ట్‌మెంట్లను ఆకర్షించింది. 11 కోట్ల డాలర్ల పెట్టుబడులతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మార్కెట్ ఆ తర్వాత స్థానంలో నిలిచింది. మొత్తం సంస్థాగత పెట్టుబడుల్లో 74 శాతం ఈ రెండు నగరాల్లోకే తరలిరావడం గమనార్హం. కాగా, ఎడెల్‌వీజ్ క్యాపిటల్ అత్యధికంగా 30 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్లు నివేదిక తెలిపింది. దేశ ఆర్థిక మూలాలు మరింత బలపడటంతో పాటు గిరాకీ పుంజుకున్న నేపథ్యంలో మున్ముందు నెలల్లో ఈ రంగంలోకి సంస్థాగత పెట్టుబడులు మళ్లీ జోరందుకోవచ్చని శ్రీనివాస్ రావు అభిప్రాయపడ్డారు.

పసిడి పరుగు ఎందాకా..?

ఇప్పటికే 2,400 డాలర్లకు ఔన్స్ గోల్డ్

- ఏడాది చివరినాటికి 3,000 డాలర్లకు చేరే చాన్స్
- బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా



కళ తప్పిన నగ

బంగారం ధరలు శరవేగంగా పెరగడంతో ఆభరణాల కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయని కోల్‌కతాకు చెందిన సెన్‌కో గోల్డ్ అంటోంది. గడిచిన నెల రోజుల్లో తులం బంగారం ధర 10 శాతం పెరిగింది. 6 నెలల్లో 25-30 శాతం వరకు పెరిగింది. దాంతో ఆభరణాల విక్రయాలు ఇండస్ట్రీ పరంగా 15-20 శాతం వరకు తగ్గాయని సెన్‌కో గోల్డ్ ఎండీ, సీఈఓ సువెంకర్ సేన్ అన్నారు. ధరల పెరుగుదలతో పాటు లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వెంట తీసుకెళ్లగలిగే నగదుపై పరిమితులు కూడా నగల అమ్మకాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు.

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు కొండెక్కుతున్నాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా వీటి ధరలు సరికొత్త రికార్డు స్థాయిలకు పెరిగాయి. దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం రూ.73,000 స్థాయిని దాటగా.. కిలో వెండి రూ.90,000కు చేరుకుంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ క్రితం సెషన్‌లో 2,400 డాలర్లకు ఎగబాకింది. ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పాటు సెంట్రల్ బ్యాంకులు బంగారం నిల్వలను గణనీయంగా పెంచుకోవడం వంటి అంశాలు ధరల ర్యాలీకి ప్రధాన కారణం. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే వచ్చే ఏడాది నాటికి ఔన్స్ గోల్డ్ 3,000 డాలర్లకు చేరుకోవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా వేసింది.

మరో అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ కూడా బంగారంపై అంచనాలను పెంచింది. ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ బంగారం 2,300 డాలర్లకు పెరగవచ్చని గతంలో అంచనా వేసిన కంపెనీ.. తాజాగా అంచనాను 2,700 డాలర్లకు పెంచింది.

ఫెడ్ రేట్లు-గోల్డ్ డిమాండ్‌ది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో బంగారం కంటే స్థిర ఆదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి మళ్లుతుంటాయి. అమెరికాలో ధరలు మార్కెట్ అంచనాల మేరకు తగ్గకపోవడంతో జూన్ నుంచే ఫెడ్ రేట్ల తగ్గింపు మొదలు కావచ్చన్న అంచనాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. దాంతో పసిడి రేట్లు కాస్త తగ్గుముఖం పట్టవచ్చని బులియన్ వర్గాలు భావించిన తరుణంలో ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయనుందన్న వార్తలు వెలువడ్డాయి. ఇలాంటి అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారానికి డిమాండ్ మళ్లీ పుంజుకుంది. మధ్యలో స్వల్ప దిద్దుబాటుకు లోనయ్యే అవకాశాలున్నప్పటికీ, దీర్ఘకాలికంగా రేట్లు మరింత ఎగబాకడం ఖాయమని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రస్తుత ర్యాలీలో బంగారం ధరలకు 2,450-2,500 డాలర్ల స్థాయిలో గట్టి నిరోధం కన్పిస్తున్నదని.. 2,300-2,250 డాలర్ల స్థాయిలో మద్దతు లభించవచ్చని కమోడిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు.

కృష్ణపట్నం ఎల్‌పీజీ స్టోరేజీ టెర్మినల్ షురూ

పెట్రొగాజ్ ఇండియా వెల్లడి

చెన్నై: ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం వద్ద రూ.600 కోట్లతో ఏర్పాటు చేసిన ఎల్‌పీజీ దిగుమతి, స్టోరేజీ టెర్మినల్‌ను ప్రారంభించినట్లు పెట్రెడెక్ గ్రూప్ అనుబంధ సంస్థ పెట్రొగాజ్ ఇండియా వెల్లడించింది. అదానీ కృష్ణపట్నం ప్రైవేట్ పోర్టులో ఏర్పాటు చేసిన ఈ కొత్త స్టోరేజీ టెర్మినల్‌తో ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో పాటు గృహ, వాణిజ్య, పారిశ్రామిక, ఆటోమోటివ్ వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందని తెలిపింది. ఈ టెర్మినల్ వార్షిక సామర్థ్యం 15 లక్షల మెట్రిక్ టన్నులు. సరైన రోడ్ నెట్‌వర్క్ కలిగి ఉండటంతో ఈ టెర్మినల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంది. ఈ టెర్మినల్‌లో రెండు రిఫ్రిజిరేటెడ్ స్టోరేజీ ట్యాంకులు, మోడర్న్ జెట్టీ, అన్ని రకాలైన ఎల్‌పీజీ వెస్సెల్స్‌ను నిలిపే అవకాశంతో పాటు 16 ట్రక్ లోడింగ్ బేస్ ఉన్నాయని పెట్రొగాజ్ వెల్లడించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,550 ▼	66,500 ▼	89,000 ▼
ముంబై	73,174 ▲	67,027 ▲	83,819 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ

హైదరాబాద్	390	విజయవాడ	400
చిత్తూరు	468	విశాఖపట్నం	415
గోదావరి	400	వరంగల్	392
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	136	గోదావరి	137
వరంగల్	136	విజయవాడ	137
కరీంనగర్	136	గుంటూరు	137
మహబూబ్‌నగర్	136	ఒంగోలు	137
కర్నూలు	136	చిత్తూరు	151
విశాఖపట్నం	124		

డబ్బు రాకున్నా జీఎస్‌టీ చెల్లించాలా..?

ఇదీ GST



రాంబాబు గొండాల

సుధీర్ ఒక మార్కెటింగ్ నిపుణుడు. వ్యాపార సంస్థలు తమ అమ్మకాలను, లాభాలను పెంచుకోవటానికి, వ్యాపార విస్తరణకు తగు సూచనలు, సలహాలు ఇస్తుంటాడు. ఇందులో భాగంగా ఒక వ్యాపార సంస్థతో రూ.10 లక్షల విలువైన కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. ఒప్పందం ప్రకారం ముందుగా రూ.5 లక్షలు, పని పూర్తయిన తర్వాత మిగతా రూ.5 లక్షలు సదరు వ్యాపార సంస్థ తగిన జీఎస్‌టీతో సుధీర్‌కు చెల్లించాలి. మొదటి విడత రూ.5 లక్షలను సుధీర్ తన నెలవారీ రిటర్న్‌లో చూపించటంతో పాటుగా దాని మీద జీఎస్‌టీని కూడా ప్రభుత్వానికి చెల్లించాడు. అయితే కాంట్రాక్ట్ మొత్తం పూర్తయిన తర్వాత ఇవ్వవలసిన రూ.5 లక్షలకుగాను తాను ఆ వ్యాపార సంస్థకు జీఎస్‌టీతో కూడిన ఇన్వాయిస్ ఇచ్చాడు. కానీ ఆ వ్యాపార సంస్థ నుంచి ఇంకా తనకు డబ్బు అందలేదు. నిబంధనల ప్రకారం ఆ ఇన్వాయిస్ వివరాలను జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో చూపించాడు. అయితే తనకు ఇంకా డబ్బు అందకపోవటంతో సంబంధిత వివరాలను జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లో చూపలేదు. అంటే దానికి సంబంధించిన జీఎస్‌టీ చెల్లించలేదు.

ఇదిలా ఉండగా, ఒక రోజు సుధీర్‌కు జీఎస్‌టీ డిపార్ట్‌మెంట్ నుంచి ఒక ఈ-మెయిల్ వచ్చింది. జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-3బీ కి మధ్య వ్యత్యాసం ఉన్న కారణంగా ఆ మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలి అని దాని సారాంశం. తాను చేసిన పని తాలుకా డబ్బు గానీ, సంబంధిత జీఎస్‌టీ గానీ ఇంకా తనకు అందకపోవటంతో తాను జీఎస్‌టీ చెల్లించలేదని, డబ్బు అందగానే చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లిస్తానని చెప్పినా.. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఈ మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని అధికారులు వివరించటంతో సుధీర్ కొంత గందరగోళానికి లోనయ్యాడు. తనకు రాని డబ్బు మీద పన్ను చెల్లించాల్సి రావటం ఇబ్బందికరంగా అనిపించింది. ముందే ఇన్వాయిస్ ఇవ్వకుండా, డబ్బులు తీసుకునే సమయంలోనే ఇన్వాయిస్ ఇచ్చి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదేమో అని ఆలోచించాడు. కానీ, ఇన్వాయిస్ ఇవ్వకున్నా జీఎస్‌టీ మాత్రం తగు సమయంలో చెల్లించాలన్న విషయం సుధీర్‌కు తెలియదు. పన్ను ఎప్పుడు చెల్లించాలనే కనీస అవగాహన లేకపోవటం ఈ గందరగోళానికి కారణం.

నిజానికి ఈ విషయంలో చాలా మందికి కొంత అవగాహనా లోపం ఉంది. డబ్బు వచ్చినప్పుడే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని అనుకుంటారు. కానీ, ఇది అన్ని వేళలా నిజం కాదు. జీఎస్‌టీలో పన్ను ఎప్పుడు చెల్లించాలనే విషయం గురించి టైమ్ ఆఫ్ సప్లయ్ నిబంధన చెబుతుంది. సర్వీస్‌లు, గూడ్స్‌కు ఈ నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి. పైన చెప్పిన ఉదాహరణలో సుధీర్ సేవల రంగంలో ఉన్నాడు. కాబట్టి సర్వీస్‌లకు సంబంధించిన నిబంధనల గురించి తెలుసుకుందాం.

సర్వీస్‌లకు సంబంధించి టైమ్ ఆఫ్ సప్లయ్ నిబంధన ఇన్వాయిస్ జారీ చేసిన సమయాన్ని బట్టి నిర్ధారణ అవుతుంది. అంటే ఇన్వాయిస్ నిర్ణీత సమయంలో ఇచ్చారా లేదా అనే దాన్ని బట్టి ఉంటుంది. సాధారణంగా సర్వీస్‌లకు ఇన్వాయిస్ ఇవ్వడానికి నిర్ణీత సమయం అంటే సర్వీస్ పూర్తయిన తర్వాత నెల రోజుల లోపు. ఒకవేళ నెల రోజుల లోపు ఇన్వాయిస్ ఇస్తే ఇన్వాయిస్ ఇచ్చిన తేదీ లేదా దానికి సంబంధించిన పేమెంట్ తేదీ.. ఈ రెండింటిలో ఏది ముందైతే అది టైమ్ ఆఫ్ సప్లయ్. ఒకవేళ ఇన్వాయిస్ నిర్ణీత సమయంలో ఇవ్వకుంటే సర్వీస్ పూర్తయిన తేదీ లేదా పేమెంట్ వచ్చిన తేదీ ఈ రెండిట్లో ఏది ముందైతే అది టైమ్ ఆఫ్ సప్లయ్ కింద లెక్కించాలి.

పైన చెప్పిన ఉదాహరణలో పేమెంట్ ఎలాగూ రాలేదని చెప్పుకున్నాం. కాబట్టి ఇన్వాయిస్ నిర్ణీత సమయంలో ఇచ్చి ఉంటే, ఇన్వాయిస్ ఇచ్చిన తేదీ టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. ఒకవేళ ఇన్వాయిస్ నెల రోజుల లోపు జారీ చేయకుండా, డబ్బులు వచ్చే ముందు జారీ చేయవచ్చని అనుకుంటే, సర్వీస్ పూర్తయిన తేదీ టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. కాబట్టి జీఎస్‌టీ ఎప్పుడు చెల్లించాలనే అంశం కేవలం పేమెంట్ మీదనే ఆధారపడి ఉండదు. జీఎస్‌టీ కింద నమోదైన అందరూ ఈ విషయంలో అవగాహన కలిగి ఉండాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.


ఖమ్మం జిల్లా మాదిరిపురం వద్ద పొంగులేటి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖమ్మం అభ్యర్థి ఎవరైనా..
కాంగ్రెస్ గెలుపే లక్ష్యం: మంత్రి పొంగులేటి

కూసుమంచి, ఏప్రిల్ 13: ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ఇందుకోసం పార్టీ శ్రేణులు కష్టపడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కూసుమంచి క్యాంపు కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఎక్కడ సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వందకు వందశాతం చేయలేకపోయినా.. చేయగలిగిన సాయం చేస్తానని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం స్థానికసంస్థల ఎన్నికలు వస్తాయని, ఆ ఎన్నికల్లోనూ పార్టీని గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కక్షలు పెంచుకునే పరిస్థితిని విడనాడాలని కార్యకర్తలకు హితవు పలికారు. అందరూ కలిసి మెలిసి ఉంటూ ముందుకు సాగాలని ఆయన చెప్పారు.

మంత్రి పొంగులేటి వాహనం తనిఖీ

తిరుమలాయపాలెం: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వాహనాన్ని ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు తనిఖీ చేశారు. పొంగులేటి హైదరాబాదు నుంచి కారులో ఖమ్మం జిల్లాలో పర్యటించేందుకు వస్తుండగా ఖమ్మం-మహబూబాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన సుబ్లేడు క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంత్రి పొంగులేటి వాహనాన్ని పోలీసులు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

హామీల అమలుపై చర్చకు సిద్ధమా?:హరీశ్‌రావు



సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 13: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై చర్చకు సిద్ధమా అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు.. సీఎం రేవంత్ సవాల్ విసిరారు. సంగారెడ్డిలో స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన శనివారం జరిగిన నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ యువత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని రేవంత్‌రెడ్డి ఒక్కసారైనా జై తెలంగాణ అన్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్ అలుపెరగని పోరాటంతో, అమరుల త్యాగాలతో తెలంగాణ సిద్ధించిందని చెప్పారు. తెలంగాణ రావడం వల్లే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, లేకుంటే చంద్రబాబు దగ్గర ఉండేవారన్నారు. ఎన్నికలప్పుడు అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మోసగించారని ఆరోపించారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి అండగా ఉండి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

308 సీట్లలో పోటీ చేస్తున్న బీజేపీ
400 సీట్లు ఎలా గెలుస్తుంది:వేం నరేందర్

పెద్దేముల్, ఏప్రిల్ 13 : నాలుగు వందల సీట్లు గెలుస్తామని చెబుతూ బీజేపీ ప్రజలతో మైండ్‌గేమ్ ఆడుతోందని, అది ఎవరు పట్టించుకోవద్దని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. 308 సీట్లలో మాత్రమే పోటీ చేస్తున్న బీజేపీ 400 సీట్లు ఎలా గెలుస్తుందని ప్రశ్నించారు. 100 స్థానాలు మిత్రపక్షాలకిచ్చి ఆ పార్టీ 308 సీట్లలో పోటీ చేస్తోందని తెలిపారు. శనివారం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి ఉన్న కార్యకర్తల బలం ఏ పార్టీకి లేదన్నారు, 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ నిలబడగలిగిందంటే అది కార్యకర్తల బలమేనని చెప్పారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని దేశం కోరుకుంటోందని, ఢిల్లీలో అధికారం తమదేనని జోస్యం చెప్పారు. రంజిత్‌రెడ్డి కష్టపడి పైకొచ్చిన వ్యక్తి అని, ఆయన ప్రజలకు సేవచేయాలని వచ్చారు తప్ప, పదవుల కోసం రాలేదని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తాండూరు నుంచి 50 వేలు మెజార్టీ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నిరుపేద మహిళలకు నెలకు రూ.8,500

» కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

భండారా/బస్తర్, ఏప్రిల్ 13: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన మహిళలకు నెలకు రూ.8,500లు అందిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, మహారాష్ట్రలోని భండారా జిల్లా సకోలిలో శనివారం ఆయన ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతో దేశ ప్రజలు బాధపడుతున్నారని, కానీ మీడియా వాటిని పట్టించుకోదని, మోదీ విమాన, సముద్రగర్భ ప్రయాణాలు, పూజలనే చూపుతుందని ఆరోపించారు. వ్యాపారవేత్తల కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తుందని, దేశంలోని 50 శాతం జనాభాకు చెందిన సంపద కేవలం 22 మంది వ్యక్తుల వద్దే ఉందని చెప్పారు. వేలల్లో ఆదాయం పొందేవారు, కోట్లాది రూపాయలు సంపాదించేవారు ఒకే రకమైన జీఎస్టీ కడుతున్నారని ఎన్డీయే ప్రభుత్వంపై మండిపడ్డారు. అదానీ ఆస్తి ఈ పదేళ్లలో గణనీయంగా పెరిగిందని, ఎయిర్‌పోర్టులు, రోడ్లు, గనులు, పవర్‌ప్లాంట్లు.. ఇలా ప్రతిదానిలోనూ ఆయనకు వాటాలున్నాయని ఆరోపించారు. అయినప్పటికీ మోదీ వీటి గురించి ఏం మాట్లాడరని, కేవలం కులం, మతం గురించి మాత్రమే మాట్లాడతారని విమర్శించారు. తానూ ఓబీసీనేనని చెప్పుకునే మోదీ, ఆ వర్గం కోసం గడిచిన పదేళ్లలో ఏం చేశారని రాహుల్ ప్రశ్నించారు. బీజేపీ రాజ్యాంగంపై దాడికి పాల్పడుతుంటే తాము దానిని కాపాడేందుకు పోరాడుతున్నామని పేర్కొన్నారు.

మరో 16 మంది పేర్లతో కాంగ్రెస్ జాబితా విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: మరో 16 లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ శనివారం అభ్యర్థులను ప్రకటించింది. చండీగఢ్ నుంచి కేంద్ర మాజీ మంత్రి మనీష్ తివారీ పోటీ చేయనున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీలో బీజేపీ అభ్యర్థి, ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కు వ్యతిరేకంగా విక్రమాదిత్య సింగ్‌ని నిలబెట్టింది. ఆయన హిమాచల్ పీసీసీ చీఫ్ ప్రతిభా సింగ్ కుమారుడు కావడం గమనార్హం.

జీవన వ్యయం పాక్‌లో అత్యధికం

» 25%గా నమోదైన ద్రవ్యోల్బణం.. ఏడీబీ అధ్యయనం

ఇస్లామాబాద్, ఏప్రిల్ 13: ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో పాకిస్థాన్‌లో జీవన వ్యయం అత్యధికంగా ఉంది. ఇక్కడ ద్రవ్యోల్బణం 25 శాతంగా నమోదయింది. మరోవైపు ఆర్థిక వృద్ధి కేవలం 1.9శాతంగా ఉంది. అత్యధిక ద్రవ్యోల్బణం, అత్యల్ప ప్రగతి కారణంగా దేశంలో ఆర్థిక స్తబ్ధత నెలకొంది. ఆసియా ఖండంలోని దేశాల పరిస్థితులపై ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 21 శాతానికి తగ్గుతుందని పాకిస్థాన్ స్టేట్ బ్యాంకు అంచనా వేసినా అదేమీ నిజమయ్యే సూచనలు కనిపించడం లేదు. దేశంలో ఇప్పటికే 9.8కోట్ల మంది పేదరికంలో ఉండగా, మరో కోటి మంది ఈ జాబితాలో చేరే ప్రమాదం ఉందని ప్రపంచబ్యాంకు కూడా అంచనా వేసింది. విదేశీ సాయం భారీగా అంది, రుణాల చెల్లింపును వాయిదా వేస్తేనే ప్రస్తుత పరిస్థితి నుంచి పాక్ బయటపడుతుందని ఏడీబీ అభిప్రాయపడింది. రాజకీయ అనిశ్చితి కారణంగానే ఆర్థిక సంస్కరణలు చేపట్టలేకపోతున్నారని అన్ని సమస్యలకు అదే కారణమని పేర్కొంది.

కాంగ్రెస్‌కు ఎంఐఎం భజన

» బీజేపీకి ప్రజాదరణ చూసి ఒవైసీకి భయం: కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర/బంజారాహిల్స్/భగత్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు భజన చేసిన ఎంఐఎం.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ భజన చేస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై తిట్ల వర్షం కురిపించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్.. ఇప్పుడు బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్‌తో దోస్తీ చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ నందినగర్, ఎన్.బి.టి నగర్, ప్రతాప్‌నగర్‌లో శనివారం కిషన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మరోవైపు, జీప్ యాత్ర నిర్వహించారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య, రాష్ట్ర నాయకుడు ఎక్కాల కన్నాతో పాటు దాదాపు 400 మంది కార్యకర్తలు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ అభ్యర్థికి వస్తున్న ప్రజాదరణ చూసి భయపడిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కాంగ్రెస్‌తో దోస్తీ కడుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. తెలంగాణలో స్కాంలు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు అవి చాలవన్నట్టు ఢిల్లీలో కూడా మద్యం కుంభకోణాలకు తెరదీశారని ఆరోపించారు. దీంతో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని.. ఇప్పుడు అది కూడా పెద్ద తప్పిదంగా భావిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాలన గాడి తప్పిందని, అనేక సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు.


కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న చైతన్య, కన్నా

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మిలాఖత్: సంజయ్

దేశ రాజకీయాల్లో జరుగుతున్న ఇండియన్ పొలిటికల్ లీగ్‌లో కప్ గెలిచేది బీజేపీయేనని ఎంపీ బండి సంజయ్ తెలిపారు. రాష్ట్రంలో కిషన్‌రెడ్డి సారథ్యంలో బీజేపీ దూసుకుపోతోందని, కాంగ్రెస్ టీంకు ఆటగాళ్లు కూడా దొరకడంలేదన్నారు. బీఆర్‌ఎస్ టీం సభ్యులు నిరాశ, నిస్పృహలో ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో 17 సీట్లు గెలిచి టీపీఎల్ కప్‌ను బీజేపీ గెలవబోతోందని తెలిపారు. కరీంనగర్‌లో సంజయ్ మాట్లాడారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ప్రజల కోసం చేసిందేంటని ప్రశ్నించారు. రెండు పార్టీలు చీకటి ఒప్పందాలతో ఒక్కటయ్యాయని విమర్శించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 18న రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆ రోజు హైదరాబాద్ వస్తున్న ఆయన విశ్రాంత ఆర్మీ అధికారులతో సమావేశమవుతారు. 19న ఖమ్మం వెళ్లి పార్టీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు.

బలమైన విపక్షం ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలంటే ప్రజలు ఓటుతో చురుకు పెట్టాలని సూచించారు. హామీల అమలు కోసం ప్రతిపక్షంగా తాము ప్రభుత్వాన్ని వెంటాడి వేటాడతామని అన్నారు. శనివారం చేవెళ్లలో బీఆర్‌ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. "ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి. గెలిచిన ప్రభుత్వం ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటూ ధీమా కల్పించాలి. వారి ఆత్మవిశ్వాసం, గౌరవం పెంచేదిగా పాలించాలి. కానీ, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు చూస్తే బాధ కలుగుతోంది. కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి అయిదు నెలలవుతున్నా ఇప్పటివరకు హామీలను నెరవేర్చలేదు. ఒక్క పాలసీనీ అమలు చేయలేదు" అని విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కరెంట్, తాగునీరు బ్రహ్మాండంగా ఇచ్చామన్నారు. "కేసీఆర్ పక్కకు పోగానే కరెంట్ ఎందుకు మాయమైంది? దానికి ఏం రోగమొచ్చింది? తాగే నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదు? మీ అసమర్థత వల్ల కాదా? గత ప్రభుత్వం అమలు చేసిన వాటిని కొనసాగించినా సరిపోయేది. వాటిని కూడా నడపలేని అసమర్థ ప్రభుత్వం ఇది" అని కేసీఆర్ ధ్వజమెత్తారు. అధికార పార్టీకి చిత్త శుద్ధి, కార్యాచరణ లేవని, ఉన్న వసతులు, వనరులను వాడుకునే నైపుణ్యం కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణలో పదేళ్ల కిందట ఉన్న పరిస్థితులు ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయని, చావు నోట్లో తలపెట్టి సాధించిన రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకు గురి చేస్తున్నాయని, ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


చేవెళ్లలో బీఆర్‌ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న ప్రజలు

నీటి కోసం ఈ ఇబ్బందులు ఎందుకు?

తాము 24 గంటలపాటు కరెంట్ ఇచ్చి, అన్ని ప్రాంతాలకు పుష్కలంగా తాగునీరు అందించామని కేసీఆర్ చెప్పారు. ఇప్పుడు నీటి కోసం, కరెంట్ కోసం ప్రజలు ఇబ్బందులు ఎందుకు పడుతున్నారని ప్రశ్నించారు. దళితబంధు కింద తాము రూ.10 లక్షలు ఇస్తే.. కాంగ్రెస్ రూ.12 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఒక్క బిడ్డకు కూడా దళిత బంధు, బీసీ బంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పైగా, ఈ పథకాల కింద తమ ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బును కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీజ్ చేసి డబ్బు మొత్తాన్ని వాపస్ తీసుకుందని ఆరోపించారు. దళిత బంధు కింద తాము 1.3 లక్షల మంది లబ్ధిదారులకు మంజూరు చేసిన డబ్బును వారికి ఇచ్చేవరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం మెడలు వంచేందుకు వారందరినీ తీసుకువచ్చి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. హామీలు అమలు చేస్తారా? లేదా? అని కాంగ్రెస్ నేతలను నిలదీయాలన్నారు. "పోరాటం చేయకుండా ఏమీ రాదు. మీ అందరికీ బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది. మౌనం వహించకుండా సమయం వచ్చినప్పుడు పోరాటం చేయాలి. ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి" అని కేసీఆర్ అన్నారు. ప్రభుత్వం మెడలు వంచేందుకు ఒక వేటగాడు కావాలని, పదునైన మొనదేలిన అంకుశం, అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ లాంటి నేతలు కావాలని పేర్కొన్నారు.

బతికి ఉన్నంతకాలం పోరాడతా

బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం, తెలంగాణ ప్రయోజనాల కోసం అని కేసీఆర్ అన్నారు. ప్రజలు అధికారం ఇస్తే అన్ని వర్గాల వారినీ పదేళ్లపాటు ఆదుకున్నామని, కోడి తన పిల్లలను రెక్కల కింద పెట్టుకుని కాపాడినట్లు తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని కాపాడిందని తెలిపారు. ఇపుడు తన కళ్లముందే ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, రైతులు గోస పడుతుంటే బాధ కలుగుతోందన్నారు. "నేను బతికి ఉన్నన్ని రోజులు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పోరాటం చేస్తాను తప్ప.. నోరు మూసుకుని కూర్చోను. రాష్ట్ర పభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను. ధాన్యం వచ్చింది.. అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. ధాన్యం తడిసినా.. గింజ లేకుండా కొనాలి. రైతులకు న్యాయం చేయాలి" అని అన్నారు. బీసీలకు దమ్ము, పౌరుషం ఉంటే కాసానిని గెలిపించి చూపించాలని ఒక పెద్ద మనిషి అన్నారని, బలహీనవర్గాల వారు ఈ సవాల్‌ను స్వీకరించి బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. చేవెళ్లలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డిపై కేసీఆర్ మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పుణ్యాన గెలిచిన రంజిత్‌రెడ్డికి తాము ఏం తక్కువ చేశామని ప్రశ్నించారు. "ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్‌ల తరఫున పోటీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులూ ఎవరికీ తెలిసినవారు కాదు. మా పార్టీ నుంచే ఎంపీలయ్యారు. రంజిత్‌రెడ్డి ఏ కారణంతో బీఆర్‌ఎస్ నుంచి పోయాడు?" అని ప్రశ్నించారు. ఇలాంటి వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పి దెబ్బకొట్టాలన్నారు.



రియల్ ఎస్టేట్ ఎందుకు పతనమైంది?

కాంగ్రెస్ ఇచ్చిన 420 వాగ్దానాలు ఏమయ్యాయని కేసీఆర్ నిలదీశారు. ఆడబిడ్డలకు ఇస్తామన్న స్కూటీలు ఇవ్వడం లేదు కానీ.. రాష్ట్రంలో లూటీలు మాత్రం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ సహా రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో గతంలో భూముల ధరలు ఎలా ఉండేవి? ఇపుడు ఎక్కడ ఉన్నాయని, రియల్ ఎస్టేట్ ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. దీని వెనుక బ్రోకర్లు, జోకర్లు ఎవరున్నారని, రియల్ ఎస్టేట్ పర్మిషన్లు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. లక్షల మంది పిల్లలు బతికే రియల్ ఎస్టేట్ నాశనమైందని, ఇంకా ఇలాగే చూస్తూ కూర్చుందామా? ప్రభుత్వానికి బుద్ధి చెబుదామా? అని ప్రశ్నించారు. బీజేపీ భావోద్వేగాలు పెంచడం తప్ప.. ప్రజలకు ఏ మేలూ చేయలేదని కేసీఆర్ అన్నారు. మోదీ హయాంలో పెట్రోల్ ధరలు పెంచడం తప్ప.. ఏ వర్గానికీ మేలు చేయలేదని విమర్శించారు. బీజేపీ వల్ల తెలంగాణకు ఒక్క మంచి పని జరగలేదన్నారు. "అయితే మోడీ.. లేదంటే ఈడీ. ఇదేనా బీజేపీ రాజకీయం? దండం పెట్టి చెబుతున్నా.. బీజేపీ భావోద్వేగాలు పెంచితే మతం మత్తులో పడి వారికి ఓటేస్తే తరువాత మనం పిచ్చిలేసి పోతాం తప్ప.. మనకు ఉద్యోగాలు రావు.' అని కేసీఆర్ చెప్పారు. మోటార్లకు మీటర్లు పెట్టమన్న బీజేపీని ఎన్నికల్లో నేలకేసి కొట్టాలన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు కేసీఆర్ నివాళులర్పించారు. తెలంగాణ ఏర్పాటు అంబేద్కర్ పుణ్యమేనని, ఆయన రచించిన రాజ్యాంగం స్ఫూర్తితోనే రాష్ట్రం సాధించామని చెప్పారు.

బీజేపీ మ్యానిఫెస్టో నేడు విడుదల

» అధునాతన భారత్, ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా నిలిపేలా అంశాలు
» అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చోటు
» హై స్పీడ్, బుల్లెట్ రైళ్లపై ప్రకటనకు అవకాశం
» జాతీయ భద్రతపై కీలక అంశాలుండే చాన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా, అధునాతన దేశంగా భారత్ అవతరించేందుకు మోదీ సారథ్యంలో భారతీయ జనతా పార్టీ అనుసరించబోయే విధానాలను వివరిస్తూ ఆ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోను ఆదివారం విడుదల చేయబోతున్నది. 'మోదీ గ్యారెంటీ-2047 కల్లా వికసిత భారత్' పేరుతో.. బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఉదయం 8:30కి పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అగ్రనేతలు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ప్రధాని మోదీ ఈ మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నారు. అవినీతిపై మోదీ ప్రారంభించిన పోరాటం ఆగదని.. ప్రతిపక్షాలు ఎంత దుష్ప్రచారం చేసినా అవినీతిని నిర్మూలించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని, మరిన్ని చట్టాలు చేస్తుందని ఈ మేనిఫెస్టోలో ప్రకటించబోతున్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న యువకులు, మహిళలు, పేదలు, రైతుల అభ్యున్నతికి తీసుకోబోయే చర్యలను కూడా వివరించనున్నారు. రైతులకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వగా.. బీజేపీ ఈ విషయంలో ఏం ప్రకటిస్తుందన్న విషయంపై ఆసక్తి నెలకొంది. అభివృద్ధి, సామాజిక న్యాయం, సాంస్కృతిక, జాతీయవాద అంశాలను కూడా బీజేపీ మ్యానిఫెస్టోలో ప్రధానంగా చేర్చారని తెలుస్తోంది. రామ జన్మభూమిలో రామ మందిరాన్ని నిర్మించి కోట్లాది హిందువుల కలను నెరవేర్చిన మోదీ.. భారతీయుల అస్తిత్వాన్ని, మనోభావాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటారని, బూటకపు లౌకిక వాదం బీజేపీ ఎజెండా కాదని స్పష్టం చేయనున్నారు. హై స్పీడ్ రైళ్లు, బుల్లెట్ రైలు కారిడార్ల వంటి అనేక భారీ మౌలిక సదుపాయాలను కూడా మ్యానిఫెస్టోలో ప్రకటించనున్నారు. 2019లో విడుదల చేసిన సంకల్ప్ పత్ర్‌లో పేర్కొన్న హామీల్లో ఎన్ని అమలయ్యాయో బీజేపీ వివరించబోతోంది. జాతీయ భద్రతకు కూడా బీజేపీ కీలక ప్రాధాన్యం ఇవ్వబోతోంది. సరిహద్దుల్లో చెలగాటమాడితే మోదీ మౌనంగా ఉండరని.. దీటుగా సమాధానమిస్తారనే హెచ్చరికను కూడా మ్యానిఫెస్టోలో ప్రకటించబోతున్నారని తెలుస్తోంది.

ప్రజాభిప్రాయంతో మ్యానిఫెస్టో..

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కన్వీనర్‌గా వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ ఉప కన్వీనర్‌గా ఏర్పడిన మ్యానిఫెస్టో కమిటీలో బీజేపీ నేతలు భూపేందర్ యాదవ్, అర్జున్ రాం మేఘ్వాల్, కిరెన్ రిజిజు, అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ పాటిల్, హిమంత విశ్వ శర్మ, శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధరా రాజె, స్మృతి ఇరానీ తదితరులు ఉన్నారు. దాదాపు రెండుసార్లు సమావేశమైన ఈ కమిటీ పలు ప్రతిపాదనలపై చర్చలు జరిపింది. సోషల్ మీడియా, ఇతర మార్గాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. నమో యాప్ ద్వారా 4 లక్షల సూచనలను కూడా బీజేపీ స్వీకరించింది.

సాగర్‌లో 10 అత్యవసర మోటార్లు

డెడ్‌స్టోరేజీ నుంచి నీటి తరలింపునకు ఏర్పాట్లు.. జంట నగరాల్లో తాగు నీటి కొరతను తీర్చేందుకే..

» రేపటి నుంచి రోజూ 3 షిఫ్టుల్లో పంపింగ్
» ఏఎమ్మార్పీకి 900 క్యూసెక్కుల తరలింపు
» అక్కడి నుంచి హైదరాబాద్‌కు..
» ఎల్లంపల్లి నుంచీ నీళ్లు తోడేలా ఏర్పాట్లు
» గోదావరి మధ్యలో 1.5కి. మీ మట్టి రోడ్డు

పెద్దఅడిశర్లపల్లి/నాగార్జునసాగర్/అంతర్గాం, ఏప్రిల్ 13: ఇటు.. నాగార్జున సాగర్ డెడ్‌స్టోరేజీకి 'అడుగు' దూరంలో ఉంది! అటు.. మండు వేసవి మధ్య హైదరాబాద్-సికింద్రాబాద్‌లో తాగునీటికి రోజురోజుకు కొరత ఏర్పడుతోంది. సాగర్ నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరుకున్నా మరో రెండు నెలల పాటు జంట నగరాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి జీరో పాయింట్ వద్ద రూ.4కోట్లతో ఎమర్జెన్సీ మోటార్లతో నీటిని తోడే పనులను హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) చేపట్టింది. తద్వారా సాగర్ నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరుకున్నా కూడా జంటనగరాల అవసరాలకు వీలుగా నిరంతరయంగా నీటి సరఫరా కొనసాగింవచ్చని బోర్డు భావిస్తోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 510.30 అడుగుల మేర మాత్రమే నీరు ఉంది. నీటిమట్టం 510 అడుగులకు చేరితే దాన్ని కనిష్ఠ నీటి మట్టం (డెడ్ స్టోరేజీ)గా పరిగణిస్తారు. ఈ లెక్కన ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీని మించి 2 టీఎంసీల నీటి నిల్వలే ఉన్నాయి. దీంతో జంటనగరాలకు తాగు నీటిని అందించే ఏఎమ్మార్పీ ప్రాజెక్టు అప్రోచ్ కెనాల్‌కు ప్రస్తుతం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా నీరు అందడం లేదు. అందుకే నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్ల మండలం పుట్టంగండి జీరో పాయింట్ వద్ద 600 హెచ్‌పీ సామర్థ్యం గల 5 మోటార్లు, 300 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మరో 5 మోటార్లు ఏర్పాటు చేస్తున్నారు. జీరో పాయింట్ వద్ద ఉన్న షెడ్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, మోటార్లు బిగింపు పనులు సాగుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు తీగలు లాగే పనులు ఆదివారం నాటికి పూర్తి కానున్నాయి. అంతేకాకుండా మోటార్లకు నీరు అందే విధంగా కాల్వకు అడ్డుకట్ట వేసేందుకు ఇనుప చువ్వలతో జాలీలు అల్లి అందులో పెద్దపెద్ద రాళ్లు పేర్చుతున్నారు. తద్వారా అప్రోచ్ కెనాల్‌లోకి రోజుకు 900 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయనున్నారు. సోమవారం నుంచి మూడు షిఫ్టుల్లో నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో 10 మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోయడానికి వారం రోజులు పడుతుందని హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు డీజీఎం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ ఏర్పాట్లతో జలాశయ మట్టం 500 అడుగులకు పడిపోయే దాకా నీటిని తోడుకోవచ్చు.


పుట్టంగండి వద్ద చురుగ్గా సాగుతున్న మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు

ఐదేళ్ల తర్వాత ఇప్పుడే..

గతంలో 2016, 2017, 2018, 2019 వరుసగా పుట్టంగండి వద్ద మోటార్లు ఏర్పాటు చేసి సాగర్ నీటిమట్టం 500 అడుగుల వరకు ఉన్నా నీటిని ఎత్తిపోశారు. 2019 తర్వాత మళ్లీ ఇప్పుడు అత్యవసర మోటార్ల ద్వారా నీటి తరలింపు చేపట్టాల్సి వచ్చింది. వాస్తవానికి కొన్ని రోజుల క్రితం వరకూ ఏఎమ్మార్పీ నుంచి మూడు మోటార్ల ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయర్‌కు తరలించేవారు. అక్కడి నుంచి జంట నగరాలతోపాటు మిషన్ భగీరథ పథకానికి సరఫరా చేసే వారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రెండు మోటార్ల ద్వారా రోజూ 800 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయర్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వేసవిలో జంట నగరాల తాగునీటి అవసరాలకు 5.6 టీఎంసీలు అవసరం పడుతాయని భావిస్తుండగా.. ప్రత్యేక మోటార్లతో ఎత్తిపోయడం ద్వారా తెలంగాణ వాటా కింద 8.5 టీఎంసీల దాకా తోడుకునే అవకాశం ఉంది.

ఎల్లంపల్లి వద్ద కూడా..

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం సాగర్‌తోపాటు పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచీ నీటిని తోడేందుకు అత్యవసర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు అయితే ప్రస్తుతం 7.29టీఎంసీల నీరే ఉంది. నీరు మరింత తగ్గితే హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీతోపాటు ఆర్ఎఫ్‌సీఎల్, మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు ఎల్లంపల్లి ప్రాజెక్టు నది మధ్యలో నుంచి నీరు ఉన్న ప్రాంతం వరకు ఒకటిన్నర కిలోమీటరు మేర మట్టి రోడ్డును వేశారు. విద్యుత్తు స్తంభాలు పాతి, కరెంటు లైన్లు ఏర్పాటు చేశారు. ఆ మార్గం గుండా ప్రత్యేక పైపులైన్ నిర్మాణం పూర్తి చేసి ముర్మూరు పంపుహౌస్ అప్రోచ్ కాలువల వరకు నీటిని ఎత్తిపోయనున్నారు. 2016లో ఇదే తరహాలో అధికారులు నీటిని ఎత్తిపోశారు. 2020లో ఇటువంటి పరిస్థితే తలెత్తగా రోడ్డును వేసే క్రమంలో వర్షాలు రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కలుషిత ఆహారం తిని 17 మంది విద్యార్థులకు అస్వస్థత

» భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఘటన
» హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఓ విద్యార్థి పరిస్థితి విషమం

భువనగిరిటౌన్, ఏప్రిల్ 13: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా 17 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. వీరిలో ఒక విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భువనగిరిలోని సాంఘిక సంక్షేమ ఎక్సలెన్స్ ఆశ్రమ పాఠశాలలో 5 నుంచి 9వ తరగతి చదువుతున్న 480 మంది విద్యార్థులు ఉన్నారు. శుక్రవారం యథావిధిగా మధ్యాహ్న భోజనం చేశాక నలుగురు విద్యార్థులు తమకు వాంతులు వస్తున్నాయని ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ నలుగురిని భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆరో తరగతి చదువుతున్న ప్రశాంత్ అనే విద్యార్థి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మరో విద్యార్థి కూడా హైదరాబాద్‌లోనే మరో ఆస్పత్రిలో చికిత్స తీసుకుని అదే రాత్రి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లాడు. శనివారం కూడా మరో 13 మంది విద్యార్థులు అవే లక్షణాలతో ఉపాధ్యాయులను కలవడంతో వెంటనే వారందరినీ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిలో పలువురిని హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించగా.. ఇద్దరు డిశ్చార్జి అయ్యారు. మరో ఆరుగురు చికిత్స తీసుకుంటున్నారు. విద్యార్థులు తమ పెట్టెల్లో దాచుకొని పాచిపోయిన ఉగాది భక్షాలను తినడంతోనే ఫుడ్ పాయిజన్ కావొచ్చని ఉపాధ్యాయులు అనుమానాలు వ్యక్తం చేస్తుండగా, భోజనంలో నాణ్యత లోపించడం, అపరిశుభ్రత కారణంగానే విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ విద్యార్థులను పరామర్శించారు.


యాదాద్రి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

నీటి సమస్యకు టోల్ ఫ్రీ నంబర్ '155313'

» గతంలో కంటే ఎక్కువ నీటి సరఫరా: మంత్రి పొన్నం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తాగునీటి అవసరాలకు గతంలో ప్రతి నిత్యం 2,300 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేయగా.. ఇప్పుడు 2,450 మిలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రతిపక్షాలు అవాస్తవ ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎక్కడ నీటి ఎద్దడి ఏర్పడినా 155313 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటాయని, దీంతో కొంత ఇబ్బంది ఉంది తప్ప వాటర్‌బోర్డు సరఫరా చేస్తున్న నీరు తగ్గలేదని చెప్పారు. నగరంలో 700 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. నాగార్జునసాగర్, జంట జలాశయాలు, సింగూరులో నీటి నిల్వలు ఉన్నాయని, నీటి సరఫరాకు ఢోకా లేదని మంత్రి వెల్లడించారు.

మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు రోజులుగా తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు శనివారం నుంచి మళ్లీ పెరగడం మొదలయ్యాయి. ఆదివారం నుంచి బుధవారం వరకు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 17, 18 తేదీల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 38-42 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం 18 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటే అవకాశం ఉందని హెచ్చరించింది. శనివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, నల్గొండ జిల్లా మాడుగులపల్లిలో గరిష్ఠంగా 41.1, భద్రాద్రి జిల్లా జూలూరుపాడులో 40.9, వనపర్తి జిల్లా పనగల్‌లో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

గ్యాస్ రాయితీకి రూ.60 కోట్లు విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ రాయితీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు శనివారం పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీ.ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని శాఖ కమిషనర్‌కు సూచించారు. కాగా అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారికి రూ.500కే వంటగ్యాస్‌ను రాయితీ కింద అందిస్తున్న విషయం తెలిసిందే.

బొగ్గు గని కార్మికులకు కనీస పెన్షన్ రూ.1000

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన బొగ్గు గని కార్మికుల కనీస పెన్షన్ రూ.1,000కి పెరిగింది. ఈ మేరకు కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్-1998కు సవరణలు చేస్తూ గత నెల 8న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటి వరకు కొన్ని కేటగిరీల కార్మికులకు కనీస పెన్షన్ రూ.250 ఉండగా, మరికొన్ని కేటగిరీల వారికి రూ.350 ఉంది. తాజా నిర్ణయంతో అన్నిరకాలు/అన్ని కేటగిరీల పెన్షన్ రూ.1,000కి చేరింది. పెరిగిన పెన్షన్ ఈ ఏడాది మార్చి నుంచి అమల్లోకి వచ్చింది. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిన ప్రస్తుత తరుణంలో నెలకు రూ.1,000 కనీస పెన్షన్ ఏ మాత్రం సహేతుకంకాదని, పదవీ విరమణ చేసిన బొగ్గు గని ఉద్యోగుల కుటుంబాలు ఈ పెన్షన్‌తో ఎలా జీవించగలవని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు ప్రశ్నించారు.

నిబంధనల మేరకే పేపరు కొనుగోలు

» మంత్రుల, అధికారుల ప్రమేయం ఉండదు

» తెలుగు అకాడమీ సంచాలకులు దేవసేన

» 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వివరణ

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు అకాడమీ పేపరు కొనుగోలు వ్యవహారమంతా పూర్తి పారదర్శకంగా జరుగుతోందని, ఎల్1గా ఎంపికైయే సంస్థకే ప్రభుత్వ ఆమోదం తర్వాత వర్క్ ఆర్డర్ ఇస్తున్నామని తెలుగు అకాడమీ సంచాలకులు దేవసేన తెలిపారు. ఇందులో మంత్రులు, అకాడమీ అధికారుల ప్రమేయం ఏమీ ఉండదని ఆమె అన్నారు. ఈ నెల 11న 'ఆంధ్రజ్యోతి'లో 'తెలుగు అకాడమీ.. అక్రమాల కాగితం' శీర్షికన వచ్చిన కథనంపై ఆమె వివరణ ఇచ్చారు. అకాడమీ కొనుగోలు ధరలు మార్కెట్‌లో ఉన్న ధరల కంటే తక్కువగా ఉన్నాయని, అందువల్ల అకాడమీకి ఏ విధమైన నష్టం జరగలేదని తెలిపారు. అలాగే అకాడమీలో గల్లంతయిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల సొమ్మును వివిధ బ్యాంకుల నుంచి వడ్డీతో సహా రికవరీ చేసి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేశామని వెల్లడించారు. కాగా 70 జీఎస్ఎం నాణ్యత గల పేపర్‌ను మెట్రిక్ టన్నుకు రూ.1.10 లక్షల చొప్పున తెలుగు అకాడమీ కొనుగోలు చేసింది. ఈ ఏడాది పేపర్ ధరలు మెట్రిక్ టన్ను రూ. 84 వేలకు పడిపోయాయి. విద్యాశాఖలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా టన్నుకు రూ. 93 వేల చొప్పున కొన్ని ఆర్డర్లు ఇచ్చారు. అదే ధరకు తెలుగు అకాడమీ కూడా కొనుగోలు చేసి ఉంటే బాగుండేదనే అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' లేవనెత్తింది.

ధరణి చట్టాన్ని పూర్తిగా సవరించాలి: ట్రెసా

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ధరణి-2020 రెవెన్యూ చట్టాన్ని సమూలంగా సవరించాల్సిందేనని ట్రెసా కార్యదర్శి గౌతమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ధరణి సమస్యలపై ఓ ఛానల్ నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. ధరణి పోర్టల్‌లో నెలకొన్న లోపాలతో వేల మంది చిన్న, సన్నకారు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్వోఆర్ చట్టం, వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడం సరికాదన్నారు. ప్రధాన భూ సమస్యల పరిష్కారానికి ధరణిలో పూర్తిస్థాయిలో పరిష్కార మార్గాలు లేవని వివరించారు. వివిధ సమస్యలకు అనేక మాడ్యూల్స్ ఇవ్వడంతో బాధితులు ఏ మాడ్యూల్‌లో ఏ సమస్యకు దరఖాస్తు చేసుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని వెల్లడించారు. గతంలో తహశీల్దారు ఇచ్చిన ఆర్డర్‌పై ఆర్డీవోకు అప్పిలేట్ అధికారం ఉండేది. ఆర్డీవో ఇచ్చిన తీర్పును జేసీ సమీక్షించే అధికారం ఉండేది. అనంతరం ట్రిబ్యునల్, ప్రభుత్వానికి కూడా సమీక్షించే అధికారం ఉండేది. 2020 రెవెన్యూ చట్టంతో ఈ అప్పీల్ వ్యవస్థే రద్దయిందన్నారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన ధరణి కమిటీ అనేక సమస్యలు గుర్తించి అధికారాల వికేంద్రీకరణకు సిఫార్సు చేసినట్లు వెల్లడించారు.



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం

వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం

» బషీరాబాద్ మండలంలో అత్యధికంగా 4.7 సెం.మీ.

వికారాబాద్/పూడూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి జోరు వాన కురిసింది. సుమారు గంటకు పైగా కురిసిన వానతో రహదారులు జలమయమయ్యాయి. పొద్దంతా ఎండ వేడి, ఉక్కపోతతో ఇబ్బంది పడిన జిల్లా వాసులు.. రాత్రి కురిసిన భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో కాస్త ఉపశమనం పొందారు. అత్యధికంగా బషీరాబాద్ మండలంలో 4.7 సెం.మీ. వర్షం కురిసింది. మర్పల్లి మండలంలో 1.2 సెం.మీ., పూడూరులో 1.3 సెం.మీ., ధారూరులో 1 సెం.మీ., తాండూరులో 8.4 మి.మీ., మోమిన్‌పేట్‌లో 7 మి.మీ., పరిగిలో 5 మి.మీ. వర్షపాతం నమోదైంది. వికారాబాద్, యాలాల్, నవాబ్‌పేట్, కొడంగల్, పెద్దేముల్, బొంరాస్‌పేట్, దోమలో, కులకచర్ల, కోట్‌పల్లిలో మోస్తరు వాన పడింది. పూడూరు మండలం మన్నెగూడ సమీపంలో హైదరాబాద్-బీజాపూర్ హైవే మార్గంలో ఉన్న 33/11కేవీ విద్యుత్ స్తంభం విరిగి పడింది. శనివారం ఒక్కసారిగా ఈదురుగాలు వీయడంతో స్తంభం విరిగి జాతీయ రహదారిపై పడింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్తంభం రహదారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఏదుల నుంచి డిండి ఎత్తిపోతలకు నీరు

» దేవరకొండకు సాగునీటి సమస్య రానివ్వం

» రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలవనున్నాం

» రాహుల్ ప్రధాని అవుతారు: ఉత్తమ్

» దేవరకొండలో కాంగ్రెస్ సన్నాహక భేటీ

దేవరకొండ, ఏప్రిల్ 13: ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామని, తద్వారా దేవరకొండ పరిధిలో సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో శనివారం రాత్రి జరిగిన కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంటరీ సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లా



నల్లగొండ జిల్లా దేవరకొండలో కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్

డారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులందరం కలిసి ఒక జట్టుగా పని చేస్తున్నామని, తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. పదేళ్ల పాలనలో డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదని, తెలంగాణలో బీఆర్ఎస్ పని అయిపోయిందని ధ్వజమెత్తారు. అహంకారం, అవినీతి, పిచ్చి మాటల వల్లే కేసీఆర్‌కు ప్రజలు గుడ్‌బై చెప్పారని పేర్కొన్నారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు, ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, ఐదు లిఫ్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని తెలిపారు. 30 ఏళ్లుగా ప్రజా జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని, దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. గిరిజన విశ్వవిద్యాలయానికి అరకొరగా నిధులు కేటాయించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ.. ఉద్యోగాలను భర్తీ చేయడంలో విఫలమయ్యారని అన్నారు. ఎంపీగా గిరిజన రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో మాట్లాడి కేంద్రాన్ని నిలదీసినట్లు ఆయన గుర్తు చేశారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘువీర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ సీట్లు గెలుచుకోనుందని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. దేవరకొండ అభివృద్ధికి మంత్రిగా తాను ఎంతగానో కృషి చేశానని గుర్తు చేశారు. గోల్‌మాల్ మాటలు చెప్పి కేసీఆర్ ప్రజలను మోసం చేశాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. బీజేపీకి ఓట్లు అడిగే హక్కులేదని విమర్శించారు.

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే!

(మొదటిపేజీ తరువాయి)

పనితీరుకు ఆకర్షితులైన అన్ని వర్గాల వారు పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని హామీనిచ్చారు. మక్తల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత జలంధర్‌రెడ్డి, ఆ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి పులిమామిడి రాజు వేర్వేరుగా సీఎం సమక్షంలో ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జలంధర్‌రెడ్డి పార్టీలో చేరగా.. మంత్రి కొండా సురేఖ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, మెదక్ అభ్యర్థి నీలం మధు ఆధ్వర్యంలో పులిమామిడి రాజు చేరారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. సీఎం నివాసంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వీరు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ కూడా సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మిగౌడ్, గన్‌ఫౌండ్రి మాజీ కార్పొరేటర్ మమత గుప్తా కూడా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇటు బీఆర్ఎస్‌కు చెందిన ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కౌన్సిలర్ సల్లూరి నాగజ్యోతితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి సీఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటు జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి దానం నాగేందర్ సమక్షంలో ఫిలింనగర్ బసవతారకంనగర్‌కు చెందిన ముస్లింలు కాంగ్రెస్‌లో చేరారు.



మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మహిళలు

సీఎంను కలిసిన ఎంఆర్‌పీఎస్ నేతలు

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య కోర్ కమిటీ సభ్యులు సీఎం రేవంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వారు మీడియాకు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతునిస్తామనిసీఎం హామీనిచ్చారని వెల్లడించారు. ఎన్నికల తర్వాత పార్టీలో సముచిత స్థానం, రాజకీయ పదవులు ఇవ్వనున్నట్లు చెప్పారన్నారు.

దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్..

బడుగు బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు పాటుపడిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని సీఎం రేవంత్ కొనియాడారు. దేశ భవిష్యత్తును ముందుగానే ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించి ఆయన భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. అంబేడ్కర్ 133వ జయంతి (ఏప్రిల్ 14)ని పురస్కరించుకొని సీఎం ఆయనను గుర్తు చేసుకున్నారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగమే తెలంగాణకు జవజీవాలు పోసిందన్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతోందని వెల్లడించారు.

ఆస్తులపై కేటీఆర్ లైడిటెక్టర్ పరీక్షకు రావాలి: యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు అంటిన ఫోన్ ట్యాపింగ్ బురదను ఇతరులకు అంటించే ప్రయత్నం చేస్తున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసకర పరిపాలన చేశారని ఆరోపించారు. మంత్రుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని, దీనిపై లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమా అంటూ కేటీఆర్ దిగజారుడుగా మాట్లాడుతున్నారని, తమ మంత్రుల ఫోన్లను ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని చెప్పారు. మీ మనుషులు, మీ కుటుంబ సభ్యులపై నమ్మకం లేక ఫోన్ ట్యాపింగ్ చేసిన నీచ సంస్కృతి మీదని, ఇలాంటి సంస్కృతిని రాష్ట్రంలో ప్రవేశపెట్టిన మీ కుటుంబాన్ని ప్రజలు ఛీకొడుతున్నారన్నారు.

కేటీఆర్.. లైడిటెక్టర్ టెస్టుకు వస్తారా?

» ఎప్పుడో చెబితే ఏర్పాట్లు చేస్తాం: ఆది శ్రీనివాస్

» ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు: షబ్బీర్

హైదరాబాద్/కామారెడ్డి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లైడిటెక్టర్ పరీక్షలకు సిద్ధంగా ఉంటే.. దానికి సంబంధించిన ఏర్పాట్లు తాము చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పందించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. గతంలో డ్రగ్స్ వినియోగానికి సంబంధించి రేవంత్ వైట్ చాలెంజ్ విసిరితే గన్‌పార్కు వద్దకు రాకుండా కేటీఆర్ పారిపోయారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిజాలు బయటపడుతుంటే ఆయన మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. కేటీఆర్ అభినవ గోబెల్స్‌లాగా మారారని కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. తన ఫోన్ ట్యాప్ అయినట్లు అనుమానంతో ఫిర్యాదు ఇస్తే పరువునష్టం నోటీసు ఇచ్చిన కేటీఆర్.. కాంగ్రెస్ నేతలపై మాత్రం అనుమానం వ్యక్తం చేయవచ్చా అని మండిపడ్డారు. హైదరాబాద్ మైనారిటీ ఓటర్లు ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని ఓడించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ అన్నారు. కాంగ్రెస్‌తో ఎంఐఎం అవగాహన కుదుర్చుకుందని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను బలహీనపర్చడానికి బీజేపీ ఇలాంటి పుకార్లను పుట్టిస్తోందని ఆరోపించారు. మంద కృష్ణ మాదిగ వెనుక మాదిగలు లేరని మాజీ మంత్రి పుష్పలీల అన్నారు. ఆయన ఇప్పటికైనా అవకాశవాద రాజకీయాలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. మాదిగల కోసం ఆయనేం చేశారో చెప్పాలని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కేటీఆర్‌తో పాటు మరికొందరు బీఆర్ఎస్ కీలక నేతలు జైలుకెళ్లడం ఖాయమని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం నిందితురాలు ఎమ్మెల్సీ కవిత భూకుంభకోణాలు కూడా ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయని చెప్పారు. కామారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. రైతుల పట్ల బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు తాగునీటి సమస్య తలెత్తలేదు..

» రూ.100 కోట్లతో చేతిపంపులు, మోటార్లు, పైప్‌లైన్లకు మరమ్మతులు

» సమస్య వస్తే 24 గంటల్లో పరిష్కారం

» సందీప్‌కుమార్ సుల్తానియా



కొడంగల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా చెప్పారు. రూ.100 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 19,605 చేతి పంపులు, 14,708 సింగిల్ ఫేజ్ మోటార్లు, 605 హెచ్‌పీ 5 పంపుసెట్లు, మంచినీటి బావులు, 662 కిలోమీటర్ల ఇంట్రా పైపులైన్లకు మరమ్మతులు చేయించామని వెల్లడించారు. ఇప్పటిదాకా ఎక్కడా తాగునీటికి సమస్య తలెత్తలేదని అన్నారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లాలో శనివారం పర్యటించిన ఆయన.. తాండూరు సమీపంలోని కాగ్నా వాగు నుంచి కొడంగల్ ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేసే సంప్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా రూ.100 కోట్లతో వివిధ మరమ్మతు పనులు చేయించామని తెలిపారు. అందులో భాగంగా వికారాబాద్ జిల్లాకు మంజూరైన రూ.354 కోట్ల నిధులతో 1044 పంపుసెట్లు, 495 చేతిపంపులు మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 23,975 గ్రామాలకు 37,002 ఓహెచ్ఎస్ఆర్‌ల ద్వారా ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో ప్రత్యేకంగా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించామని సుల్తానియా పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రతీరోజు జిల్లా, మండల స్థాయి అధికారుల సమీక్షలతో అన్ని అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తున్నారని వెల్లడించారు. ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడినట్లు తమ దృష్టికి వస్తే 24 గంటల వ్యవధిలో ఆ సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. అవసరం ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. కాగ్నా వాగు పథకం నుంచి కొడంగల్, యాలాల్ మండలంలోని గ్రామాల నుంచి 2.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.. ప్రస్తుతం సరఫరా అవుతున్న తాగునీరు శ్రీశైలం బ్యాక్‌వాటర్, నాగార్జున సాగర్, ఎల్లంపల్లి తదితర ప్రాంతాల నుంచి కొనసాగుతుందన్నారు. విద్యుత్ సమస్య వల్ల తాగునీటి సరఫరాకు అంతరాయ ఏర్పడకూడదని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులను చేపట్టినట్లు తెలిపారు.

సమస్యలు ఏమున్నాయి?

» నేడు కాంగ్రెస్ అభ్యర్థులతో కేసీ భేటీ

» ఖమ్మం, కరీంనగర్‌లపై స్పష్టతకు చాన్స్

» ఖమ్మంపై భట్టితో దీపాదాస్, రేవంత్ భేటీ



హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం హైదరాబాద్‌కు వస్తున్నారు. పార్టీ అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో ఇక్కడి ఓ హోటల్‌లో ఆయన కీలక భేటీ నిర్వహించనున్నారు. అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో పాటుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా హాజరు కానున్నారు. ఈ భేటీలో ప్రధానంగా ప్రచారంలో గానీ, ఇతర విషయాల్లో గానీ అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలపైనే కేసీ వేణుగోపాల్ ఆరా తీయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. "నియోజకవర్గంలో ప్రచార సరళి ఎలా ఉంది? స్థానికంగా నాయకులు పూర్తి సహకారం అందిస్తున్నారా? ఏఐసీసీ నుంచి ఎలాంటి సహాయం కావాలి?" వగైరా ప్రశ్నలతో ఆరా తీయనున్నట్లు వెల్లడించాయి. అభ్యర్థులతో స్థానిక నాయకత్వాలకు ఏమైనా సమస్యలుంటే.. సదరు నేతలను పిలిచి మాట్లాడే అవకాశమూ ఉందంటున్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు చాల కీలకం అయినందున.. సమస్యలు ఏమున్నా అందరూ కలిసి కట్టుగా పని చేయాలని దిశా నిర్దేశనం చేయనున్నట్లు చెబుతున్నారు. టిక్కెట్టు దక్కని నేతలకు తగిన హామీ ఇచ్చే ఆస్కారమూ ఉందంటున్నారు.

ప్రచార వ్యూహంపైనా సమీక్ష!

రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లోనూ పార్టీ ప్రచార వ్యూహంపైన కేసీ వేణుగోపాల్ దిశా నిర్దేశనం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీల సభల ఏర్పాట్లు, వాటికి సంబంధించిన షెడ్యూల్ పైనా సమీక్ష చేసే ఆస్కారం ఉంది. ముఖ్యంగా పాంచ్ న్యాయ్ గ్యారెంటీలు, పార్టీ మేనిఫెస్టోని నెల రోజుల్లో ప్రతి ఇంటికీ ఎలా తీసుకెళ్లే అంశంపైనా సమీక్ష నిర్వహించనున్నట్లు చెబుతున్నారు. వివిధ ఏజెన్సీలతో ఏఐసీసీ నిర్వహించిన సర్వేలలో ఏ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఎలా ఉంది, ముఖాముఖీ పోరు ఎవరితో ఉందీ వివరించి.. పోల్ మేనేజ్‌మెంట్‌పైన నిర్దిష్టమైన సూచనలు చేసే ఆస్కారం ఉందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

మిగిలిన మూడింటిపైనా స్పష్టత

రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలకుగాను 14 సీట్లలో కాంగ్రెస్ పార్టీ.. అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మిగిలిన మూడు నియోజక వర్గాలపైనా... అభ్యర్థులతో కేసీ వేణుగోపాల్ భేటీ సమయానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఖమ్మం సీటును మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డికి ఇవ్వాలా.. లేక కమ్మ సామాజిక వర్గ నేతకు కేటాయించాలా అన్నదానిపై తర్జన, భర్జన నడుస్తోంది. ఖమ్మం టిక్కెట్టు ప్రసాదరెడ్డికే ఇస్తే.. కరీంనగర్ టిక్కెట్టును వెలమ లేక బీసీ సామాజిక వర్గ నేతలకు కేటాయించనున్నట్లు చెబుతున్నారు. ఖమ్మం టిక్కెట్టును కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతకే కేటాయిస్తే.. కరీంనగర్ సీటుకు ప్రవీణ్‌రెడ్డి పేరు ఖరారయ్యే అవకాశం ఉంది. ఈ రెండు సీట్లూ ఒక దానికి ఒకటి ముడిపడి ఉండడంతో ప్రకటన ఆలస్యం అవుతూ వస్తోంది. అయితే ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ టిక్కెట్లపైన అధిష్ఠానం నిర్ణయం తీసేసుకుందని, కేసీ వేణుగోపాల్ భేటీ ప్రారంభం అయ్యే సమయానికల్లా ప్రకటనా వస్తుందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒక వేళ ప్రకటన రాకున్నా కేసీ వేణుగోపాల్ హైదరాబాద్ టూర్‌లో వీటిపైన స్పష్టత రానున్నట్లు చెబుతున్నారు.

భట్టితో సీఎం రేవంత్ భేటీ

డిప్యూటీ సీఎం భట్టి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీతో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో ఖమ్మం సీటుపై అధిష్ఠానం ఆలోచన ఏంటన్నది భట్టి విక్రమార్కకు రేవంత్, దీపామున్షీ దాస్‌లు వివరించినట్లు, దానికి అలాగే భట్టి విక్రమార్క తన అభిప్రాయాన్నీ తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ కీలక నేతలు ఉన్న ఈ నియోజకవర్గంలో ఏకాభిప్రాయంతోనే నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానం భావిస్తే.. దీనికి సంబంధించిన చర్చలను హైదరాబాద్ టూర్‌లో కేసీ వేణుగోపాల్ చేస్తారనీ చెబుతున్నారు.

కాంటా పూర్తయిన 48 గంటల్లో డబ్బుల జమ

» మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొంటే ఉపేక్షించం

» దళారులను నియంత్రించేందుకే ఐరిస్

» పౌరసరఫరాల కమిషనర్ చౌహాన్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోళ్లు చేస్తే ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు. కాంటా అయిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. తాలు, కడ్తా పేరుతో తరుగు తీస్తే రైతులు టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. తాలు పేరుతో తూకంలో ఇష్టం వచ్చినట్లు వడ్లు తగ్గిస్తే సహించేది లేదన్నారు. శనివారం పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 7,174 కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 6,919 కేంద్రాలను ప్రారంభించామని, వీటి ద్వారా 1.87 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రైతులకు రూ.400 కోట్లు చెల్లించామని తెలిపారు. కాగా మొత్తం ధాన్యంలో బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు, ప్రజల అవసరాలకు పోను కొనుగోలు కేంద్రాలకు 75.40 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని చౌహాన్ వెల్లడించారు. కానీ గతేడాది కంటే ఈసారి 5 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గడంతో 60 లక్షల టన్నుల మేరకే కొనుగోలు కేంద్రాలకు రావొచ్చన్నారు.

ఎక్కువ ధర పెడితే అభ్యంతరం లేదు

ఇతర రాష్ట్రాల వ్యాపారులు రాష్ట్రంలో మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తున్నారని, కొన్ని మార్కెట్లలో రైతులకు క్వింటాల్‌కు రూ.2,500-2,900 వరకు రేటు వస్తుందని చౌహాన్ తెలిపారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పెడితే అభ్యంతరం లేదన్నారు. మన రైతులను మోసం చేసి తక్కువకు కొనుగోలు చేయకుండా, ఇతర రాష్ట్రాల రైతులు మన దగ్గర అమ్మకుండా కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా 54 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. సివిల్ సప్లయిస్, మార్కెటింగ్, అగ్రికల్చర్, రెవెన్యూ, పోలీస్ శాఖలన్నింటినీ సమన్వయం చేసుకొని పని చేస్తున్నామన్నారు. గన్నీ బ్యాగుల సేకరణలో గతంలో చాలా అవకతవకలు జరిగాయని, కొందరు అధికారులు అవసరం కంటే చాలా ఎక్కువగా గన్నీ బ్యాగులు కొనుగోలు చేశారని అవి చెదలు పట్టి పాడవుతున్నాయని చౌహాన్ తెలిపారు. ఓ అధికారి 2 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా.. 9 లక్షల గన్నీ బ్యాగ్‌లను కొనుగోలు చేశాడని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. గతంలో దళారీలు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరిగి అధిక ధరకు విక్రయించేవారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే వారని ఈ పరిస్థితులను మార్చేందుకు కంటిని స్కాన్ చేసే ఐరిస్ విధానాన్ని అమల్లోకి తెచ్చినట్లు చెప్పారు. జూన్ నెలాఖరు వరకు కొనుగోళ్లను పూర్తి చేస్తామని తెలిపారు.

క్వొరీలను పరిష్కరించాం

గతంలో కేంద్ర ఆహార మంత్రిత్వశాఖ పెట్టిన క్వొరీలన్నీ పరిష్కరించామని, ఆ కారణంగానే పెండింగ్‌లో ఉన్న రూ.1,200కోట్ల మేర కేంద్ర ప్రభుత్వ నిధులు రావడంతో పాటు కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సంబంధించిన రూ.393కోట్లు కూడా వచ్చాయని తెలిపారు. మిల్లర్లపై ఒత్తిడి చేయడంతో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.900 కోట్ల ధాన్యం తిరిగి వచ్చిందని వెల్లడించారు. మెదక్ జిల్లాకు చెందిన ఓ మిల్లర్ దుబాయ్‌కి పారిపోయాడని, ఎక్కడున్నా రప్పించి రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద వసూలు చేస్తామని తెలిపారు.

రాహిల్ బెయిల్ రద్దు కోరుతూ హైకోర్టుకు..?

» న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని పోలీసుల నిర్ణయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత షకీల్ కుమారుడు రాహిల్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాలని పోలీసులు నిర్ణయించారు. గత ఏడాది డిసెంబరులో ఓ రోజు రాత్రి ప్రజాభవన్ వద్ద బారికేడ్లను కారు ఢీకొన్న కేసులో రాహిల్ నిందితుడు. విదేశాలకు పారిపోయిన అయనను ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, కారు నడిపింది రాహిల్ అని.. ప్రమాదం జరిగిన తర్వాత ఆయన తప్పించుకుని.. డ్రైవర్‌ను బాధ్యుడిగా చూపారనే ఆరోపణలున్నాయి. ఇక, రెండేళ్ల క్రితం జూబ్లీహిల్స్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులోనూ రాహిల్ ఇలాగే తప్పించుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ కేసును రీ ఓపెన్ చేసి తిరిగి విచారించడానికి సిద్ధమవుతున్నారు. 2022న మార్చి 17న రోడ్ నంబర్-45లో ఓ కారు ఢీకొని రెండు నెలల చిన్నారి మరణించాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని యువకులు పారిపోయారు. ఆ కారులో రాహిల్ ఉన్నారు. అయితే, తానే కారు నడిపానని ఓ యువకుడు పోలీసులకు లొంగిపోయాడు.

ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారమిచ్చారంటూ

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌పై హైకోర్టులో పిటిషన్లు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 13: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారమిచ్చారంటూ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన వినయ్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఆశన్నగారి జీవన్‌రెడ్డిలు హైకోర్టులో పిటిషన్లు వేశారు. గత జనవరిలో వీరిద్దరూ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేయగా.. శనివారం ఇది వెలుగులోకొచ్చింది. గతేడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పైడి రాకేష్‌రెడ్డి పోటీ చేసి గెలిచారు. ఈ సందర్భంగా ఎన్నికల నామినేషన్‌లో దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆయన తప్పుడు సమాచారం ఇచ్చారని వినయ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో వినియోగించిన ఐదు వాహనాలపై గతంలో విధించిన జరిమానాలు చెల్లించకుండానే వాడారని, అలాగే ఆస్తుల విలువను తక్కువ చేసి చూపారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా ఎన్నికల అధికారులకు ఇచ్చిన అఫిడవిట్‌లో రాకేష్‌రెడ్డి తనపై ఉన్న కేసుల విషయం చూపలేదని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.

26 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రూ.26 కోట్ల మేర మోసాలకు పాల్పడిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ క్రైం డీసీపీ డి.కవిత కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కేరళలోని కాసర్‌గుడ్ ప్రాంతానికి చెందిన సీహెచ్ నౌషద్, సీహెచ్ అహ్మద్ కబీర్‌లకు 2021లో సైబర్ నేరగాళ్లకు ఖాతాలు సమకూర్చే ఇసాక్, తాహెర్ అలీ పరిచయమ్యారు. నాటి నుంచి నౌషద్, కబీర్ కూడా నకిలీ పత్రాలతో బ్యాంకు ఖాతాలు తెరవడంతోపాటు, కమిషన్ తీసుకొని సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చడం ప్రారంభించారు. ఆయా ఖాతాల్లో జమ అయిన డబ్బును డ్రా చేసి, వాటిని డాలర్లు, క్రిప్టో కరెన్సీగా మార్చి దుబాయ్‌లో ఉన్న ఖాతాలకు మళ్లించేవారు. క్రమంగా వారు అదే తరహాలో సైబర్ మోసాలు చేయడం ప్రారంభించారు. పార్ట్‌టైం జాబ్ పేరుతో పెట్టుబడులు పెట్టించి నగరవాసుల నుంచి 9.44 లక్షలు కాజేశారు. ఈ డబ్బు జమ అయిన ఖాతాలను గుర్తించిన సైబర్ క్రైం పోలీసులు కేసులో ప్రధాన నిందితులు నౌషద్, కబీర్‌లుగా గుర్తించి, వారిని అరెస్ట్ చేశారు. వారి బ్యాంకు ఖాతాల్లో రూ.26 కోట్లలావాదేవీలు జరిగినట్లు గుర్తించామని డీసీపీ కవిత తెలిపారు.

ఓల్డ్ మ్యాన్ కాదు.. గోల్డ్ మ్యాన్

» 90 ఏళ్ల వయసులో మూడు బంగారు పతకాలు

» ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మీ నరసింహారెడ్డి ఘనత



చిలకలగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆయన ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి. వయసు 90 ఏళ్ల దాకా ఉంటుంది. చిన్ననాటి నుంచి క్రీడలంటే ఆసక్తి ఉన్న ఆయన ఈ వయసులోనూ మూడు బంగారు పతకాలు సాధించి ఔరా అనిపించారు. శనివారం సికిందరాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హెల్తీ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ క్రీడల పోటీల్లో లక్ష్మీనరసింహారెడ్డి ఈ ఘనత సాధించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 300మంది సీనియర్ సిటిజన్లు ఈ పోటీల్లో పాల్గొనగా.. జావెలిన్ త్రో, హామర్ త్రో, డిస్కస్ త్రో పోటీల్లో లక్ష్మీనరసింహారెడ్డి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నల్లగొండలో జన్మించిన తాను.. ఇండియన్ ఆర్మీలో పని చేసి పదవీ విరమణ పొందానని తెలిపారు. ప్రస్తుతం బీహెచ్ఈఎల్‌లో ఉంటున్నానని చెప్పారు. మన దేశం తరఫున చైనా, కాంగో, నాగాలాండ్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ యుద్ధాల్లో పాల్గొన్నానని తెలిపారు.

ఉప్పల్‌లో ఐపీహెల్



స్టేడియం వెలుపల బారులుతీరిన అభిమానులు

(మొదటిపేజీ తరువాయి)

చూపిస్తోంది. ఎస్ఆర్‌హెచ్ నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి కారణంగా వేల రూపాయలు పెట్టి టికెట్లు కొనుగోలు చేసిన వారు మ్యాచ్ చూడడానికి ముందే నరకం చూడాల్సి వస్తోంది. ఉప్పల్ స్టేడియం వద్ద అభిమానులు ప్రధానంగా ఎదుర్కొనే సమస్య పార్కింగ్. వీవీఐపీలు, వీఐపీలు, పోలీసులు, ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులకు తప్ప, మరెవరికి స్టేడియం వెలుపల లేదా దరిదాపుల్లో వాహనాలు పార్కింగ్ చేసే సదుపాయం లేదు. దీంతో అభిమానులు రోడ్ల పక్కన, ఎక్కడపడితే అక్కడ తమ వాహనాలను వదిలేసి, రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మ్యాచ్ అయిపోయాక వచ్చి చూస్తే ద్విచక్ర వాహనాలు కిందపడిపోయి ఉండడం, కార్లకు ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించడం పరిపాటిగా మారింది. కనీసం రూ.30వేలు పెట్టి కార్పొరేట్ టికెట్లు కొనుగోలు చేసిన వారికైనా పార్కింగ్ సదుపాయం కల్పించకపోవడం దారుణమని అభిమానులు మండిపడుతున్నారు.

టికెట్లు లేకున్నా ఎంట్రీ..

హెచ్‌సీఏ క్లబ్ సెక్రటరీలు, పోలీసులు మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికి టిక్కెట్లు లేకుండా తమ వాళ్లను లోపలకి తీసుకెళ్లడంలో పోటీ పడుతున్నారు. గేట్ల వద్ద టికెట్లు స్కాన్ చేసి అనుమతించాల్సిన ఎస్ఆర్‌హెచ్ సిబ్బంది వీళ్లకు అడ్డు చెప్పడంలో విఫలమవుతుండడంతో టికెట్లు కొని, మ్యాచ్ చూడడానికి వచ్చిన వారికి అవస్థలు తప్పడం లేదు. అనధికారికంగా స్టేడియంలోకి ప్రవేశించిన వాళ్లు తమ సీట్లలో కూర్చొని లేవకపోవడంతో టిక్కెట్లు కొనుగోలు చేసినోళ్లు వారితో గొడవ పడాల్సి వస్తోంది. కొంతమందైతే స్టాండ్స్‌కు మధ్య ఉన్న మెట్లపైన, ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ కూర్చుని మ్యాచ్ చూస్తున్నా ఎస్ఆర్‌హెచ్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈనెల 5వ తేదీన చెన్నై సూపర్‌కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా, స్టేడియంలోని ఓ స్టాండ్‌లో సీటు నంబర్ 65 తర్వాత 67 ప్రత్యక్షమైంది. వీటి మధ్యలో ఉండాల్సిన 66వ సీటు నంబర్‌ను మరో చోట అతికించారు. దీంతో రూ.4,500 వెచ్చించి టికెట్ కొన్న 66వ నంబర్ సీట్‌లోని ప్రేక్షకుడు మ్యాచ్ ఆసాంతం నిలబడే చూడాల్సి వచ్చింది. తనకు ఎదురైన సమస్యపై అక్కడున్న ఎస్ఆర్‌హెచ్ సిబ్బందిని ప్రశ్నిస్తే, వారి నుంచి సమాధానం కరువైందని సదరు అభిమాని 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు.

కనీస సదుపాయాలు కరువు

వేల రూపాయలు ఖర్చు చేసి, స్టేడియంకు వచ్చిన ఫ్యాన్స్‌కు శుభ్రమైన తాగునీటిని అందించడంలోనూ ఎస్ఆర్‌హెచ్ విఫలమైంది. అసలే వేసవి కాలం కావడంతో దాహానికి అభిమానులు గొంతు తడుపుకోవడానికి వాటర్ బాటిల్స్‌పైన ఆధారపడాల్సిన పరిస్థితి. చెన్నై మ్యాచ్ సందర్భంగా బాత్‌రూమ్స్‌లో నీటి కొరత ఏర్పడింది. ఆ రోజు కాలకృత్యాలు తీర్చుకోవడానికి తమ వెంట వాటర్ బాటిల్స్ తీసుకెళ్లాల్సి వచ్చిందని పలువురు ఫ్యాన్స్ వాపోయారు. ఇక, కార్పొరేట్ బాక్సుల్లో పరిస్థితి మరీ దారుణం. ఈ బాక్సుల్లో కనీసం ఏసీ కూడా సరిగ్గా రావడం లేదని, నాణ్యమైన ఆహారం కూడా అందించడం లేదని ఫ్యాన్స్ మండిపడుతున్నారు. స్టేడియంలో ఉన్న గదులకు దాదాపు 200 టన్నుల ఏసీ ప్లాంట్ అవసరం కాగా, 80 టన్నుల సామర్థ్యమున్న ఏసీ ప్లాంట్‌తోనే నెట్టుకొస్తున్నారు. దీంతో మ్యాచ్ సమయంలో ఏసీలు మొరాయిస్తున్నాయని తెలుస్తోంది. ఇక, సాధారణ స్టాండ్స్ వద్ద ఉన్న ఫుడ్ స్టాళ్లలో ఏది కొనుగోలు చేయాలన్నా రెట్టింపు చెల్లించాల్సి వస్తోందని, అక్కడి ధరలు చూస్తే షాక్ కొడుతున్నాయని ఫ్యాన్స్ మొత్తుకుంటున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం ఇప్పటికైనా కళ్లు తెరిచి, కాసులపైన మాత్రమే కాకుండా, కనీస సదుపాయాల కల్పనపైనా దృష్టి పెట్టాలని అభిమానులు కోరుతున్నారు.

విపక్ష నేతలు రాజకీయ అజ్ఞానులు

» ఆ మాటంటే ఓ నాయకుడిని ఉద్దేశించే అన్నానని అనుకుంటారు: ప్రధాని

» ప్రముఖ గేమర్స్‌తో మాటామంతీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: ప్రతిపక్ష నేతలు అజ్ఞానులని ప్రధాని మోదీ ఎద్దేవాచేశారు. ఆ మాటంటే... ఒకానొక నాయకుడి (రాహుల్‌గాంధీ)ని ఉద్దేశించే అన్నానని అనుకుంటారని వ్యాఖ్యానించారు. వీడియో గేమ్స్‌కు పలువురు బానిసలు కావడంపై ఆవేదన వ్యక్తం చేశారు. శనివారమిక్కడ ప్రముఖ గేమర్స్ నమన్ మాథుర్ (మోర్టల్), అనిమేశ్ అగర్వాల్ (థగ్), అంశు బిష్ (గేమర్‌ఫ్లీట్), గణేశ్ గంగాధర్ (ఎస్‌క్రాసీ), తీర్థ మెహతా (జిసిటిర్థ్), పాయల్ ధరే (పాయల్ గేమింగ్), మిథిలేశ్ పటాంకర్ (మిత్‌ప్యాట్)తో ఆయన పిచ్చాపాటీగా సంభాషించారు. నైపుణ్య సంబంధ గేమ్స్‌కు, వేగంగా డబ్బు సంపాదించే అవకావమున్న గేమ్స్‌కు మధ్య తేడా ఏమిటని ఆరా తీశారు. వారు ఈ సందర్భంగా ఆయనకు 'నమో ఓప్' అని కొత్త పేరు పెట్టారు. 'ఓప్ అంటే.. అత్యంత శక్తిమంతుడు. దేశంలో మీరు అత్యున్నత శక్తిమంతుడు. మాలాగే మీరు కూడా జనరేషన్ జూమర్ (జెన్ జడ్) కాబట్టి.. ఇక నుంచి మా లైవ్‌స్ట్రీమ్ చాట్లలో మిమ్మల్ని నమో ఓప్ అని పిలుస్తాం' అని తెలిపారు. ఆయన వారితో కొన్ని స్వదేశీ గేమ్స్ కూడా ఆడారు. వీటికి తాను బానిస కాకూడదని కోరుకుంటున్నానని మోదీ నవ్వుతూ అన్నారు. థగ్ అగర్వాల్ తనను తాను పరిచయం చూసుకునే క్రమంలో తొట్రుపడ్డారు. కాస్త భయంగా మాట్లాడుతూ.. చాలా చిన్నప్పుడే చదవడం మొదలుపెట్టానని అన్నాడు . అతడి టెన్షన్ పోగొట్టడానికి ప్రధాని ప్రయత్నించారు. అందరూ చిన్నప్పుడే స్కూలుకు వెళ్తారని అనడంతో అందరూ పెద్దగా నవ్వేశారు. భుజ్ నుంచి వచ్చిన మరో గేమర్‌తో ఆయన మాట్లాడుతూ.. భుజ్‌లో ఈ గేమింగ్ ఫీవర్ ఎప్పుడొచ్చిందని ప్రశ్నించారు. 2019లో 'యే పబ్జీ వాలా క్యా హై' అని తాను చేసిన ప్రకటనను ప్రస్తావించారు. ఆయన చమత్కారాన్ని ముచ్చటపడిన గేమర్స్.. ఆయన్ను 'కూలెస్ట్ ప్రధాని', 'దేశంలోనే అతిపెద్ద ఇన్‌ఫ్లుయెన్సర్' అని అభివర్ణించారు. మోదీ తమతో మాట్లాడిన తీరు చూస్తే ఆయనకు, తమకు వయోభేదం ఉన్నట్లు అనిపించలేదని ఇంకో గేమర్ అన్నాడు. ప్రధాని స్పందిస్తూ.. 'వయోభేదం ఉందని ఎవరు అన్నారు? పెద్ద మనిషిలా కనిపించడానికి నేను నా జుట్టుకు తెల్లరంగు వేసుకుంటా' అని చలోక్తి విసరడంతో అందరూ నవ్వారు. కొన్ని గేమింగ్ టెక్నాలజీలను, వాటి పదాలను కూడా వారు ఆయనకు నేర్పించారు. ఈ సందర్భంగానే 'గ్రిండ్ (కష్టించి పనిచేయడం)', 'నూబ్(కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం)' వంటి పదాలను ప్రస్తావించారు. 'నూబ్ అనే పదం వినగానే ఆయన నవ్వు ఆపులేకపోయారు. ఆ మాట తానంటే ఓ నాయకుడి(రాహుల్)ని ఉద్దేశించి అన్నానని అందరూ అనుకుంటారని వ్యాఖ్యానించారు. ఓ గేమర్ స్పందిస్తూ... 'సర్! ఈ మాటకు మీకు ముందుగానే అర్థం తెలుసు కదా!' అని అన్నాడు. తన పాలనకు సంబంధించి గేమింగ్ పదాలను కూడా మోదీ వారికి నేర్పించారు. అందులో పీ2జీ2 ఒకటి.. 'ప్రొ పీపుల్.. గుడ్ గవర్నెన్స్' నుంచి ఈ పదాన్ని సృష్టించారు.

భూ వివాదంలో ముత్తిరెడ్డిపై కేసు

జనగామ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):జనగామ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై తాజాగా కేసు నమోదైంది. జనగామ మండలం చీటకోడూరుకు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు, జనగామ మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి కుమారుడు రాజేందర్‌రెడ్డికి సర్వే నంబర్ 214లో 5.27 ఎకరాల భూమి ఉంది. దీనికి అవతల వైపు మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి 3.11 ఎకరాలు కొనుగోలు చేశారు. అయితే, ముత్తిరెడ్డి భూమిలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో తన భూమి నుంచి దౌర్జన్యంగా దారి వేశారని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. డిసెంబరులో తన తండ్రి దశ దినకర్మ పూర్తయ్యే వరకు తాను బయటకు రాలేదని, ఇదే అదునుగా ముత్తిరెడ్డి దౌర్జన్యంగా దారి వేశారని జనగామ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేగాక.. ముత్తిరెడ్డి వేసిన దారిని తొలగించానంటూ తనపైన బీఆర్ఎస్ నాయకుడు బూరెడ్డి ప్రమోద్‌రెడ్డితో డిసెంబరు 20న తప్పుడు ఫిర్యాదు చేయించారని తెలిపారు. పక్కా ఆధారాలతో ఈ నెల 10న జనగామ ఏఎస్పీ అంకిత్‌కుమార్ శంఖ్వార్‌కు ఫిర్యాదు చేశానని వివరించారు. ఈ ఫిర్యాదు మేరకు ఏఎస్పీ చీటకోడూరులో శనివారం విచారణ జరిపారు. ముత్తిరెడ్డితో పాటు బూరెడ్డి ప్రమోద్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. కాగా, రాజేందర్‌రెడ్డిపై తాను దౌర్జన్యం చేశానని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ముత్తిరెడ్డి చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ఫోన్లో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు దౌర్జన్యం చేశానంటే జనాలు నమ్మేవారని, ఇప్పుడు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు.

బీర్.. నో స్టాక్!

రాష్ట్రంలోని వైన్ షాపుల్లో బీర్ల కొరత.. ఎండల నేపథ్యంలో భారీగా డిమాండ్



హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న వేళ చల్లని బీరు తాగి చిల్ అవుదామనుకునే మందు బాబులకు నిరాశ తప్పడం లేదు. రాష్ట్రంలోని చాలా వైన్‌షాపుల్లో బీరు దొరకడమే గగనమవుతోంది. ఒకవేళ దొరికినా... కోరుకున్న బ్రాండ్ లేకపోవడం, కూలింగ్ ఉండకపోవడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మద్యం ప్రియులు వాపోతున్నారు. బీరు సరఫరా, విక్రయాల మధ్య అంతరం పెరిగిపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. బ్రూవరీల యాజమాన్యాలకు సకాలంలో డబ్బులు చెల్లించడంలో బేవరేజెస్ కార్పొరేషన్ విఫలం కావడం వల్లే ఉత్పత్తిపై ప్రభావం పడుతున్నట్లు సమాచారం. ముడి సరుకు కొనుగోలుకు పెట్టుబడి సొమ్ము సరిపోక కొన్ని బ్రూవరీలు ఉత్పత్తిని తగ్గించుకుంటున్నట్లు తెలిసింది. వాస్తవానికి రాష్ట్రంలో బీరును తయారు చేసే బ్రూవరీలు ఆరు ఉన్నాయి. వీటికి నెలకు 72లక్షల కేసుల బీరును తయారు చేసే సామర్థ్యం ఉంది. అంటే.. రోజుకు 2.50లక్షల కేసుల బీరును తయారు చేయవచ్చు. కానీ... ప్రస్తుతం రోజుకు 1.50 లక్షల కేసుల చొప్పున నెలకు 45లక్షల కేసుల బీరు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు.. ఇది రాష్ట్రంలో నెలకొన్న డిమాండ్‌కు సరిపోవడం లేదు. సాధారణంగా తెలంగాణలో బీరు వినియోగం ఎక్కువగా ఉంటుంది. వేసవి కాలంలోనైతే చాలా మంది లిక్కర్‌కు బదులు చల్లని బీరును తాగడానికే ఇష్టపడతారు. అందుకే మార్చి నుంచి మే వరకు బీరు డిమాండ్ అమాంతం పెరిగిపోతుంది. మార్చి నెలలో రాష్ట్రంలోని వైన్ షాపులు, బార్లలో 56,28,264 కేసుల బీరును విక్రయించారు. అంటే... ఆ నెలలో 10 లక్షలకు పైగా కేసుల బీరు కొరత ఏర్పడింది. ఏప్రిల్, మే నెలల్లోనూ 55లక్షల కేసులపైగా బీరు విక్రయాలు జరగొచ్చని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ... దానికి తగ్గట్లుగా ఉత్పత్తి లేకపోవడంతో మద్యం ప్రియులకు బీర్లు దొరకడం లేదు. కొన్ని వైన్ షాపుల వద్ద తరచు 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయి. కొన్ని బ్రాండ్ల బీరు రావడం లేదని షాపుల యజమానులు చెబుతున్నారు. కొరత నేపథ్యంలో ఒక మద్యం డిపోలో ఉండే సరుకును దాని పరిధిలోని వైన్ షాపులు, బార్లకు 'కోటా' పద్ధతిలో సరఫరా చేస్తున్నారు. ఎక్కువ సేల్స్ ఉండే షాపునకు కొంత ఎక్కువ మొత్తంలో, తక్కువ సేల్స్ ఉండే షాపునకు కాస్త తక్కువ బీరును సరఫరా చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వైన్‌షాపుల ద్వారా రోజుకు 80 వేల కేసుల బీరును విక్రయిస్తుంటారు. ప్రస్తుతం వీరికి 50-60 వేల కేసుల వరకే సరఫరా అవుతున్నట్లు తెలిసింది.

డబ్బు చెల్లించకపోవడమే కారణమా?

బీరును సరఫరా చేసినందుకు బ్రూవరీలకు ఎప్పటికప్పుడు కార్పొరేషన్ సొమ్ము చెల్లించాలి. కానీ, డబ్బు చెల్లింపులో కార్పొరేషన్ తాత్సారం చేస్తుందని బ్రూవరీల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. దాదాపు రూ.1000-1200 కోట్ల వరకు కార్పొరేషన్ బకాయి పడిందని చెబుతున్నాయి. ఈ సొమ్మును చెల్లించాలంటూ ఉన్నతాధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నాయి. సొమ్ము చెల్లించకపోవడంతో కొన్ని బ్రూవరీలు పెట్టుబడి సొమ్ము లేక ఉత్పత్తిని తగ్గించుకుంటున్నాయని సమాచారం.

ఇంటర్ ఫీజులు భారీగా పెంపు

» ఈ ఏడాది ఫీజులు 30-50శాతం పెంచిన వైనం

» అడ్డగోలుగా పెంచిన కార్పొరేట్ కాలేజీలు

» కొన్ని కాలేజీల్లో రూ.2.5 లక్షల ఫీజు

» పదో తరగతి ఫలితాలు రాకముందే అడ్మిషన్లు



హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్పొరేట్ జూనియర్ కళాశాలల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోవడంతో ఇంటర్ విద్య భారంగా మారుతోంది. ఈ ఏడాది ఫీజులను 30 నుంచి 50శాతం వరకు పెంచేశారు. కొన్ని కాలేజీల్లో ఏడాదికి ఏకంగా రూ.2.5 లక్షల ఫీజును వసూలు చేస్తున్నారు. ఈ స్థాయిలో ఫీజులు వసూలు చేస్తుండటంతో మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం నానాకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రంలో పదోతరగతి పరీక్షల ఫలితాలు ఇంకా విడుదల కానేలేదు. ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు ప్రకటించలేదు. రాష్ట్రంలోని కాలేజీల గుర్తింపు ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. వీటితో సంబంధం లేకుండానే కొన్ని ప్రైవేట్ కాలేజీలు పెద్దఎత్తున అడ్మిషన్లను తీసుకుంటున్నాయి. కొన్ని కాలేజీల్లో సెకండ్ ఇయర్ క్లాసులను కూడా మొదలెట్టారు. షెడ్యూల్ విడుదల చేసే వరకు అడ్మిషన్లు చేయవద్దని, ఈసారి వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహించవద్దని ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించినా కొన్ని కాలేజీలు పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది ఫీజుల పెంపు విషయానికి వస్తే... క్రితం ఏడాది కొన్ని కాలేజీల్లో ఫీజు రూ.60వేలు ఉండగా.. ఈసారి రూ.90వేలకు పెంచారు. మరికొన్ని కాలేజీలు రూ.80వేల నుంచి రూ.1.20లక్షల వరకు పెంచాయి. కొన్ని బడా కార్పొరేట్ కాలేజీల్లో ఫీజును ఏకంగా రూ.2.5లక్షల వరకు పెంచారు. ఐఐటీ పేరిట కొన్ని కాలేజీలు భారీగా ఫీజును పెంచేశాయి. ఈ స్థాయిలో ఫీజులు వసూలు చేస్తున్నా నియంత్రణకు ప్రభుత్వం తరఫు నుంచి చర్యలు కానరావడం లేదు. తొమ్మిదేళ్ల క్రితం జారీ చేసిన జీవో నంబరు 102 ప్రకారం ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కు రూ.17,060, సెకండ్ ఇయర్‌కు రూ.19,040 ఫీజు వసూలు చేయాలి. ప్రతి ఏడాది ఈ ఫీజును ఖరారు చేయాల్సి ఉంది. అయితే తొమ్మిదేళ్ల నుంచి ప్రభుత్వం ఈ ఫీజును ఖరారు చేయకపోవడంతో ప్రైవేట్ కాలేజీలు ఇష్టారాజ్యంగా పెంచుకుంటూపోతున్నాయి. గత ఏడాది నార్సింగిలోని ప్రైవేట్ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్యతో అప్పుడున్న ప్రభుత్వం కొంత హడావుడి చేసింది. అడ్మిషన్లు, ఫీజుల వసూలు వంటి అంశాలపై నిపుణుల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. తర్వాత ఆ విషయాన్ని అటకెక్కించారు. ఫీజులపై ప్రభుత్వ పరంగా స్పష్టతలేకపోవడంతో ప్రైవేట్ కాలేజీలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

ఎంసెట్, ఐఐటీ కోచింగ్‌ల పేరుతో..

ఎంసెట్, ఐఐటీ వంటి కోచింగ్‌ల పేరు చెప్పి కూడా కొన్ని కాలేజీలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు దండుకుంటున్నాయి. కొన్ని కాలేజీలు హాస్టల్ వసతులను కల్పిస్తున్నాయి. ఇలాంటి కాలేజీలు ఒక్కో విద్యార్థి నుంచి ఏడాదికి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నాయి. ఈ కాలేజీలపై అధికారుల నియంత్రణ కొరవడుతోంది. మరోవైపు నగరంలో చాలా కాలేజీలకు అనుమతి కూడా లేదు. ఒక ప్రాంతంలో ఒక కాలేజీకి అనుమతి తీసుకుని దానికి అనుబంధంగా పలు బ్రాంచీలను కొనసాగిస్తున్నాయి. కాలేజీకి అనుమతి ఉన్న ప్రాంతంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా బ్రాంచీలను నెలకొల్పి కాలేజీలను నడిపిస్తున్నారు. ఇలాంటి గుర్తింపు లేని కాలేజీలపై అధికారులు తగు చర్యల్ని తీసుకుంటే విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా గ్రేటర్ హైదరాబాద్, ఇతర మునిసిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలను మూడు కేటగిరీలుగా విభజించి, ఫీజులను ఖరారు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ కార్పొరేట్ కాలేజీలకు అనుగుణంగా గత ప్రభుత్వం వ్యవహరించిందని ఇంటర్ కాలేజీల అసోసియేషన్ ప్రతినిధి గౌరి సతీష్ అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి ఫీజుల నియంత్రణపై ప్రస్తుత ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No. 76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 14 ఏప్రిల్ 2024



కొన్ని కాంబినేషన్ల పై పరిశ్రమలో, ప్రేక్షకుల్లోనూ క్రేజ్. ముఖ్యంగా హీరో హీరోయిన్ల కాంబినేషన్ అయితే ఆ లెక్కే వేరు. అధికారిక ప్రకటన రాకమునుపే అటు హీరోలు, ఇటు హీరోయిన్ల అభిమానుల ఆరాలతో కలయిక వార్తలు పతాక శీర్షికలెక్కుతాయి. అయితే అవి కొన్నిసార్లు నిజం అయి అభిమానులను అలరిస్తాయి. మరికొన్ని సార్లు ఆ కాంబినేషన్ సెట్ అవ్వదు. అభిమానుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న కొత్త జంటలు అంటూ ఇప్పుడు పరిశ్రమలో వినిపిస్తున్న కొన్ని కాంబినేషన్ల సంగతులు ఇవి...



కలయిక కుదిరిందా... వేడుకే ఇక!

సీన్‌లోకి సమంత

'పుష్ప' చిత్రంలో 'ఊ అంటావా మావా' అంటూ తనదైన శైలిలో నర్తించి అభిమానులను మెప్పించారు అల్లు అర్జున్, సమంత జోడీ. తన సినిమాల్లో ప్రత్యేక గీతాలకు పెద్దపీట వేసే దర్శకుడు సుకుమార్. ఇప్పుడు 'పుష్ప 2'లోనూ ఓ ప్రత్యేక గీతం ప్లాన్ చేశారట. ఈ పాట కోసం బాలీవుడ్ కథానాయిక ఊర్వశీ రౌతేలాను రంగంలోకి దింపనున్నారని మొదట వార్తలు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం సమంత సీన్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. పుష్ప సినిమాకు 'ఊ అంటావా మావా' సాంగ్... అందులో సమంత, బన్నీ స్టెప్పులు ప్రత్యేకార్షణగా నిలిచాయి. ఇప్పుడు కొనసాగింపు చిత్రంలోనూ వీరి కలయిక ప్రత్యేకంగా ఉండబోతోందని తెలుస్తోంది.

'పుష్ప 2: ది రూల్' చిత్రం తర్వాత అల్లు అర్జున్ చేయబోయే సినిమాపై ఇప్పటివరకూ అధికారిక ప్రకటన రాలేదు. కథ కుదిరితే 'పుష్ప 3' చేసే అవకాశముందని బన్నీ ఓ సందర్భంలో చెప్పారు. కానీ ఈ మధ్యన అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ సినిమా ఒకటి ఉండబోతోందనే వార్త బలంగా వినిపిస్తోంది. అయితే తాజా సమాచారం ప్రకారం అర్జున్, సమంతల కలయిక ప్రత్యేక గీతానికే పరిమితమవుతుందా లేదా అట్లీ దర్శకత్వంలో ఏకంగా సినిమానే వస్తుందా అనేది తెలియాలంటే కొంతకాలం ఆగాల్సిందే. హిందీలో 'జవాన్'తో భారీ హిట్ అందుకున్నారు అట్లీ. ఆయన గతంలో విజయ్ హీరోగా రూపొందించిన 'తేరీ' చిత్రంలో సమంత కథానాయికగా నటించారు. ఆ అనుబంధంతోనే ఇప్పుడు అట్లీ మరోసారి సమంతను కథానాయికగా తీసుకోబోతున్నారని కోలీవుడ్ పరిశ్రమలో వినిపిస్తోంది.



అవకాశం అందుకున్నారా?

ఓడలు బళ్లు అవడం అనే సామెత టాలీవుడ్‌లో పూజాహెగ్డే కెరీర్‌కు చక్కగా సరిపోతుంది. చూస్తుండగానే అగ్రకథానాయికగా ఆమె స్టార్‌డమ్‌కు గండిపడడమే కాదు వరుస అపజయాలతో అవకాశాలు సైతం కరవయ్యాయి. ఒకప్పుడు అగ్రహీరోలు ఏరీ కోరి తమ సినిమాల్లో కథానాయికగా పూజాను ఎంచుకున్నారు. కానీ మధ్యలో ఆమె బాలీవుడ్‌కు వెళ్లడం కూడా ఇక్కడ పరిశ్రమకు దూరమవడానికి కారణం. ప్రస్తుతం షాహిద్‌కపూర్‌తో 'దేవా' చిత్రం చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఎట్టకేలకు పూజా హెగ్డే రీ ఎంట్రీకి సిద్ధమవుతున్నారని సమాచారం. గతంలో 'ఓ లైలా కోసం' చిత్రంలో ఆమె నాగచైతన్యతో జోడీ కట్టారు. ఇప్పుడు మళ్లీ నాగచైతన్యతో కలసి నటించబోతున్నారని సమాచారం. నాగచైతన్య హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో పూజాను కథానాయికగా ఎంపిక చేసినట్లు టాక్. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

యశ్‌కు సోదరిగా కరీనా?

'కేజీఎఫ్'తో ఓవర్‌నైట్ స్టార్‌గా ఎదిగారు యశ్. ఈ సిరీస్ తర్వాత ఆయన నటిస్తున్న చిత్రం 'టాక్సిక్'. గీతూమోహన్ దాస్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ అగ్ర కథానాయిక కరీనా కపూర్ ఓ హీరోయిన్‌గా నటించనున్నారనే విషయం కొన్నాళ్ల క్రితం ప్రచారంలోకి వచ్చింది. అయితే ఆమె హీరోయిన్‌గా కాదు యశ్‌కు సోదరి పాత్రలో నటిస్తున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇది నిజామా కాదా తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే దాకా ఆగాల్సిందే. కరీనాతో పాటు గతంలో పలువురు హీరోయిన్ల పేర్లు ఈ సినిమా విషయంలో వినిపించాయి. శ్రుతీహాసన్, సాయిపల్లవి, కియారా అద్వానీ పేర్లు వినిపించినా ఆ అవకాశం ఎవరికి దక్కుతుందో.





కొత్త జంట

'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో కథానాయకుడిగా సత్తా చాటారు తేజ సజ్జ. రవితేజతో 'ఈగల్' లాంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఖాతాలో వేసుకున్నారు దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని. ఇప్పుడు వీరిద్దరి కలయికలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో కథానాయికగా రితికా నాయక్ పేరు పరిశీలనలో ఉంది. విష్వక్‌సేన్ నటించిన 'అశోకవనంలో అర్జున కల్యాణం' చిత్రంలో హీరోయిన్‌గా ఆమె చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. నాని 'హాయ్ నాన్న'లోనూ మెరిశారు. తన పాత్ర నచ్చడంతో తేజ సజ్జ చిత్రంలో నటించేందుకు ఆమె అంగీకరించారని తెలుస్తోంది. ఈ చిత్రంలో మంచు మనోజ్ మరో హీరోగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది.

విజయ్ నాయిక సస్పెన్స్?

'ఖుషీ' చిత్రంలో సమంతతో జత కలిశారు విజయ్ దేవరకొండ. 'ఫ్యామిలీస్టార్' చిత్రంలో మృణాళినీ ఠాకూర్‌తో ఆడి పాడారు. ఈ సారి ఆయనకు సరిజోడీ ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ ఓ చిత్రం చేస్తున్నారు. తొలుత శ్రీలీలను ఎంపిక చేసినా కొన్ని కారణాల వల్ల ఆమె తప్పుకొన్నారు. ఆ తర్వాత పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించాయి.

అయితే ఇప్పుడు బాలీవుడ్ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే పేరు బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె రవితేజతో 'మిస్టర్ బచ్చన్' చిత్రంలో నటిస్తున్నారు. త్వరలోనే భాగ్యశ్రీ పేరు అధికారికంగా ప్రకటించవచ్చని టాక్.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఎనీవన్ బట్ యూ	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 15
రెబల్ మూన్ 2	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 19
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
థీఫ్ డిటెక్టివ్ 1958	కొరియన్ సిరీస్	ఏప్రిల్ 19
సైరన్	తెలుగు డబ్బింగ్	ఏప్రిల్ 19
ఆహా...		
మై డియర్ దొంగ	తెలుగు చిత్రం	ఏప్రిల్ 19
బుక్ మై షో		
డ్యూన్ 2	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 16
లయన్స్ గేట్ ప్లే		
డ్రీమ్ సినారియో	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 19
ద టూరిస్ట్	వెబ్‌సిరీస్ 2	ఏప్రిల్ 19
జియో సినిమా		
పాన్ ఒండ్రు కండ్రేన్	తమిళ చిత్రం	ఏప్రిల్ 14
ది సింపథైజర్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 14
ఆర్టికల్ 370	హిందీ చిత్రం	ఏప్రిల్ 19







స్ఫూర్తిదాయకమైన ఆయన కథ..

ఇప్పుడు సినిమాగా!

పేరొందిన వ్యక్తుల జీవిత కథలు సినిమాగా రావడం ఇప్పుడు సర్వ సాధారణమైపోయింది. వీటిలో ఎక్కువగా సినిమా తారలు, రాజకీయనాయకులు, క్రీడాకారులవే ఉంటున్నాయి. ఇలాంటి సమయంలో.. 'శ్రీకాంత్' పేరుతో బాలీవుడ్‌లో రూపొందిన చిత్రం ట్రైలర్ విడుదలైంది. అయితే ఇప్పటివరకు వచ్చిన బయోపిక్‌లకు ఈ బయోపిక్‌కు ఎంతో తేడా ఉంది. కారణమేంటంటే పుట్టుకతోనే అంధుడైనా స్వశక్తితో పైకెదిగి.. వ్యాపార వేత్తగా సరికొత్త చరిత్ర సృష్టించిన ఓ వ్యక్తి జీవిత కథ ఇది. ఆ వ్యక్తి మరెవరో కాదు శ్రీకాంత్ బొల్లా. బాలీవుడ్‌లో ప్రస్తుతం అందరి దృష్టి ఈ చిత్రంపైనే ఉంది. ఇటీవలే ఈ చిత్రం ట్రైలర్ విడుదలై అందరినీ ఆకట్టుకుంటోంది. రాజ్‌కుమార్ రావు ఇందులో టైటిల్ రోల్ పోషించారు. అసలు ఎవరీ శ్రీకాంత్..

ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో పుట్టారాయన. పుట్టుకతోనే అంధుడైన ఆయన ఇలా ఎందరికో ఆదర్శవంతుడు అవుతారని అప్పట్లో ఎవరికీ తెలీదు. ఈ విషయం తెలీక ఇరుగు పొరుగు వాళ్లు ఆ పిల్లాడిని వదిలేయ్యమని అతని తల్లితండ్రులకు సలహా ఇచ్చినా అవేమి పట్టించుకోకుండా శ్రీకాంత్‌ను మరింత పట్టుదలతో పెంచారు. మ్యాథ్య్, సైన్స్ అంటే శ్రీకాంత్ బొల్లాకు అమితమైన ఇష్టం. ఆ కోరికతోనే ఐఐటీలో ఈ సబ్జెక్ట్స్‌ను ఎంపిక చేసుకున్నారు. కానీ శ్రీకాంత్ బొల్లాను ఇండియాలోని టాప్ 2 ఐఐటీలు తిరస్కరించాయి. దానిక్కారణం డయాగ్రామ్స్, గ్రాఫ్స్‌తో కూడిన ఈ విద్యావిధానానికి అంధుడైన శ్రీకాంత్ సరిపోడని ఐఐటీ నిర్వాహకులు అనుకోవడమే. 'ఐఐటీలు నన్ను వద్దనుకుంటే..ఐఐటీలు కూడా నాకు వద్దు' అనుకున్న శ్రీకాంత్ అమెరికాలోని మసాచుయేట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చేరి బిజినెస్ మేనేజిమెంట్‌లో పట్టా పొందిన మొదటి అంధ వ్యక్తిగా నిలిచారు. ఇలా జీవితంలో ఇప్పటికే ఎన్నో ఘనతలు సాధించిన శ్రీకాంత్ అసలు సిసలు జీవిత ధ్యేయం భారతదేశానికి మొదటి అంధ రాష్ట్రపతి కావడమే. కాగా, మే 10న విడుదలవుతోన్న ఈ బయోపిక్‌కు తుషార్ హిరనందని దర్శకత్వం వహించారు. భూషణ్ కుమార్, కృష్ణన్‌కుమార్ నిర్మించారు.




"మేనేజ్ చేయడం నా చేతుల్లోనే ఉంది. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో నా నైపుణ్యాలను ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవచ్చు. వ్యాపార ప్రపంచంలో నా ఆలోచనలు అనుకున్న రీతిలో సాకారమైతే.. ఎంతో మందికి నేను సాయం చేసినట్లే" అంటారు శ్రీకాంత్ బొల్లా. వ్యాపారవేత్తగా, సామాజిక సేవకుడిగా, ప్రపంచ ప్రసిద్ధి చెందిన బొల్లాంట్ ఇండస్ట్రీస్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సీఈఓ).. బహుముఖ ప్రజ్ఞాశాలిగా అందరి ప్రశంసలందుకుంటున్న ఆయన జీవితంలో ఎన్నో అటుపోట్లు ఉన్నాయి. అడుగడుగునా ఎన్నో సవాళ్లను దాటుకొని శ్రీకాంత్ ఎదిగిన వైనం ఎందరికో స్ఫూర్తిదాయకం.

తండ్రయిన మనోజ్

మంచు మనోజ్ అభిమానులకు తీపి కబురు అందించారు. మనోజ్,మౌనిక దంపతులకు శనివారం ఆడబిడ్డ జన్మించింది. ఈ విషయాన్ని మనోజ్ సోదరి మంచు లక్ష్మి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించారు. "దేవతల ఆశీర్వాదంతో ఒక చిన్న దేవత మా జీవితాల్లోకి వచ్చింది. ఈ శుభ సందర్భాన్ని మీతో పంచుకోవడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ఈ పండంటి ఆడబిడ్డను మేము 'ఎం ఎం పులి' అని పిలుస్తాం" అని పోస్ట్ చేశారు.





రూ. 45 కోట్లతో

ఇల్లు కొన్న పూజ

ఏడాది క్రితం వరకూ గ్లామర్ హీరోయిన్‌గా హల్‌చల్ చేసిన పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డేకు ఇప్పుడు తెలుగులో ఒక్కటంటే ఒక్క సినిమా కూడా లేదు. మహేశ్‌బాబు 'గుంటూరు కారం', పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాలు చేజారి పోవడంతో ఆమె డైరీ ఒక్కసారిగా ఖాళీ అయిపోయింది. ఆమె డేట్స్ కోసం నిర్మాతలందరూ అడుగుతుంటే ఏ సినిమా చేయాలా అనే కన్‌ఫ్యూజన్ ఒకప్పుడు పూజాకు ఉండేది. ఇప్పుడు ఏ సినిమా వస్తుందా అని ఆమె ఎదురు చూడాల్సి వస్తోంది. కాకపోతే తెలుగులో ఎప్పుడైతే అవకాశాలు తగ్గాయో అప్పుడే పూజా తెలివిగా బాలీవుడ్ మీద దృష్టి పెట్టి కొన్ని సినిమాలు చేజిక్కించుకుంది. షాహిద్ కపూర్ సరసన ఆమె నటించే 'దేవా' చిత్రం త్వరలో పట్టాలెక్కనుంది. 'దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి' అంటారు కదా అందుకే ఇప్పుడు పూజా ఆ పనిలో ఉంది. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో రూ. 45 కోట్లు పెట్టి ఓ ఇల్లు కొనేసింది. నాలుగు వేల చదరపు అడుగుల స్థలం కలిగిన ఇల్లు అది. సీ ఫేసింగ్ ఉండడం ఈ ఇంటి ప్రత్యేకత. ముంబైలో పూజాకు ఇప్పటికే ఓ ఫ్లాట్ ఉంది. అయినా ఖరీదైన బాంద్రా ప్రాంతంలో ఇల్లు ఉండడం సినిమా వాళ్లకు ఓ కల కనుక పూజా కూడా ధైర్యం చేసి అక్కడ ఇల్లు కొనేసింది.. మంచి రోజు చూసుకుని త్వరలో ఆ ఇంట్లోకి షిఫ్ట్ అవడానికి పూజా ఏర్పాట్లు చేసుకుంటోంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 14 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ వర్సిటీలో ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ)- రెగ్యులర్ మోడ్‌లో అందిస్తున్న పలు అకడమిక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, ప్రొఫెషనల్ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రోగ్రామ్‌ను అనుసరించి ఎంట్రెన్స్ టెస్ట్/అకడమిక్ మెరిట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నాలుగేళ్ల డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మాత్రం ఎన్‌టీఏ నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్ మెయిన్ క్యాంపస్ సహా వర్సిటీ ఆధ్వర్యంలోని శాటిలైట్ క్యాంపస్‌లు, టీచర్ ఎడ్యుకేషన్ కాలేజీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు.

- వెబ్‌సైట్: www.manuu.edu.in



ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇచ్చే ప్రోగ్రామ్‌లు

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు: ఉర్దూ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, దక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ ఉర్దూ కల్చర్ స్టడీస్, కంపారటివ్ స్టడీస్, లా, సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇన్‌క్లూజన్ పాలసీ, లాంగ్వేజ్ టీచింగ్ ఇన్ మదర్సా

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్(కంప్యూటర్ సైన్స్), ఎంఈడీ, మాస్టర్ ఆఫ్ లా(ఎల్‌ఎల్‌ఎం)

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీటెక్(కంప్యూటర్ సైన్స్), బీటెక్-కంప్యూటర్ సైన్స్(లేటరల్ ఎంట్రీ), ఎల్‌ఎల్‌బీ, బీఏ ఎల్‌ఎల్‌బీ ఆనర్స్, బీఈడీ

ప్రొఫెషనల్ డిప్లొమాలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్‌ఈడీ), పాలిటెక్నిక్ డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటొమొబైల్, అప్పారెల్ టెక్నాలజీస్), పాలిటెక్నిక్ డిప్లొమా లేటరల్ ఎంట్రీ

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

అకడమిక్ మెరిట్ ద్వారా అడ్మిషన్స్ ఇచ్చే ప్రోగ్రామ్‌లు

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ(ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, అరబిక్, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంఎస్‌డబ్ల్యు(సోషల్ వర్క్), ఎంఏ జేఎంసీ(లేటరల్ ఎంట్రీ), ఎంకాం, ఎమ్మెస్సీ(మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), ఎం ఒకేషనల్(ఎంఎల్‌టీ, ఎంఐటీ), ఎంసీఏ(లేటరల్ ఎంట్రీ)

ఫుల్ టైమ్ పీజీ డిప్లొమా: టీచింగ్ ఇంగ్లీష్

పార్ట్ టైమ్ పీజీ డిప్లొమాలు: ఫంక్షనల్ ఉర్దూ, హిందీ అండ్ ట్రాన్స్‌లేషన్, ప్రొఫెషనల్ అరబిక్, ట్రాన్స్‌లేషన్

పార్ట్ టైమ్ డిప్లొమాలు: తహసీన్-ఇ-గజల్, అరబిక్, పర్షియన్, పాష్తో, ఫ్రెంచ్, రష్యన్, ఇస్లామిక్ స్టడీస్

పార్ట్ టైమ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఉర్దూ, ప్రొఫిషియెన్సీ ఇన్ అరబిక్, పర్షియన్, పాష్తో, ఫ్రెంచ్, రష్యన్, తెలుగు, కశ్మీరీ, టర్కిష్

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 30

ఇతర క్యాంపస్‌లు అందిస్తున్న ప్రోగ్రామ్‌లు

లఖ్‌నవూ క్యాంపస్: (ఎంఏ/పీహెచ్‌డీ)(ఉర్దూ, ఇంగ్లీష్, అరబిక్, పర్షియన్)

శ్రీనగర్ క్యాంపస్: (ఎంఏ/పీహెచ్‌డీ)(ఎకనామిక్స్, ఇస్లామిక్ స్టడీస్, ఉర్దూ, పర్షియన్, ఇంగ్లీష్)

కాలేజెస్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్-భోపాల్(మధ్యప్రదేశ్), దర్భంగా(బిహార్): బీఈడీ, ఎంఈడీ, పీహెచ్‌డీ ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు

కాలేజెస్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్-శ్రీనగర్(జమ్మూ అండ్ కశ్మీర్), అసన్‌సోల్(పశ్చిమ బెంగాల్), ఔరంగాబాద్(మహారాష్ట్ర), సంభల్(ఉత్తరప్రదేశ్), నుహ్(హరియాణా), బీదర్(కర్ణాటక): బీఈడీ ప్రోగ్రామ్

పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ డిప్లొమాలు: హైదరాబాద్ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ); దర్భంగా, బెంగళూరు క్యాంపస్‌లలో డిప్లొమా(సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్); కడప-ఏపీ క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, అప్పారెల్ టెక్నాలజీస్); కటక్-ఒడిశా క్యాంపస్‌లో డిప్లొమా(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఆటొమొబైల్).

అర్హత:
కోర్సును అనుసరించి పదో తరగతి/ఇంటర్/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉర్దూ మీడియంలో గానీ ఉర్దూ ఒక సబ్జెక్టుగా గానీ చదివి ఉండాలి. వర్సిటీ గుర్తింపు పొందిన మదర్సాలలో చదువుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంటెక్



పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ(డీఐఏటీ)- ఫుల్ టైమ్ ఎంటెక్ (సెల్ఫ్ ఫైనాన్స్‌డ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రాత పరీక్ష ద్వారా రెండు ఫేజ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఎటువంటి స్కాలర్‌షిప్‌లు, అసిస్టెంట్‌షిప్‌లు లభించవు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు మాత్రం ఏఐసీటీఈ పీజీ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

విభాగాలు - స్పెషలైజేషన్‌లు

- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్
- ఏరోస్పేస్ ఇంజనీరింగ్ - గైడెడ్ మిసైల్స్ యూఏవీ
- మెకానికల్ ఇంజనీరింగ్ - మెరైన్, ఆర్మమెంట్ అండ్ కంబాట్ వెహికిల్స్, మెకానికల్ సిస్టం డిజైన్
- ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - రాడార్ అండ్ కమ్యూనికేషన్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్‌ఎస్‌ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- రోబోటిక్స్ - ఆటొమేషన్ అండ్ రోబోటిక్స్
- ఇతర విభాగాలు: సెన్సార్ టెక్నాలజీ, మోడలింగ్ అండ్ సిములేషన్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, డేటా సైన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీ.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ లేదా మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/అప్లయిడ్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్ సైన్స్/ఫొటోనిక్స్/మెటీరియల్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ సైన్స్/నానో సైన్స్ అండ్ టెక్నాలజీ/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/రేడియో ఫిజిక్స్-ఎలక్ట్రానిక్స్/రిమోట్ సెన్సింగ్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/మేథమెటిక్స్/కెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/స్టాటిస్టిక్స్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి.

రాత పరీక్ష: పరీక్షని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. సంబంధిత స్పెషలైజేషన్ నుంచి 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యుఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200

ఫేజ్-1:

- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 18
- **రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 23
- **రాత పరీక్ష తేదీ:** మే 1
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** మే 2న
- **కౌన్సెలింగ్:** మే 2, 3

ఫేజ్-2:

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 19
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 7
- **రాత పరీక్ష తేదీ:** జూన్ 24
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** జూన్ 25
- **కౌన్సెలింగ్:** జూన్ 25, 26
- **స్పాట్ అడ్మిషన్స్:** జూలై 19
- **ఈ-మెయిల్:** mtech-admissions@diat.ac.in
- **వెబ్‌సైట్:** www.diat.ac.in

ఆర్ఐఈఐలో డిప్లొమా, పీజీ డిప్లొమా

బెంగళూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, సౌత్ ఇండియా(ఆర్ఐఈఎస్ఐ)- దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 'డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్(డీఐఈసీ)', 'పీజీ డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్(పీజీడీఈఎల్‌టీ)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.



డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్(డీఐఈసీ)

అభ్యర్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్: ఒకాబులరీ, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించేలా ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫ్లూయెన్సీ, అక్యూరసీ, డిస్కోర్స్ మేనేజ్‌మెంట్ మాడ్యూల్స్‌తోపాటు ఒక ఆప్షనల్ మాడ్యూల్(ఇంగ్లీష్ లాంగ్వేజ్ పెడగాగి/ఇంగ్లీష్ ఫర్ బిజినెస్/ఇంగ్లీష్ ఫర్ మీడియా)కూడా ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తమ్మీద రెండు కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మొదటిది రెండు రోజుల ప్రోగ్రామ్. దీనిని 2024 అక్టోబరులో ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. రెండోది 18 రోజుల ప్రోగ్రామ్. దీనిని 2025 ఏప్రిల్/మేలో ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏ గ్రూపుతోనైనా ఇంటర్/పన్నెండో తరగతి/పీయూసీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు రూ.4,000.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (పీజీడీఈఎల్‌టీ)

ఈ ప్రోగ్రామ్‌లో ప్రొఫిషియెన్సీ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, కోర్ ట్రెయినర్ - స్కిల్స్ - స్ట్రాటజీస్ - టెక్నిక్స్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. లిజెనింగ్ అండ్ స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, లాంగ్వేజ్ వర్క్, మెథడ్స్ అండ్ మెటీరియల్స్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, టీచర్ డెవలప్‌మెంట్, టీచింగ్ ప్రాక్టీస్ అంశాలు కూడా ఉంటాయి. ఆరు బుక్‌లెట్స్‌తో కూడిన లెర్నింగ్ మెటీరియల్ ఇస్తారు. వీటికి సంబంధించిన అసైన్‌మెంట్ వర్క్‌లు పూర్తి చేయాలి. ఈ ప్రోగ్రామ్‌లో కూడా రెండు కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మొదటిది మూడు రోజుల ప్రోగ్రామ్. దీనిని 2024 అక్టోబరులో ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. రెండోది 22 రోజుల ప్రోగ్రామ్. దీనిని 2025 ఏప్రిల్/మేలో ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ ప్రోగ్రామ్‌ని గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు రూ.10,000.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు:** పదోతగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్‌లు; ఆధార్ కార్డ్, రెండు ఫొటోలు.
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ద డైరెక్టర్, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్, సౌత్ ఇండియా, జనభారతి క్యాంపస్, బెంగళూరు - 560056.
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూన్ 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.riesi.ac.in

యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామ్



కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్/జీడీఎంవో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహిస్తోంది.

కేటగిరీ-1:

- మెడికల్ ఆఫీసర్స్ (గ్రేడ్ ఇన్ జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్): 163 పోస్టులు

కేటగిరీ-2:

- అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్(రైల్వేస్): 450 పోస్టులు

జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్): 14 పోస్టులు

జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్-2(మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ): 200 పోస్టులు

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. మెడికల్ ఆఫీసర్స్(గ్రేడ్ ఇన్ జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్) పోస్టులకు మాత్రం 35 ఏళ్లు మించకూడదు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

పరీక్ష వివరాలు

- ఇందులో రిటెన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఉంటాయి.
- **రిటెన్ ఎగ్జామినేషన్:** ఇది 500 మార్కులకు ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్ 250 మార్కులకు ఉంటుంది. పేపర్‌కు పరీక్ష సమయం రెండు గంటలు. మొదటి పేపర్‌లో జనరల్ మెడిసిన్ నుంచి 96 ప్రశ్నలు, పీడియాట్రిక్స్ నుంచి 24 ప్రశ్నలు చొప్పున మొత్తం 120 ప్రశ్నలు ఇస్తారు. రెండో పేపర్లో సర్జరీ, గైనకాలజీ, ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ అంశాల నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు చొప్పున మొత్తం 120 ప్రశ్నలు ఇస్తారు. రెండు పేపర్లలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఎంబీబీఎస్ సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. నెగెటివ్ మార్కులు ఉన్నాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. ఈ ఎగ్జామ్‌లో అర్హత పొందినవారిని మాత్రమే పర్సనాలిటీ టెస్ట్‌కు అనుమతిస్తారు.
- పర్సనాలిటీ టెస్ట్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అకడమిక్ స్టడీ, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. అలాగే నాయకత్వ లక్షణాలు, నిర్ణయాత్మక ధోరణి, ఏకాగ్రత, నూతన అంశాలపై ఉత్సుకత తదితర లక్షణాలను పరిశీలిస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్‌లు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200 (మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 1 నుంచి 7 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి
- **కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024 తేదీ:** జూలై 14
- **వెబ్‌సైట్:** https://www.upsc.gov.in/

UPSC

లిటిల్స్



మీకు తెలుసా?

- డేగ జాతికి చెందిన వీటి పేరు 'ఫాల్కన్'. ప్రపంచవ్యాప్తంగా వీటి జాతి 60 రకాలున్నాయి. గంటకు 242 మైళ్ల వేగంతో గాల్లో ప్రయాణిస్తాయి.
- 3500 ఏళ్ల క్రితం నుంచి కొన్ని రకాల పక్షులను, చిన్న జంతువులను వేటాడటానికి ఉపయోగించేవారు. మగ పక్షులే అగ్రెసివ్‌గా ఉంటాయి.
- మనిషితో పోలిస్తే ఎనిమిది రెట్లు అధికంగా వీటి చూపు ఉంటుంది. రెండు మైళ్ల దూరంలో ఉన్న చిన్న జీవిని కూడా ఇవి గాల్లోంచి చూడగలవు. ఎంత వేగంగా గాలి వీచినా వాటి రెక్కలతో, శరీరంతో అలసి పోకుండా బుల్లెట్‌లా దూసుకుపోగలవు.



- నాలుగు లేదా ఐదు గుడ్లను మాత్రమే పెడతాయి. పొదిగే కాలం ఇరవై ఐదు రోజులు.
- చిన్న పురుగులు, బల్లులు, కప్పలు, చేపలు, పావురాలు, చిన్న బాతులు, నీటి పక్షులను తింటాయివి.
- ఫాల్కన్ పక్షుల బరువు కేజీ ఇరవై గ్రాముల వరకూ ఉంటుంది. ముఖ్యంగా ఈ పక్షులను అరబ్ దేశాల్లో పందేలకోసం ఉపయోగిస్తారు.
- ఇవి బ్రిడ్జిల మీద, ఎత్తయిన చెట్ల మీద, ఎత్తయిన కట్టడాల మీద మాత్రమే గూళ్లు కట్టుకుంటాయి.
- ఎడారులే కాకుండా సముద్ర ప్రాంతాలు, పచ్చికబయళ్లు, దట్టమైన అడవుల్లో కూడా ఇవి నివసిస్తాయి.
- మగపక్షి వేటకు వెళ్లి గూటిలోని పిల్లలకే కాదు ఆడపక్షికీ ఆహారాన్ని తీసుకొచ్చి పెడుతుంది.
- గోధుమరంగు, పసుపు పచ్చ, బూడిద రంగు, తెలుపు, నలుపు రంగుల్లో ఉంటాయి.
- వీటి జీవనకాలం 18 సంవత్సరాలు.

సరైన నీడ ఏది?





10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 281

8	6					3		
			1				6	
7	4	3		6				5
	3	7	8			9		
2								3
		6			9	4	7	
3				1		7	8	6
	1				7			
		2					1	4

సుడోకు - 280 సమాధానం

7	1	4	9	5	6	2	3	8
5	3	9	2	1	8	4	7	6
6	2	8	4	7	3	5	9	1
8	4	1	3	6	7	9	5	2
2	5	7	8	9	4	1	6	3
9	6	3	5	2	1	7	8	4
1	8	2	7	3	9	6	4	5
4	9	6	1	8	5	3	2	7
3	7	5	6	4	2	8	1	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.